1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 4
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

సెప్టెంబరు 2020

సెప్టెంబరు 19: తాపీ ధర్మారావు పుట్టిన రోజు

## తెలుగు జనమాధ్యమాల దినోత్సవం









జాతీయ విద్యావిధానం :
ఈశాన్య రాష్ట్రాల
జనజాతుల భాషలకు
పొంచివున్న ముప్పు

+ జాతీయ విద్యావిధానం 2020 – మాతృభాష
+ తెలంగాణలో మాతృభాష ప్రాధాన్యం–సవాళ్ళు + తెలుగు నేర్పడంలో మెలకువలు
+ అడుగుజాడల్లో ఆనవాళ్ళు– కొత్త ధారావాహిక ప్రారంభం....
+ తాపీ ధర్మారావు సాహిత్య విమర్శ

## జాతీయ విద్యావిధానం చూపు ఎటువైపు ?

తెలుగు భాషాదినోత్సవ శుభాకాంక్షలు!!!

తెలుగు భాషోద్యమ సమాఖ్య

(రిజి. 1288/2003)

నిర్వహించే



# తెలుగు మొబైల్ యాపుల పోటీ & తెలుగు వ్యాసరచనల పోటీ

<u>యాప్ పోటీ</u>

మొదటి బహుమతి రూ. 1 లక్ష, 1 జట్టుకు
రెండవ బహుమతి రూ.50,000/-, రెండు జట్లకు
మూడవ బహుమతి రూ. 33,333/-, మూడు జట్లకు



<u>వ్యాసరచన</u>

వంద ఉత్తమ వ్యాసాలకు ఒక్కొక్క వ్యాసానికి
వెయ్యి రూపాయల నగదు బహుమతి.

పోటీ మొదలు : ఆగస్టు 29, 2020
పోటీ గడువు : జనవరి 1, 2021 మధ్యాహ్నం 12 గం॥ వరకు
అంశం : తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, చరిత్రలకు సంబంధించినదై ఉండాలి.
మరిన్ని వివరాలకు : telugubhashodyamasamakhya.blogspot.com
పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సాంఖ్యిక ప్రమాణపత్రం అందిస్తాం!
సంప్రదించండి : tebhasapoti@gmail.com

డా. చుక్కా రామయ్య, గౌరవాధ్యక్షులు
డా. సామల రమేశ్ బాబు, అధ్యక్షులు
తెలుగు భాషోద్యమ సమాఖ్య

నిర్వహణ
ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు,
వీవెన్,
రహ్మానుద్దీన్

వివరాలకు వెనుకఅట్ట లోపలిపుట చూడండి

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



సెప్టెంబరు 2020

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | జాతీయ విద్యావిధానం చూపు ఎటువైపుకు? | | **05** |
| **జాతీయ విద్యావిధానం:** | జాతీయ విద్యావిధానం 2020.. | డా॥ఎన్.ముక్తేశ్వరరావు | **07** |
| **జాతీయ విద్యావిధానం:** | ఈశాన్య రాష్ట్రాల జనజాతుల... | **రహ్మానుద్దీన్ షేక్** | **09** |
| **జాతీయ విద్యావిధానం:** | తెలంగాణలో మాతృభాష..... | **కందగట్ల శ్రవణ్‌కుమార్** | **12** |
| **తెలుగు బోధన:** | తెలుగు నేర్పడంలో మెలకువలు-2 | సి.వి. **క్రిష్ణయ్య** | **14** |
| **ఇదీ దారి:** | తప్పు చేయ్యడం.... | **జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి** | **18** |
| **తెలుగు జనమాధ్యమాల..** | ద్వేషరాహిత్యం,సమన్వయం.. | డా॥**నాగసూరి వేణుగోపాల్** | **20** |
| **పీవీ శతజయంతి:** | 'నవోదయా'నికి నాంది... | **బండారు రామ్మోహనరావు** | **22** |
| **సంప్రదాయం- సాధికారత** | నీ కొసం, నీ మంచి కోసం | **డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'** | **36** |
| **సాహిత్య రంగం:** | "అదే నేల" పుడుతుంది... | **డా॥ మధురాంతకం నరేంద్ర** | **42** |
| **యాత్రాసాహిత్యం:** | ఆమె లేఖలు | **డా॥ కాళిదాసు పురుషోత్తం** | **44** |
| **పరిచయం:** | వెన్నెలకంటి వ్యాకరణం | **డా॥గారపాటి ఉమామహేశ్వరరావు** | **46** |
| **పుస్తక పరిచయం:** | పరమపూజనీయ డా॥హెడగేవార్ | **ఎం.వి. శాస్త్రి** | **49** |
| **మాటల పుట్టుక :** | పదనిష్పాదనకళ | **వాచస్పతి** | **24** |
| **నవల :** | జగమునేలిన తెలుగు- 9 | **డి.పి.అనూరాధ** | **29** |
| **ధారావాహికలు:** | అడుగుజాడల్లో ఆనవాళ్ళు-1 | **డా॥ఈమని శివనాగిరెడ్డి** | **33** |
| | పడమటి గాలితో... | **ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి** | **39** |
| **కవితలు :** | మనసే ఒక దీపం | **డా.ఎన్. గోపి** | **17** |
| | బాపట్ల నానీలు | **డా॥ సి.భవానీదేవి** | **41** |
| | తెలుగు నుడి | **డా॥ పాండాల మహేశ్వర్** | **48** |



| కార్టూన్లు | ఫోటోలు | కంప్యూటరీకరణ |
|---|---|---|
| **సరసి** | **తమ్మా శ్రీనివాసరెడ్డి** | **బండారు రఘురాం** |


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సయాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.





## యల్లపు ముకుందరామారావు గారికి
## తాపీ ధర్మారావు పురస్కారం

' 2020 సెప్టెంబరు19- తాపీ ధర్మారావు గారి 133వ పుట్టినరోజున- ఏర్పాటు చేయాలనుకొన్న పురస్కార కార్యక్రమాన్ని- ప్రభుత్వం 'కరోనా' కట్టుబాట్లను ఇంకా తొలగించనందువల్ల వాయిదా వేయక తప్పడంలేదు. త్వరలోనే ఈ పురస్కార సభను జరిపి ముకందరామారావు గారిని సత్కరించు కొందాం. సహకరించ ప్రార్థన.

**- సంపాదకుడు,'అమ్మనుడి'**

## పాఠకులకు, అభిమానులకు విన్నపం

❖ 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. వివరాలు ఈ పుటలోనే గలవు. దయచేసి ఆ సూచనలను అనుసరించ ప్రార్థన.

❖ చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.

❖ నెట్‌లో పత్రికను పొందగోరేవారు దయచేసి తమ 'మెయిల్ ఐడి'ని తెలుపండి. చందాదారులకు మాత్రమే పంపించబడుతుంది.

❖ 'అమ్మనుడి' పత్రికను నడుపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక – మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

–ప్రచురణకర్త

**తెలుగుజాతి పత్రిక**
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

### చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**–యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అకౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో – చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8–386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, తెనాలి
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ–మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ–మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

సంపుటి : 6 సంచిక : 4
అమ్మనుడి
సెప్టెంబరు 2020

సంపాదక హృదయం

# జాతీయ విద్యావిధానం చూపు ఎటువైపు?

**ఆగస్టు** సంచిక అచ్చుకు వెళ్లేందుకు సిద్ధమైన దశలో జులై 29న నూతన జాతీయ విద్యావిధానం విడుదలయింది. వెంటనే దానిపై సంపాదకీయంలోనూ దానితోపాటే 'జాతీయ విద్యావిధానం-2020: మంచీ చెడూ' వ్యాసంలోనూ మా అభిప్రాయాలను కొంతవరకు వెలిబుచ్చాము. గడిచిన నెల రోజులుగా పత్రికల్లో, ప్రసారమాధ్యమాల్లో, వలగూడు(ఇంటర్‌నెట్) సమావేశాల్లోనూ ఎన్నో అభిప్రాయాలు, చర్చలు వెలుగుచూశాయి. ఇంకా విస్తారంగా ఈ పని జరిగుండవచ్చుగాని, ఇప్పుడున్న కోవిడ్ గందరగోళం వల్ల అదంతా కుదించుకు పోయింది.

ఆరేళ్లుగా మోదీ ప్రభుత్వపాలననూ, విధానాలనూ మనం గమనిస్తున్నాం. దేశం మొత్తం మీద రాజకీయంగా ఈ ప్రభుత్వాన్ని సమర్థించే లేదా తటస్థంగా ఉండే జనాభిప్రాయమే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. వామపక్ష పార్టీలు, ఇతర ప్రతిపక్షాలూ రాజకీయంగా బలమైన వ్యతిరేకతను కూడగట్టి, ఉద్యమించగల సమైక్యశక్తిని కోల్పోయాయి.

జాతీయ ఐక్యతా, ప్రగతీ లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామంటున్న పాలక పార్టీ, అందుకై అనుసరిస్తున్న విధానాల పట్ల శంకలున్నవారూ, భిన్నాభిప్రాయాలున్నవారూ ఆ పార్టీ సానుభూతిపరుల్లో కూడా చాలా మంది ఉన్నారు. కాని, వారికి ప్రతిపక్షాల చిత్తశుద్ధిపై గాని, సమర్థతపై గాని నమ్మకంలేదు. ఈ పరిస్థితే ఇప్పుడు జాతీయ విద్యావిధానం పైన కూడా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలో కొంతవరకు అడ్డుగోడగా నిలిచింది. విద్యా, భాషా రంగాల్లో దేశీ విదేశీ పెట్టుబడిదారీ శక్తులు ప్రభుత్వాలనే గాక, ప్రతిపక్షాలను కూడా నియంత్రించగలుగుతున్నాయి. అందువల్ల విద్యా, భాషారంగాల్లోని నైతికశక్తులు ఒంటరివైపోయి, ప్రజలపైనా ప్రభుత్వాలపైనా అంతగా ప్రభావం చూపలేకపోతున్నాయి.

ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఏం చేయదలచుకొన్నా ఎదురులేకుండాపోతున్నది. కొత్త జాతీయ విద్యావిధానాన్ని ప్రకటించేముందు రాష్ట్రాలను కూడా కలుపుకురావాలనే ముఖ్యవిషయాన్ని అంతగా పట్టించుకోలేదు (రాజ్యాంగంలో విద్య కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోని అంశమన్న సంగతి తెలిసిందే!).

కొత్త విద్యావిధానంలోని వివిధ పాలనాంశాల అమలుకై పలు చట్టాలను తేవలసి ఉంది. ఆ సందర్భంగా చట్టసభల్లో చర్చకు ప్రతిపాదనలు వచ్చినప్పుడు ఎవరు ఎంతవరకు కీలకాంశాలను తెరపైకి తేగలరో చివరకు ఆ చట్టాలు ఎలా బయటకువస్తాయో చూడాలి. ఆ చట్టాల అమలు ఎంత ఖచ్చితంగా జరగగలదో, ప్రకటిత ఆశయాదర్శాలు, లక్ష్యాలు ఎంతవరకు నెరవేరతాయో కూడా మనం వేచి చూడాల్సిందే.

కొన్ని ముఖ్య అంశాల గురించి మాట్లాడుకొందాం. విద్యాప్రణాళికలోనూ పాఠ్యప్రణాళికలోనూ చాలా మార్పులు తెస్తున్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 'సుస్థిర అభివృద్ధి' లక్ష్యాల ప్రకటనలో మనదేశం కూడా సంతకం చేసింది. దాని ప్రకారం విద్యను సమస్త అవసరాలకు, శాస్త్రసాంకేతికరంగ మార్పులకు తగ్గవిధంగా రూపొందించుకోవాలి. దీనికనుగుణంగా మన జా.వి.వి.ని సిద్ధంచేయడంతో పాటు దాని ముందున్న మరొక ప్రధాన బాధ్యత- ప్రభుత్వం ఆశిస్తున్న భాషాసాంస్కృతిక అంశాలను, విధానాలను పొందుపరచడం. అందువల్ల దృఢమైన భారత జాతీయతను తీర్చిదిద్దేందుకై మన భాషల్లోనూ, సాంస్కృతికతలోనూ ఉన్న వైవిధ్యాలను గుర్తించకుండా సంస్కృతాన్ని, హిందీని సమున్నతంగా నిలబెట్టే లక్ష్యంతో జా.వి.వి.ని రూపొందించారు. ప్రపంచంలోనే సంఖ్యలోనూ, ప్రాచీనతలోనూ తొలి వరుసలో ఉండే తెలుగు వంటి ద్రావిడభాషల ప్రత్యేకతను పక్కనపెడుతున్నారు. ఎంతో తెలివిగా సూచించిన మార్గదర్శకాల్లో ఈ కుట్రపూరిత ధోరణి అర్థమవుతూనే వుంది. దీనిపై చర్చ జరగాలి. ఇదేవిధంగా జనసంఖ్యలో తక్కువగా ఉన్న గిరిజన భాషల విషయంలోనూ బాధ్యతను ప్రకటించలేదు.

సాంస్కృతికంగా కూడా మన దేశంలో ఉన్న వైవిధ్యాన్ని ప్రేమించి, అందరినీ కలుపుకొచ్చే విధంగా 'సమైక్యతను'

సాధించాలి తప్ప, 'ఏకత' కోసం ఆరాటపడకూడదు. సామాజిక, వ్యక్తిగత ఆచారాలు కూడా చాలా సందర్భాల్లో ఆచరణలో వారి మతాచారాలతో కలిసిపోయి ఉంటాయి. పరస్పరం వాటిని గౌరవించుకోవాలి. ఆధ్యాత్మికతకూ, వేదాంతానికీ, మతాలకూ ఉన్న సున్నితమైన భేదాల్లాంటివే ఇవి. వీటిని మన్నించే సమాజాన్ని నిర్మించడం కోసం తగిన విద్యావిధానాలను రూపొందించాలి. విద్యార్థిదశలోనే ఇలాంటి ప్రాతిపదికలను ఏర్పరచాలి.

అన్నిటికంటే ముఖ్యమైన సంగతి– కిందినుండి పై స్థాయి వరకూ విద్యారంగ నిర్వహణ ఎవరిచేతుల్లో ఉండబోతున్నదనేది. దాదాపుగా గడచిన నలభై ఏళ్ళుగా మెల్లమెల్లగా మన ప్రభుత్వాలు విద్యారంగంలో తమ బాధ్యతలకు నీళ్లొదులుతున్నాయి. కొద్దికొద్దిగా మొదలైన ఈ ధోరణి పెరిగి పెరిగి 'ప్రపంచీకరణ విధానాలు' ఊపందుకున్న గత రెండు దశాబ్దాలకు పైగా మొత్తం విద్యావ్యవస్థ పెట్టుబడిదారుల, విద్యావ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. రాజకీయనాయకులు ఈ వ్యాపారంలోకి చేరడమో ఇందులోని వారే రాజకీయాల్లోకి చేరి ఉన్నత పదవుల్లో పెత్తనం చేయడమో జరిగిపోతూనే వుంది. ఇదొక ప్రత్యేకమైన 'మాఫియా' లక్షణాలను సంతరించుకొంటున్నది. ఈ పరిస్థితులు కొత్త విధానం వల్ల మారుతాయా అంటే అందుకు ఏమాత్రం అవకాశం లేదనే అనిపిస్తున్నది. కొత్త విద్యావిధానాన్ని నిశితంగా పరీక్షిస్తే ఈ అంశం స్పష్టమవుతుంది.

కొత్త విధానం ప్రకారం నిర్వచించిన 5+3+3 వరకైనా – అంటే పాఠశాల విద్యను పూర్తిగా ప్రభుత్వం చేపట్టి బాధ్యతతో నిర్వహించాలి. ఆ పై విద్యలో ఆర్థికానికి సంబంధించి ఏం చేస్తారన్నది వేరే అంశం. పరిశ్రమలు తదితర అభివృద్ధి కార్యక్రమాల కోసం లక్షల కోట్లు వెచ్చించి మౌలిక వసతుల పేర సమస్త సౌకర్యాలనూ కలుగజేస్తున్న ప్రభుత్వాలు, మన బిడ్డలను–భావిపౌరులను– సమానంగా అభివృద్ధి చేసేందుకు కావలసిన మౌలిక విద్యను కనీసం పాఠశాల విద్యను అందరికీ ఒక రాజ్యాంగ హక్కుగా ఉచితంగా సమకూర్చవద్దా? ఇందుకు అవసరమైన చట్టాలను, అవసరమైతే రాజ్యాంగసవరణలనూ చేసి, ముందుకు సాగాలి. ప్రపంచంలో అనేక దేశాలు విద్యారంగానికై స్థూలజాతీయోత్పత్తిలో 10 శాతం వరకూ కేటాయిస్తుంటే మనం అందుకోసం వెచ్చిస్తున్నది 4 శాతంలోపు! ఇప్పుడు దీనిని 6 శాతం వరకు పెంచాలనే ప్రతిపాదనను జా.వి.వి. సూచిస్తున్నా, ఇదెంతవరకు జరుగుతుందో నమ్మకం కుదరడం లేదు.

దేశంలోని సామాజిక అసమానతల దౌర్భాగ్యం నుండి, ఆర్థిక దోపిడీ నుండి కనీసం పాఠశాల విద్యావ్యవస్థను విముక్తం చేయాలి. ఇందుకు పూనిక వహించని విధానాలు ప్రజల మేలుకోరేవి కావు.

పాఠశాల విద్యలో కనీసం ప్రాథమిక విద్య వరకూ, అమ్మనుడుల్లో బోధన జరగాలని, వీలైతే 8 వరకూ అలా ఉండాలని జా.వి.వి. అంటున్నది. మరి ఈ అంశాన్ని దేశమంతా ఒకేరీతిలో ఆచరణలోకితెచ్చేటట్లు కేంద్రం బాధ్యత వహించగలదా? అవసరమైన చట్టాల సవరణలు లేదా రాజ్యాంగ సవరణలు చేసి దీనిని తప్పనిసరి చేసేందుకు కేంద్రప్రభుత్వం పూనుకొంటుందా? ('అమ్మనుడి' జనవరి 2020 సంపాదకీయం చూడండి). ఇందుకు తగ్గ నిర్ణయాన్ని రానున్న పార్లమెంటు సమావేశాల్లో ప్రకటించగలదా? పాఠశాల విద్య (కనీసం 5+3+3 వరకు) నుండి అన్నిరకాలైన ప్రయివేటు విద్యాసంస్థలను తొలగించి, ప్రభుత్వమే వాటి నిర్మాణాన్ని, నిర్వహణను చేపట్టి అందరికీ సమానమైన విద్యను ఉచితంగా అందించడానికి సిద్ధపడుతుందా? ఈ రెండు అంశాలు ఆచరణలోకి రాకుండా, జా.వి.వి. ఏమి చెప్పినా, ప్రభుత్వం ఏంచెయ్యబోతున్నా వాటిని నమ్మడానికి వీల్లేదు.

ఈ విద్యావిధానం వల్ల ప్రాథమిక విద్య వరకూ తెలుగుకు పట్టం కట్టబోతున్నారని కొందరు భ్రమపడుతున్నారు. వారు దయచేసి శ్రద్ధగా జా.వి.వి.ని మళ్లీ పరిశీలించాలి. ఎక్కడా, తప్పనిసరి అనిగాని, అందుకవసరమైన చర్యలు చేపడతాం అనిగాని చెప్పలేదు. విద్యార్థులకు స్వేచ్ఛనిస్తున్నామని, రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉందనీ నీతులు పలుకుతున్నారు. ఈ సందుల్లోంచి మన రాష్ట్ర ప్రభుత్వాల్లోని స్వార్థశక్తులు ఎన్ని అవకాశాలను వెతికి తీస్తాయో చూడండి.

ఇక ఇంగ్లీష్ సంగతి– ఎక్కడా దాని ఆధిపత్యాన్ని కట్టడి చేసే చర్యలను జా.వి.వి.లో ప్రస్తావించలేదు. పైగా– త్రిభాషా సూత్రంలో రెండు దేశీయ భాషలుండే సంగతి ఎట్లావున్నా, మరో భాషగా– ఇంగ్లీషు స్థానం దేశమంతా భద్రంగా ఉంటుంది. చట్టాలను అమోదించడం నుండి పరిపాలనలో అన్ని దశల్లోను, కోర్టుల్లోనూ దాని స్థానం మరింత పదిలం అవుతూనే ఉంటుంది. దానితో పాటు హిందీ, సంస్కృతాలకూ మంచి భవిష్యత్తే. ఎటుతిరిగీ తక్కిన జాతీయ ప్రజల భాషలకు కలిగే ముప్పుకు జా.వి.వి అడ్డుకట్ట వెయ్యడం లేదు! రాజకీయ, ఆర్థిక, సామాజిక దోపిడీకి, ఆధిపత్యానికి మనం లొంగిపోవలసిందేనా?

సామల రమేష్‌బాబు

తేదీ : 31–8–2020

ఎన్. ముక్తేశ్వరరావు ఐ.ఏ.యస్.(విశ్రాంత)
94914 28078

# జాతీయ విద్యావిధానం 2020 – మాతృభాష

**కొత్తగా వచ్చిన జాతీయ విద్యావిధానం 2020 నాలుగవ అధ్యాయంలో పాఠ్యప్రణాళిక గురించి, బోధన గురించి ఎక్కువగా మాట్లాడింది. ఈ సందర్భంగా భాషలకు కీలక ప్రాధాన్యం ఇచ్చింది.**

మనం నేర్చుకునే జ్ఞానం మన సంపూర్ణ అభివృద్ధికి సమగ్ర అభివృద్ధికి దోహదపడే దిగా ఉండాలని, రెండోది మనం నేర్చుకునేది చాలా సంతోషదాయకంగా, ఆనందప్రదంగా ఉండాలని అదే సమయంలో ఉపయోగపడేదిగా కూడా ఉండాలని అన్నారు.

**పాఠ్యప్రణాళిక పునర్వ్యవస్థీకరణ ఎందుకు?**

ఇప్పుడున్న పాఠ్యప్రణాళిక, బోధనశాస్త్రం గురించి మాట్లాడటానికి ముందు పాఠ్యప్రణాళిక పునర్ వ్యవస్థీకరణ గురించి మాట్లాడారు. దీన్ని 4 విభాగాలు చేశారు.

1 ఫౌండేషన్ దశ/ మౌలిక దశ 2 ప్రిపరేటరీ దశ/ సంసిద్ధతా దశ
3 మిడిల్ స్టేజ్/ మధ్యస్థ దశ 4 సెకండరీ స్టేజ్

మొదటి దశ ఐదు సంవత్సరాల పాటు ఉంటుంది.3 నుండి 8 సంవత్సరాల లోపు. సంసిద్ధతా దశ మూడు సంవత్సరాల పాటు ఉంటుంది.8 నుండి 11 సంవత్సరాల లోపు. అలాగే మధ్యస్థ మూడు సంవత్సరాల పాటు ఉంటుంది.11 నుండి 14 సంవత్సరాల లోపు. సెకండరీ స్టేజి 14 నుండి 18 సంవత్సరాల లోపు ఉంటుంది.

అలాగే మౌలికదశ ఐదేళ్లలో మూడు సంవత్సరాలు అంగన్వాడీ లోనూ, రెండు సంవత్సరాలు గ్రేడ్–1 గ్రేడ్–2 మౌలికదశలో ఉంటాయి. గ్రేడ్ మూడు నాలుగు ఐదు సంసిద్ధతాదశలో ఉంటాయి. గ్రేడ్ 6, 7, 8 మధ్యస్థదశలో ఉంటాయి. 9, 10 ఒక దశ గాను 11, 12 మరొక దశ గా ఉంటాయి. సెకండరీ దశ రెండు రకాలు ఫేజ్1, ఫేజ్ 2.

ఈ పునర్వ్యవస్థీకరణ ఎందుకు చేశారు అన్నది మనం బాగా అర్థం చేసుకోవాల్సిన అంశం. దీంట్లో ఏం కోరుకుంటున్నారు అంటే ప్రధానమైన మౌలికమైన మార్పు భాషల ద్వారా రావాలి. మనిషికి సర్వ సమగ్రమైన అభివృద్ధి రావాలి. వ్యక్తిత్వ నిర్మాణం జరగాలి. పాఠ్యప్రణాళిక, సహ పాఠ్యప్రణాళిక, పాఠ్యేతర పాఠ్యప్రణాళిక వీటి మధ్య తేడా తగ్గాలి. ఇవి వేర్వేరు అంశాలు కాదు. ఒకదానికొకటి పరిపూరకాలు. పాఠ్యప్రణాళికని రాశి పరంగా తగ్గించాలి. వాసి పెంచాలి. వాసి ఏ ముఖంగా పెరగాలి అన్నది ప్రశ్న. ప్రాథమికంగా విద్యార్థులను ఆలోచనాపరులుగా మార్చాలి. వారికి విమర్శన దృక్పథం రావాలి. ఎసెన్షియల్ థింకింగ్, క్రియేటివ్ థింకింగ్ ఈ రెండు పెరగటం కోసం పాఠ్యప్రణాళికని వీలైనంత తగ్గించాలి.

**పాఠ్యప్రణాళిక – ఇంటిభాష, స్థానికభాష :**

పాఠ్యప్రణాళికలో భాగంగా సైన్సు మొదలైన సబ్జెక్టులు ఎలా ఉండాలి అన్న విషయాన్ని చర్చిస్తూ దానిలో భాగంగా అత్యంత ప్రాథమికమైన మౌలికమైన ప్రశ్నలోకి వెళ్లారు. ఇవన్నీ మనం చేద్దాం అని అనుకుంటున్నాం. దాన్ని ఏ భాషలో చెబితే బాగుంటుంది? ఎలా చెబితే బాగుంటుంది? అని ప్రశ్నించుకున్నారు. ఆ ప్రశ్నలోకి వెళ్ళినప్పుడు వాళ్లు ఏమన్నారంటే తరగతిగది ప్రసారం (క్లాస్ రూమ్ ట్రాన్సాక్షన్) అన్నారు. ఇది పిల్లలకు ఇంటి భాషలోనే ఉండాలి అని స్పష్టంగా చెప్పారు.

ఇంటి భాష గురించి ప్రస్తావించినప్పుడు రెండు రకాల విషయాలను మనం చూడవచ్చు. ఇంటి భాష, పరిసరాలలో ఉండే భాష ఒకటే అవ్వడం ఒక పద్ధతి. ఉదాహరణకు మనం తెలుగు మాట్లాడతాం. మన బయట సమాజంలో కూడా తెలుగే వినిపిస్తుంది. మరికొన్ని సందర్భాలలో ఇంటి భాష వేరు కావచ్చు, చుట్టూ ఉన్న స్థానిక భాషలు వేరు కావచ్చు. ఉదాహరణకు మైనారిటీలుగా ఉన్న ప్రజలు తమిళం, కన్నడ, కోయ, గోండి మొదలైన భాషలను ఇంటి భాషగా మాట్లాడిన వారికి బయటి ప్రపంచంలో తెలుగు వినిపిస్తుంటుంది. ఇటువంటి సందర్భాల్లో ఏం చేయాలి అన్నదానికి ఇంటి భాషకి ప్రాధాన్యం ఇవ్వండి అని చెప్పారు. మాతృభాష అన్నది దీంట్లో కీలకమైన విషయం. ఎవరికి ఏది మాతృభాషో దాన్ని సుసంపన్నం చేయాలి. జ్ఞాన సంపన్నంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపయోగపడే అంశంగా మాతృభాషను చూస్తోంది జాతీయ విద్యా విధానం 2020.

**ఏ స్థాయిలో ఏ భాష?**

ఈసారి మాతృభాషను గురించి చేసిన ప్రస్తావనలో కొన్ని కీలకమైన విషయాలు చెప్పారు: 1. అయిదవ గ్రేడ్ వరకు మాతృభాష విధిగా ఉండితీరాలి. 2. ఎనిమిదవ గ్రేడ్ వరకు వీలైనంత వరకు మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వండి. 3. ఆ తర్వాత విద్యార్థి ఇష్టాఇష్టాల మీద ఆధారపడి దానిని కొనసాగించవచ్చు.

ప్రాథమిక దశలో మాతృభాష కచ్చితంగా ఉండాల్సిందేనని ఎన్.ఇ.పి. స్పష్టం చేసింది.

విద్యార్థి ఇంట్లో మాట్లాడుకునే భాష, బయట సమాజంలో మాట్లాడే భాష ఒకే రకంగా ఉన్నప్పుడు ఇంటిభాషలోనే వాచకాలు రావడం మంచిదని ఎన్.ఇ.పి చెప్పింది. విద్యార్థి ఇంట్లో ఒక భాష మాట్లాడుతూ బయట మరొకభాషలో వ్యవహరించాల్సిన సందర్భంలో నాణ్యత కలిగిన ద్విభాషావాచకాలను రూపొందించుకోవాలని సూచించింది. ఇవి సులభంగా నేర్చుకోవడానికి వీలుగా ఉండాలి.

**మాతృభాష ప్రభుత్వ బడులకు మాత్రమే పరిమితమా?**

ఇది చాలా మందిని కలచివేస్తున్న ప్రశ్న. ఇన్నాళ్ళు ప్రభుత్వ బడులకు ఒక న్యాయం, ప్రైవేటు బడులకు ఒక న్యాయం అన్నట్లుగా ఉండేది పరిస్థితి. దీనివల్ల మాతృభాషలో చదువుకున్న పిల్లలు వెనకబడి పోతున్నారని, ఆధునిక విజ్ఞానం అందుబాటులో ఉన్న ఇంగ్లీష్ – వారికి అందని ద్రాక్షగా మిగిలిపోతోందని కొన్ని వర్గాలు ఆందోళన చెందాయి. ఇప్పుడు జాతీయ విద్యా విధానం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రైవేటు పబ్లిక్ పాఠశాలలు రెండూ దీనిని విధిగా పాటించాలి.

**ద్విభాషా వాచకాలు మేలు :**

దీని అమలులో భాగంగా వాచక నిర్మాణం గురించి కూడా జాతీయ విద్యావిధానం ప్రస్తావించింది

వాచకాలను అత్యంత నాణ్యతతో రూపొందించుకోవాలి. అది పిల్లల భాషకు దగ్గరగా ఉండాలి. పిల్లలకు చాల విషయాలు నేర్పాలి అనే ప్రయత్నాల్లో వారిపై వేరే భాషలు రుద్దకుండా ఇంటి భాష లోనే

నేర్పించాలి.

ఇంటి భాష, స్థానిక భాష వేరువేరుగా ఉన్నప్పుడు ద్విభాషా వాచకాలు తయారుచేసుకోండని సూచించారు. ఎందుకు ఇలా తయారు చేసుకోవాలంటే ఇంటి భాషలో కొన్ని సాంకేతిక పదాలకు సమానార్థక పదాలు లేకపోతే స్థానిక భాష నుంచి ఆ పదాలను ఉపయోగించుకోవచ్చు. అలాగే స్థానిక భాషలో కొన్ని అభివ్యక్తులకు సరైన పదాలు దొరకకపోతే ఇంటి భాష నుంచి కూడా పదజాలాన్ని స్వీకరించవచ్చు. ఈ రకంగా స్థానిక భాషతో క్రమంగా అనుసంధానత పెరుగుతుంది.

ఇతర భాషలు నేర్చుకోవడానికి ఎన్.ఇ.పి. వ్యతిరేకం కాదు. చాలా భాషలు నేర్చుకోండి అని అది ప్రోత్సహిస్తుంది కూడా!

భాష నేర్చుకునే ప్రయత్నం లో భాగంగా బోధనమాధ్యమం ఉండరాదు. బోధన మాధ్యమం ద్వారా భాష వస్తుంది అని అనుకోవడానికి వీలులేదు; అన్నది ఎన్.ఇ.పి. ప్రధానంగా ప్రస్తావించిన అంశం. ఈ అంశాన్ని మనందరం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఒక భాషలో నైపుణ్యం సాధించాలి అంటే ఆ భాషని విడిగా – ఒక భాషగా నేర్చుకోవాలి. అంతే తప్ప బోధన మాధ్యమం మొత్తం ఆ భాషలో ఉన్నంత మాత్రాన భాష వస్తుంది అనుకోవడం పొరపాటు. ఇంగ్లీష్ బాగా రావాలంటే ఇంగ్లీషును ఎలా నేర్చుకోవాలో ఆ పద్ధతులలో నేర్చుకుంటే చాలు. ఇంగ్లీష్ మీడియంలో చదివినంత మాత్రాన ఇంగ్లీష్ రాదు. ఇదీ ఇక్కడ స్పష్టం చేసిన విషయం.

ఇంగ్లీష్ నేర్చుకోవాల్సిన అవసరం ఉంది అనడంలో వెనక్కి తగ్గాల్సిన పనిలేదు. అయితే మనం నేర్చుకోవాల్సిన ఇంగ్లీష్ ఎంత నేర్చుకోవాలి? ఎలా నేర్చుకోవాలి అన్న దాంట్లో ఒక్కరికి కూడా స్పష్టత లేదు.

భాష విషయంలో మనకు ఆ ప్రాపంచిక దృక్పథాన్ని ఇవ్వడానికి ఎన్.ఇ.పి. ప్రయత్నిస్తోంది.

**బహుభాషావిధానం :**

ఎన్.ఇ.పి. లో బహు భాషా విధానం మంచిదా కాదా అన్నది చర్చించారు. బహుభాషా విధానంవల్ల గ్రహణ సామర్థ్యాలు( కాగ్నిటివ్ ఎబిలిటీస్) పెరుగుతాయి. పిల్లవాడికి మూడు నుంచి 8 సంవత్సరాల లోపల అనేక భాషలు నేర్చుకునే శక్తి సామర్థ్యాలు ఉంటాయి. ఆ దశలో బహు భాషలను నేర్పవచ్చు అని చెప్పారు.

అయితే ఈ నేర్పే విధానం ఇంటర్ యాక్టివ్ గా ఉండాలి. అంటే ఒకరితో ఒకరు మాట్లాడుకునేట్లుగా వారిని కదిలించేలా, విషయంలో వారిని నిమగ్నం చేసేలా ఉండాలి అన్నారు

నేర్చుకునే నేర్పే ఏ కొత్త భాష అయినా సులభంగా చదువుకోడానికి వీలుగా పరస్పర సంభాషణాత్మకంగా క్రీడా ప్రాయంగా ఉండేటట్లు చేయాల్సిన అవసరం ఉంది. గ్రేడ్ 3 నుండి దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి.

దేశీయ/ ప్రాంతీయ భాషలను నేర్చుకోవడానికి ఉపాధ్యాయులను ప్రోత్సహించాలి అని ఎన్.ఇ.పి. చెప్పింది.

**ప్రపంచానుభవం ఎలాఉంది?**

మరో విశేషమైన సూచన ఏమిటంటే ప్రపంచవ్యాప్త పరిశీలన జరిపినప్పుడు సొంత భాషలో నేర్చుకున్న వ్యక్తుల సామర్థ్యమే ఎక్కువగా ఉంది. విద్య అభివృద్ధికి సాంకేతిక అభివృద్ధికి మాతృ భాష అవరోధం కాకపోగా సహాయకారిగా కూడా ఉంది అని ఆయా దేశాల అనుభవాలు నిరూపించాయి.

**భాషాధ్యయనం – జాతీయ సమైక్యత**

భారతదేశంలో సుందరమైన వ్యక్తీకరణలతో కూడిన భాషలు సాహిత్యము ఉన్నాయి. సినిమా, సంగీతం మొదలయిన రూపాలలో ఇవి ఉన్నాయి. వాటిని అధ్యయనం చేయడం జాతీయ సమైక్యతకు తోడ్పడుతుంది. ఎవరి మాతృభాషను వారు తప్పనిసరిగా నేర్చుకోవాలని ఎన్.ఇ.పి. చెప్తుంది.

**త్రిభాషాసూత్రం**

త్రిభాషాసూత్రం లో భాగంగా ఏ భాషను ఎంపిక చేసుకోవాలి అన్న అధికారం ఆయా రాష్ట్రాలకు ఉంటుంది. వారికి ఏ భాష ఇష్టమైతే ఆ భాష ఎంపిక చేసుకోవచ్చు. 6, 7 తరగతుల నుండి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలి. ఈ సందర్భంగానే వాచకాలను, అభ్యసన సామగ్రిని ఉభయభాషా విధానంలో మంచి నాణ్యతతో రూపొందించుకోవాలని చెప్పింది. ఇది విద్యార్థి రెండు భాషలలో విషయాలను నేర్చుకోవడానికి, వ్యక్తీకరించడానికి పనికి వస్తుంది.

**ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ :**

ఈ పథకంలో భాగంగా భారతదేశ భాషల మధ్య ఉన్న ధ్వన్యాత్మక సంబంధాన్ని అధ్యయనం చేయవచ్చును. లిపుల మధ్య ఉన్న సాదృశ్యాలను పరిశీలించవచ్చు. భాషల పరస్పర ప్రభావాన్ని గురించి తెలుసుకోవడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. సామెతలు, నుడికారాలు పరస్పరం పంచుకోవడం ద్వారా భాషా సమైక్యతను, దేశ సమైక్యతను సాధించవచ్చు. పిల్లలకు ఇది ఎంతో ఉపయోగకారిగా ఉంటుంది.

**సంస్కృతం అవసరం ఏమిటి?**

ఎన్.ఇ.పి. లో సంస్కృత భాషకు సంబంధించిన ప్రస్తావన ఉంది. గణితం, తత్వశాస్త్రం రాజనీతి శాస్త్రం భవన నిర్మాణము సంగీతము మొదలైన అనేక అంశాలకు సంబంధించిన శాస్త్రీయ విషయాలకు ఆటపట్టుగా సంస్కృతం ఉంది. అందువల్ల సంస్కృతాన్ని ఒక ఐచ్ఛిక అంశంగా నేర్చుకోవడానికి అవకాశం కల్పించారు.

సంస్కృతాన్ని రెండు పద్ధతులలో నేర్చుకోవచ్చు అని చెప్పారు.

1. (ఎస్.ఎస్.ఎస్.) సింపుల్ స్టాండర్డ్ సాంస్క్రిట్
2. (ఎస్ టి ఎస్) సాంస్క్రిట్ త్రూ సాంస్క్రిట్

భారతదేశంలో సంస్కృతాన్ని మనం జ్ఞానానికి ఒక భాండాగారంగా చూడవచ్చు.

తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం మొదలైన క్లాసికల్ భాషలతో పాటు పాలి, పార్సి మొదలైన భాషలను నేర్చుకోవడానికి తర్వాతి తరాల వారికి ఎన్.ఇ.పి అవకాశం కల్పించింది.

7–12 గ్రేడుల మధ్య 2 సంవత్సరాల పాటు క్లాసికల్ భాషలను నూతన విధానంలో అంటే అనుభవపూర్వక విధానంలో నేర్చుకోవడానికి వీలు కల్పించారు.

**భాష ఎలా నేర్పుదాం?**

అలాగే భాషను నేర్చుకోవడంలో క్రీడా పద్ధతి, యాప్స్, భాషలోని సాంస్కృతిక కోణాన్ని అధ్యయనం చేయడం మొదలైన పద్ధతులను ప్రవేశపెడుతున్నారు. భాషను కవిత్వం, నాటకం, సంగీతం మొదలైన భిన్న రూపాలలో నేర్పించవచ్చు అని ఎన్.ఇ.పి సూచించింది.

**ముగింపు**

భాష, మాతృభాష గురించి ఇవి స్థూలంగా ఎన్.ఇ.పి చెప్పిన ముఖ్యమైన అంశాలు. వీటిని చిత్తశుద్ధితో దేశమంతా అమలుచేస్తే సత్ఫలితాలు పొందుతామనడంలో సందేహం లేదు.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

## జాతీయ విద్యా విధానంలో భాషా వివక్ష

# ఈశాన్య రాష్ట్రాల జనజాతుల భాషలకు పొంచి ఉన్న ముప్పు

**మన దేశంలో ఎన్నెన్నో జాతులకు సంబంధించిన, కులాల కట్టుబాట్లలో జీవించే, మతాలను అవలంబించే, భాషలను మాట్లాడే ప్రజలము ఒకేదేశ వాసులమన్న నమ్మకంతో బ్రతుకుతున్నాం. మన ఆత్మలో భారతీయత ఉంది. ఆ భారతీయత అన్న భావనే మిగతా అన్ని అస్తిత్వాలకన్నా బలంగా మన జీవితాలను నడిపిస్తోంది. 74 ఏళ్ళ సుదీర్ఘ సహగమనంలో తరచూ అల్పసంఖ్యాకులు దౌర్జన్యానికి, దోపిడీకి, అధికసంఖ్యాకుల నుండి నిరాదరణకు గురవుతూనే ఉన్నారు.**

ఆ అల్పసంఖ్యాకులలో అత్యధిక నిరాదరణకు, ఉపేక్షకు గురవుతున్నవారు మన దేశ మూలవాసులు, ఆదిమజాతి వారు, అడవుల్లో బ్రతికే జనజాతులవారు. వారి భాష, కట్టుబాట్లు విశిష్టమైనవి. ప్రకృతిలో ఒక భాగంగా కనిపిస్తాయి. నాగరిక సమాజానికి ప్రకృతికి మధ్య వారధిగా ఉంటాయి.

ఈ జనజాతులవారిని ట్రైబ్/ట్రైబల్ అని ఆంగ్లంలో వ్యవహరిస్తారు. మన దేశ జనాభాలో 8.6 శాతం వీరే. వీరిని సూచించేందుకు వాడే ట్రైబ్ అనే పదం బ్రిటిష్ వారు కనిపెట్టినది. మిగితా జనాభాతో పోల్చితే భౌతిక ఆకారంలో, భాషా స్వరూపంలో, బ్రతికే వాతావరణంలో, చాలా వేరుగా ఉండే వారిని, నాగరికులకు దూరంగా వ్యవహరించే వారిని ఆనాడు బ్రిటిష్ వారు అలా సూచించారు. అవే పాత నియమాలను అనుసరించి నేటికీ భారత ప్రభుత్వం వీరిని గుర్తిస్తోంది. 2014లో జనజాతుల సామాజిక-ఆర్థిక-ఆరోగ్య-విద్యా స్థితులను అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ తమ నివేదికలో 705 విశిష్ట సమూహాలను షెడ్యూలు జాతులుగా(ST) గుర్తించింది.

ఈ భారతీయ జనజాతుల ప్రజల గురించి రెండు పరస్పర విరుద్ధ భావనలు మనకు తెలుస్తున్నాయి. ఆచార్య జి.ఎస్. ఘుర్యె ప్రకారం భారతదేశంలోని జనజాతుల వారంతా హిందూమతాన్ని పాటించేవారే. అధిక సంఖ్యాక హిందువులు వీరిని వెనక్కు నెట్టి అభివృద్ధికి దూరంగా అడవుల్లో, కొండల్లో ఉండిపోయేలా అశ్రద్ధ చేసారు అని ఇతని ప్రతిపాదన. ఇక ఇందుకు విరుద్ధంగా మానవశాస్త్రవేత్త, జనజాతుల పరిశోధకులు వెర్రియర్ ఎల్విన్ ప్రకారం జనజాతులవారు నాగరిక సమాజానికి దూరంగా ఉన్నంత వరకూ బాగానే ఉన్నారని, నాగరిక సమాజ సంపర్కంలోకి వచ్చి భూములకు, అడవులకు దూరమయ్యారని, ఆ విధంగా తమకు ఆధిపత్యం లేని ఆధునిక అభివృద్ధి కొలమానాల్లో వెనుకబడినవారిగా గుర్తించబడుతున్నారని భావన. రెండవ భావన ప్రకారం వారి సామాజిక, సాంస్కృతిక జీవితం బాగా దుష్ప్రభావానికి గురి అయిందని తెలుస్తోంది. ప్రతి సమూహానికీ భాషాధారిత అస్తిత్వం ఆ సమూహ సామాజిక, సాంస్కృతిక జీవనానికి కీలక ఆధారం. భాషలు చారిత్రక, భౌగోళిక విజ్ఞానానికి మరియు అంతర్-సమూహ



సంభాషణలకు పెన్నిధులు. జనజాతుల ప్రజల నోళ్ళల్లో వందల వేల భాషలు ఊపిరి తీసుకుంటున్నాయి. స్వాతంత్ర్యానంతరం వచ్చిన ప్రభుత్వాలన్నీ జాతీయవాద ఆలోచనలతో జనజాతుల ప్రజలు మిగితా దేశ జనాభాతో అంటిముట్టకుండా ఉన్నారని అనుకొని. వారిని సాధారణ ప్రజలతో కలిపితేనే అభివృద్ధి, దేశ ఐక్యత సాధించగలమని నమ్మాయి. ఆ విధంగా మన దేశంలో స్వాతంత్ర్యా నంతరం జనజాతుల కోసం చేసిన అన్ని చట్టాలు, జనజాతుల ప్రజలను వారి నైసర్గిక వాతావరణం నుండి బయట పడేసి, సాధారణ జనజీవన స్రవంతితో కలిసి నడిపించేలా ఉన్నాయి. భారత రాజ్యాంగంలో జనజాతులకు సంబంధించి ఎన్నో అంశాలు చెప్పబడ్డాయి, వాటిలో కూడా పై విధానమే కనిపిస్తుంది.

**తక్కువ జనాభా మాట్లాడే భాషలు త్వరలో అంతరించిపోతాయి...**

యునెస్కో వారు అంతరించిపోయే ప్రమాదం ఉన్న భాషల జాబితాను భౌగోళిక ప్రాంతాల ప్రకారం ఒక అట్లాసుగా చేసిస్తే అందులో 197 కనుమరుగవటానికి దగ్గరగా ఉన్న భాషలతో భారతదేశం మొదటి స్థానంలో ఉండింది. ఇది 2010 నాటి సంగతి. ఈ 197 భాషల్లో 100 భాషలు ఈశాన్య రాష్ట్రాలలోని జనజాతులకు సంబంధించినవి. వీటిల్లో 13 భాషలు అత్యంత ప్రమాదకరమైన స్థితిలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఒక భాషను మనం పోగొట్టు కున్నామంటే, ఆ భాషను మాట్లాడే సమాజపు దేశీయ విజ్ఞానాన్ని, సాంస్కృతిక సమాచారాన్ని మర్చిపోవాల్సిందే. ఎంత సాంకేతికంగా ఎదిగినా భాషలను పునఃస్థాపించే దిశగా ఏ ఒక్కరూ శ్రద్ధ తీసుకోక పోవటం గమనార్హం. కుల, మత, జాతి, భాష, ప్రమాణంగా సామాజిక ఎత్తుపల్లాలు ఏర్పరుచుకున్న భారతదేశం లాంటి వ్యవస్థలలో ఒక భాషను పోగొట్టుకోవటం ఆ సమాజపు రాబోయే తరాలకు దేశం చేసిన ద్రోహం అవుతుంది. ప్రధాన భాషలుగా గుర్తింపు పొందనంత వరకు చిన్న, అల్పసంఖ్యాక భాషలలో సమాచారం, పాఠ్యపుస్తకాలు, వార్తాపత్రికలు ఉండవు. ఒక విధంగా విద్యా రంగం, మీడియా, ఆ దారిలోనే ప్రభుత్వం ఈ అల్ప సంఖ్యాకులను, చిన్న భాషలు మాట్లాడే వారిని వెలివేసే పని చేస్తున్నారా అని అనిపిస్తుంది. లిపి లేని పక్షంలో ఈ చిన్న భాషలకు మరింత పెద్ద ప్రమాదం



ఎప్పుడూ పొంచి ఉంటుంది. లిపి లేని జనజాతుల భాషలు తమ ప్రాంతంలో అధికారికంగా చెలామణి అయ్యే పెద్ద భాష లిపిని తమ వాఙ్మయం భద్రపరిచేందుకు వాడుకుంటాయి. ఒకే లిపిలో ఉన్నప్పుడు పెద్ద భాషలోని పదాలతో పాటు, భావాలు కూడా చిన్న భాషలోకి చొరబడి ఆ చిన్న భాషను పెద్ద భాషకు ఒక యాసగానో, మాండలికంగానో కనిపించేలా చేసి, ఆఖరున ఆ చిన్న భాష మాట్లాడే వారందరూ పెద్ద భాష మాట్లాడే వారిగా రెండు మూడు తరాల్లో జరిగిపోవటం చూస్తూ ఉన్నాం.

ప్రారంభ దశల్లో చిన్న భాష-పెద్ద భాష మధ్య వారధిగా ఉండే దుబాసీలు, మిగితా చిన్న భాష మాట్లాడే జనాభాను చిన్నబుచ్చడం, అలా చిన్నంతరం-పెద్దంతరం వచ్చి, ఆ భాషను మాట్లాడే ప్రజలకే వాళ్ళ మాతృభాషలు హీనంగా కనిపించడమూ ఉంది. ఈ విధంగా పలు పెద్ద భాషలు చిన్న భాషలను మింగివేయటం మనం చూస్తూనే ఉన్నాం. నేడు కన్నడ, తెలుగు, తమిళం మాట్లాడే వారెందరో రెండు-మూడు తరాలకు ముందు వారి జనజాతి భాష మాట్లాడేవారు. హిందీ భాషీయులుగా గుర్తింపు పొందుతున్న బ్రజ, అవధీ, హర్యాణవీ, కనౌజీ, బుందేలీ, ఛత్తీస్‌గఢీ, బాఘేలీ, సుర్గుజియా, మగధీ, నాగ్‌పురీ, కుర్మాలీ, మార్వాడీ, మాల్వీ, ఇలా ఎన్నో వందల భాషల వారు తమ ఇంటి/మాతృ భాషను నేడు హిందీ భాషకున్న ఎన్నో మాండలికాలు లేదా యాసల్లో తమదొకటి అన్న భావదారిద్ర్యంలో ఉన్నారు.

మన దేశ రాజకీయాలు కూడా ఎదురించి నిలబడిన భాషలకు గౌరవమిస్తూనే, పెద్ద భాషల నీడలో ఉన్న చిన్న భాషలను పెద్ద భాషలతో కలిపేసేలా చట్టాలు రూపొందించారు. ఎనిమిదవ షెడ్యూలుకెక్కని లక్షల జనాభా ఉన్న తుళు లాంటి భాషలు ఈ అసమానతను భరిస్తూ ఉన్నాయి.

**ఈశాన్య రాష్ట్రాలలో ఐదు కోట్ల జనాభా జనజాతుల భాషలే మాట్లాడుతున్నారు. విద్య విషయానికి వచ్చేసరికి వారు తమ ప్రాంతపు పెద్ద భాషను అభ్యసించాల్సిందే, వేరే మార్గం లేదు. అలా రెండు-మూడు తరాలకు వారి మాతృభాష ఒక సాంస్కృతిక ప్రతీకగా మిగిలిపోతుందే తప్ప ప్రధాన జనజీవన స్రవంతిలో పెద్ద భాషకే చోటు దక్కేది.**

### ఈశాన్య రాష్ట్రాల భాషా రాజకీయాలు:

స్వాతంత్ర్యం వచ్చినప్పటికి మణిపుర్, త్రిపుర మినహా మిగితా ప్రాంతమంతా అస్సాం రాష్ట్రంగా వ్యవహరింపబడేది. 1953-56 మధ్య జరిగిన భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్విభజన వలన భాషల రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. అస్సాంలో ప్రధాన భాష అస్సామీ, కానీ ఇంకెన్నో వందల-వేల భాషలను మాట్లాడే జనాభా ఉంది. కొండలలో, అడవులలో జనజాతుల వారు తమపై రుద్దబడుతున్న అస్సామీ భాషకు విరుద్ధంగా, తమ ఇంటిభాషలకు ప్రాధాన్యం దక్కాలని పలు ఉద్యమాలు నడిపారు. శాంతియుతంగా చేసినవి కొన్నైతే, తీవ్ర హింసకు కారణమైనవి కొన్ని. అస్సామీ ప్రభుత్వ అస్సామీ భాష రుద్దుడుకు తోడు సరిహద్దు అవతల నుండి బెంగాలీ కాందశీకులు చేరి భాషా అసమానతలను మరింత పెంచారు. బెంగాలీ భాష ఆధిపత్యాన్ని తగ్గించేందుకు అస్సామీ భాషను కచ్చితంగా అమలు చేసే చట్టాలు వచ్చాయి. 1960 నాటికి ఈ అస్సామీ భాషా రుద్దుడుపై మరింత ఎక్కువ నిరసనలు బయటపడి, జనజాతుల వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమాలు ఊపందుకున్నాయి. పర్యవసానంగా 1963 లో నాగాలాండ్ నాగా భాషీయుల ప్రాంతంగా, 1970 లో మేఘాలయ ఖాసీ భాష మాట్లాడే ప్రజల రాష్ట్రంగా, 1972 లో మిజోరం మిజో భాష మాట్లాడే ప్రజల రాష్ట్రంగా - రాష్ట్రాలు భాషా ప్రాతిపదికన ఏర్పడ్డాయి. కోక్‌బొరోక్ భాషను అప్పటి అస్సాం రాష్ట్ర వామపక్ష ప్రభుత్వం రెండవ అధికార భాషగా ప్రకటించినా, లిపి లేని ఆ భాషకు బెంగాలీ లిపిని ఎంచుకుంది. యువత బెంగాలీ లిపికి బదులుగా రోమన్(ఆంగ్ల) లిపిని వాడాలని పట్టుబట్టారు. తక్కువ జనాభా ఉండి, భాషాధారిత అస్తిత్వం కోరుకునే పలు జనజాతుల వారు స్వయంప్రతిపత్తి గల జిల్లా స్థాయి ప్రభుత్వాల కోసం పోరాడారు. అలా మారా, లాయిస్, చక్మా జాతుల వారు మిజోరంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలని ఉద్యమించారు. ఇదే రీతిలో హ్మార్, బ్రూ, పైటె భాషల వారు కూడా స్వయం ప్రతిపత్తి పాలన కోసం పోరాడారు.

### మరి భాషలు, ముఖ్యంగా ఈశాన్య భారతదేశ భాషలు ఎందుకు కనుమరుగవుతున్నాయి?

1971 తరువాత భారత జనాభా లెక్కల వారు 10,000 అంతకన్నా తక్కువ మాట్లాడే వారున్న జనాభా గల భాషలను "ఇతర" భాషలుగా గుర్తించడం మొదలుపెట్టారు. 2011(ఇటీవల జరిగిన జనాభా లెక్కలు ఇవే) ప్రకారం 121 ((ప్రధాన/పెద్ద)భాషలు, 270 మాతృభాషలు(చిన్న/ఉపభాషలు/మాండలికాలు/యాసలు) మన దేశంలో మాట్లాడుతున్నారు. మన దేశంలో రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యులులో గుర్తింపు పొందిన జాబితాలో ఉన్న భాషలు 22 మాత్రమే. ఈశాన్య రాష్ట్రాలలోని జనజాతుల ప్రజలు ఈ జాబితాలో లేని భాషల ప్రజలే. ఇది ఎంత ఎక్కువ అంటే నాగాలాండ్, మిజోరం, మేఘాలయ రాష్ట్రాలలో జాబితాలో లేని భాషలు మాట్లాడేవారు నూటికి 85 మంది.

అయినా సరే భాషలు అంతరించి పోవటానికి ప్రధాన కారణం, ఆయా భాషలకు ఆర్థిక విలువ లేకపోవటం. ఈశాన్య రాష్ట్రాలలో అభివృద్ధి సూచాకాలన్నీ పాతాళంలోనే. అక్కడి జనాభా పొట్ట నింపుకోవడం కోసం వలసలు వెళ్ళిపోతారు, లేదా సంవత్సరంలో కొన్ని నెలలు తమ సొంత ఇంట్లో, మిగతా భాగమంతా భారతదేశంలోని సంపన్న భూభాగంలోని ఫ్యాక్టరీలలో, పరిశ్రమలలో కూలీలుగా పని చేసుకుని బతుకీడుస్తున్నారు. అంటే తమ భాష మాట్లాడని ప్రాంతంలో ఉండి, తమ భాషలను మరిచిపోతున్నారు.

ఆంగ్ల భాషకు, హిందీ భాషకు తమ మాతృభాషకన్నా మెరుగైన భాష అనో, అభివృద్ధి చెందిన భాష అనో మిథ్యా గుర్తింపుని ఒకదాన్ని తగిలించి అక్కడి జనానికి అమ్మే ఉపాధ్యాయురాలు కూడా భాషలు కనుమరుగవటానికి కారణం. ఇక క్రిస్టియన్ మిషినరీలు సరేసరి, మొదటి తరం క్రైస్తవులకు వారి వారి మాతృభాషల్లో మతబోధ చేసి, మెల్లిగా రెండవ, మూడవ తరం వారికి ఆంగ్లంలో వ్యవహరించేలా ప్రోత్సహిస్తారు.

పిల్లల మాతృభాషలలోనే ప్రాథమిక విద్య అన్న చట్టం ఈశాన్య రాష్ట్రాలలో అమలుకు నోచుకోవటం లేదు. అందుకు అదనంగా జనజాతుల పాఠ్యపుస్తకాలలో పాఠాలు వారి జీవనాన్ని ప్రతిబింబించవు. ప్రధాన భాషలో ఉన్న పుస్తకాలను యథాతథంగా అనువాదం చేయడమే కానీ, అల్పసంఖ్యాకులున్న భాషల్లో పాఠ్యాంశాలు రూపొందించడం జరగటం లేదు.

భారతదేశం మొత్తం మీద ఆకాశవాణి వార్తల ప్రసారాలు 120 భాషల్లో జరుగుతాయి, కానీ వార్తా పత్రికలు మాత్రం 35 భాషల్లోనే ఉన్నాయి. ఇదీ భాషలకు మన ప్రభుత్వాలు ఇచ్చే విలువ. ఇంటర్నెట్ లో ఎంత ఆంగ్లేతర భాషలు చొచ్చుకొస్తున్నా, సమాచారం మాత్రం ఆంగ్లాధారిత పాఠ్యం నుండే వస్తుంది. దేశీయ సమాచారం, దేశీయ సంస్కృతి చాలా వరకూ ఇంటర్నెట్ లో చేరలేదు. ఉన్న సమాచారమంతా ఆంగ్ల వాఙ్మయానికి ఆయా భాషల్లో చేసిన అనువాదమే. ఇది మరీ ముఖ్యంగా అందరికీ కావాల్సిన కాల్పనేతర సాహిత్యంలో, పరిశోధనా సాహిత్యంలో అధికం. రాజ్యాంగంలో జాబితాగా ఉన్న భాషలు, జాబితాలో లేని భాషలు అన్న అసమానత జనజాతుల భాషలకు అపార నష్టం కలిగిస్తోంది.

**ఆది నుండి విధాన పత్రాలకే**
**పరిమితమయిన విద్యా విధానాలు:**

1949 లో నాటి భారత ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి ప్రకటన ప్రకారం ప్రాథమిక స్థాయి వరకూ విద్యార్థికి తన మాతృభాషలోనే విద్య అందాలి, లేదా ఒక వేళ విద్యార్థి మాతృభాష ప్రాంతీయ/రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత భాషకు వేరుగా ఉంటే, ఆ మాతృభాషలో మాట్లాడే ప్రతి 40 మంది విద్యార్థులకు ఆ భాషలో బోధన చేసే కనీసం ఒక ఉపాధ్యాయుడిని/ఉపాధ్యాయురాలిని నియమించాలి. 1952 నాటి మాధ్యమిక విద్యా కమిషన్ వారు పైస్థాయి ప్రాథమిక విద్యలో మాతృభాషకు తోడుగా హిందీ, ఆంగ్లం భాషలను కూడా ప్రవేశపెట్టాలని కోరారు. 1956లో కేంద్ర విద్యా సలహా బోర్డ్ వారు ప్రతిపాదించిన ద్వి/త్రిభాషా సూత్రాన్ని 1961లో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంతో అమలులోకి తెచ్చారు. 1968లో త్రిభాషాసూత్రంలో మార్పులు చేస్తూ హిందీ ప్రాంతం వారు మూడవ భాషగా మరేదైనా భారతీయభాషను నేర్చుకోవచ్చుని అమలుచేసారు. ఆ త్రిభాషాసూత్ర చట్టాలు, దానిఅమలువిషయం మనందరికీ తెలిసినదే.

ఇన్నేళ్ళలో జనజాతుల పిల్లలకు వారి ఇంటి భాష నుండి ప్రాంతీయ భాషకు మార్చటాన్ని గురించి మర్చిపోయి వ్యవహరించారు పాలకులంతా. జనజాతుల భాషల్లో, వారి సంస్కృతి, కట్టుబాట్లు ఆధారం చేసుకుని బోధనాంశాలు రూపొందించాల్సిన అవసరం చాలా ఉంది.

ఇదే ఆశయంతో పని చేస్తున్నట్టు జాతీయ విద్యావిధానం



ఐదవ తరగతి వరకూ కచ్చితంగా, ఎనిమిదవ తరగతి వరకూ ఐచ్ఛికంగా మాతృభాషా మాధ్యమంలోనే చదువులు సాగాలని చెప్పింది. 2 నుండి 8 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు కొత్త భాషలను సులభంగా నేర్చేసుకుంటారు. ఆ వయస్సులో బహుభాషలను నేర్చుకుంటే విద్యార్థి దశలో గ్రహణ, ధారణ శక్తి పెరుగుతుందని విద్యా విధానం వ్యాఖ్యానించింది. ఇదే విధానం భారతదేశంలో కేవలం 15 శాతం జనాభా మాత్రమే ఆంగ్లంలో మాట్లాడే నేర్పు కలదని అనింది. అయితే ఈ 15 శాతమే భారతదేశంలో సంపన్న వర్గానికి చెందిన వారు కూడా. ఉద్యోగాలను అందించే పై మెట్టులో ఉన్న ఈ సంపన్న వర్గం, ఉద్యోగార్హతల్లో ఒకటిగా ఆంగ్లాన్ని, అవసరమున్నా, లేకున్నా అనివార్య నైపుణ్యంగా మార్చింది. అసలు భాషతో ప్రమేయం లేని ఉద్యోగాలలో కూడా ఆంగ్ల భాషాజ్ఞానాన్ని అర్హతగా ఉంచడం ఈ మౌఢ్యానికి నిలువెత్తు సాక్ష్యం. అందువలన సమాజం మొత్తం ఆంగ్లం తెలిసిన వారు గొప్పవారు, తెలీని వారు హీనులు అన్నట్టుగా భావిస్తోంది.

ఒకటి – మన ప్రభుత్వాలు, సమాజం కలిసికట్టుగా ఈ ఆంగ్ల ఆధిపత్యానికి చరమ గీతం పాడాలి.

లేదా, రెండు – ఆర్థిక స్థోమతకు అతీతంగా నాణ్యమైన ఆంగ్ల భాషా ప్రావీణ్యం అందరికీ అందాలి.

**ఆంగ్ల భాషా ప్రావీణ్యం వేరు, ఆంగ్ల మాధ్యమం వేరు. ఆంగ్ల మాధ్యమ బడులలో చదువుకున్నంత మాత్రాన ఆంగ్ల భాషలో ప్రావీణ్యం రాదు. మాతృభాషా మాధ్యమంలో చదివి ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలిగే నైపుణ్యం తెచ్చుకోవటం పెద్ద కష్టం కాదు. అయితే ఈ విషయమై విద్యా విధానం పెద్దగా మాట్లాడలేదు.** ఆంగ్ల మాధ్యమ విద్యకి, ఆంగ్లంలో విషయ సామగ్రి తయారీకి ఇస్తున్న ప్రాధాన్యత, ఆంగ్లేతర మాధ్యమ విద్యార్థులకు ఆంగ్లంలో ప్రావీణ్యత సంపాదించుకునేందుకు ఇవ్వటం లేదు. ఆ విషయమై పెద్దగా ఎలాంటి వ్యాఖ్యానాలు ఇవ్వలేదు. ఆంగ్ల మాధ్యమ విద్యలో నేర్పే ఆంగ్లానికి, బయట వ్యవహారానికి కావాల్సిన ఆంగ్లానికి చాలా తేడా ఉంది. ఉదాహరణకు మన పాఠ్య ప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు బ్రిటిష్ ఆంగ్లాన్ని నేర్పిస్తాయి, కానీ వ్యవహారమంతా అమెరికా ఆంగ్లంలో జరుగుతుంది. బడిలో తప్పుడు స్పెల్లింగులు(పదంలో అక్షరాల క్రమం) అనుకున్నవి బయట ఒప్పు. బడిలో ఒప్పు అని చదివిన ఆంగ్లం బయట వ్యవహారంలో తప్పు. మాటలాడాలన్నా బడిలో నేర్చే ఆంగ్లం పనికిరాదు. మళ్ళీ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు అని అదనంగా

**తరువాయి 16వ పుటలో.......**

కందగట్ల శ్రవణ్ కుమార్
99088 43592

# జాతీయ విద్యావిధానం: తెలంగాణలో మాతృభాష ప్రాధాన్యం: సవాళ్లు

**తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల్లో తెలుగు మాధ్యమం మాయమవుతోంది. కార్పోరేట్ విద్యాసంస్థల్లో మాతృభాషలకు ప్రాధాన్యత శూన్యమేనని చెప్పవచ్చు. రాష్ట్రంలో ఇప్పటికే ఎక్కువ శాతం పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమమే కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాల స్థాయి తెలుసుకొనుటకు ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో నిర్వహించిన వివిధ సర్వేల్లో ఆంగ్ల మాధ్యమ విద్యార్థుల స్థాయి తల్లిదండ్రులు ఆశించినంతగా, ప్రభుత్వం నిర్దేశించిన స్థాయికి చేరుకోలేదని తేలింది. అందుకనే నూతన జాతీయ విద్యావిధానంపై తన అభిప్రాయం తెలుపుతూ తెలంగాణ ప్రభుత్వం 'ప్రాథమిక విద్యను' మాతృభాషలోనే బోధించాలని చెప్పింది.**

నూతన జాతీయ విద్యావిధానం వల్ల ప్రాథమిక విద్యలో ఇంగ్లీష్ భాషాదాస్యం నుండి విముక్తి లభించగలదన్న ఆశలు పుడుతున్నాయి. నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదాలోని అంశాలు పాటిస్తూ క్రమంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ప్రాథమిక విద్యను మాతృభాషా మాధ్యమంగా మాత్రమే బోధించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తుంది. బ్రిటిష్ రాజకీయ దురాక్రమణ నుండి దేశానికి విముక్తి కలిగినప్పటికీ ఆంగ్లభాషా ప్రాబల్యం నుండి దేశ ప్రజలకు విముక్తి కలుగకపోవడం దశాబ్దాల వైపరీత్యం. బ్రిటీష్ వాళ్ళు మన దేశాన్ని పాలించిన రోజులలో దేశంలోని మేధావులలోను విద్యావంతులలోను ప్రస్ఫుటించిన భారతీయ భాషాభిమానం వారు నిష్క్రమించిన తరువాత క్రమంగా అంతరించిపోవడానికి కారణం భావదాస్యం. ఈ భావదాస్యం నుండి విముక్తి కలుగుతోందని, క్రమంగా భారతీయ భాషలకు విద్యాబోధనలో ప్రాధాన్యం పెరుగుతుందని భావిస్తున్న తరుణంలో ప్రపంచీకరణ వాణిజ్య వ్యవస్థ మన నెత్తికెక్కి కూర్చుంది. ప్రపంచీకరణ ఫలితంగా విద్య వ్యాపారం అవ్వటం ఒక వైపరీత్యమే. ఆంగ్లభాషా మాధ్యమ బోధన అట్టడుగు స్థాయి నుండి మొదలవడం రెండవ వైపరీత్యం. ఫలితంగా అమ్మను మరచిన పిల్లలు మమ్మీ అని నామ జపం చేస్తున్నారు. బ్రిటిష్ వారు మన దేశం నుండి వెళ్ళిపోయిన తరువాత అనేక దశాబ్దాల పాటు కె.జి నుండి పి.జి వరకు భారతీయ భాషలలో, మాతృభాషలలో విద్యాబోధన జరగాలనే ఉద్యమాలు, వాదనలు వచ్చాయి. ప్రభుత్వేతర, ప్రభుత్వ విద్యా సంస్థలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు మాతృభాషలలో సైతం ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యాబోధన మొదలైంది. హిందీ భాషను మాట్లాడే రాష్ట్రాల్లో ఇంగ్లీషు మీడియం దాదాపు అరుదైపోయింది. ఇతర రాష్ట్రాలలో సైతం ఇంగ్లీషు మీడియంలో చదివిన వారికంటె మాతృభాషలు మాధ్యమంగా విద్య నేర్చుకున్న వారి సంఖ్య అధికమైంది. అఖిల భారత సేవలకు సంబంధించిన పోటీ పరీక్షలను సైతం తెలుగులోను ఇతర ప్రాంతీయ భాషలలోను రాసిన అభ్యర్థుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఇలా ఆంగ్లంతో సమానంగా భారతీయ భాషలు వికసించడం మూడు దశాబ్దాలుగా కొనసాగింది. న్యాయ స్థానాలలో తెలుగును, ఆయా ప్రాంతాలలో ఆయా ప్రాంతీయ భాషలను ఉపయోగించాలన్న ఉద్యమ స్ఫూర్తి కూడ విస్తరించింది. తమిళనాడులో జిల్లా న్యాయస్థానాలలోను, కింది స్థాయి న్యాయ స్థానాలలోను ఆ రాష్ట్ర భాష తమిళం అధికార భాష అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడ తెలుగును సర్వ ప్రభుత్వ రంగాలకు విస్తరింప చేయాలన్న ఆర్భాటం జరిగింది. కానీ ఈ ఆర్భాటమంతా ప్రపంచీకరణ మొదలైన తరువాత ఆవిరి అయిపోయింది. ప్రపంచీకరణ ఫలితంగా దేశాల సరిహద్దులు చెరిగిపోయాయన్న భ్రాంతి పెరిగింది. అంతర్జాతీయ సమాజాల్లో ఉపాధి పొందడానికి ఆంగ్లభాష మాత్రమే కాక ఆంగ్ల మాధ్యమ విద్యాబోధన కూడ అనివార్యం అన్నది గత కొన్నేళ్లుగా జరుగుతున్న ప్రచారం. అమెరికా యాసలో ఇంగ్లీషు మాట్లాడటం వల్ల మాత్రమే హుందాతనం, గౌరవం, ఆర్థికస్థాయి, స్టేటస్ పెరుగుతాయనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. దీనికి కార్పోరేట్ వ్యవస్థ తమ స్వలాభాల కోసం ఈ అభిప్రాయాన్ని మరింత బలపరిచింది. ఇదంతా ప్రపంచీకరణ మాయాజాలంలో భాగం అని ప్రచారం జరిగింది. అందువల్ల గ్రామీణ నిరుపేదలు సైతం తమ పిల్లలను మూడవ ఏటనుంచి ఇంగ్లీషు మాధ్యమ బడులకు పంపించడం మొదలైంది. కార్పొరేట్ యాజమాన్యాలు కాన్వెంట్ స్థాయి నుండి కాలేజీ స్థాయి వరకు భారీగా ఫీజులను వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ కూలి పని చేసుకునేవారు సైతం తమ పిల్లలను ప్రైవేటు ఇంగ్లీష్ స్కూళ్లకే పంపిస్తున్నారు. ఇంగ్లీషును నేర్చుకొని విదేశాలకు వెళ్లి ఉద్యోగాలను చేయాలన్నదే అందరి ధ్యేయం కావడానికి సమాచార సాంకేతిక రంగాల్లో వచ్చిన విప్లవ విస్ఫోటనాలు కారణం.

గ్రామాల్లో నిరక్ష్యరాస్యులు సైతం మొబైల్‌ఫోన్లు వాడుతున్నారు. తద్వారా ఇంగ్లీషు పదజాలానికి అలవాటు పడిపోయారు. ఒకప్పుడు ప్రథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులు తెలుగులోను ఇతర ప్రాంతీయ భాషలలో నేర్చుకున్న పదాలకు ఇంగ్లీషుకి సమాన పదాలను గురించి వెతికారు. నిఘంటువులను తిరిగేశారు. ఇతరులను, ఉపాధ్యాయులను అడిగేవారు. ఇప్పుడు మొత్తం తలకిందులైంది. నిజం చెప్పాలంటే నేటి విద్యార్థులకు కొంతమందికి తెలుగు చదవటం, రాయటం కూడా రావట్లేదు. వారు తెలుగుని ఒక సబ్జెక్టుగా మాత్రమే అనుకోని పరిక్షల కోసం చదివి ఆ తరువాత చేతులు దులుపుకుంటున్నారు. ఉన్నత విద్యలో తెలుగుతో పనిలేదు అని భావించి స్కూల్ దశలో నుండే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. వాడుక భాషలో పదాల అర్థాలే వారికి తెలియటం లేదు. స్వచ్ఛమైన మాతృభాష మాట్లాడితే తెల్లమొహం వేస్తున్నారు.

తెలుగు భాషపై నేటి కాలం విద్యార్థుల తీరు మార్చుకోవాలి. తెలుగు అంటే చదువు వరకే కాదని వారి జీవన విధానంలో ఒక భాగమని, వారసత్వ సంపదగా ముందు తరాలకు అందించాలని వారు గ్రహించాలి.

**తెలంగాణలో గిరిజన మాతృభాషల్లో విద్యాబోధన**

నూతన విద్యావిధానం ముసాయిదాలోని అంశాలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం మాతృభాషలో చదవాలని మొదటి తరగతిలో గిరిజన భాషలైన కోయ, గోండు, లంబాడ, కొలామి భాషల్లో వాచక పుస్తకాలను తీసుకువచ్చింది. ఈ వాచకాలు తెలుగు లిపిలోనే ఉంటుంది. కానీ భాష మాత్రం ఆయా తెగల మాతృభాషలు. ఈ విధానం గిరిజన విద్యార్థులకు భాషపై ఆసక్తి పెంచటానికి, వారి మాతృభాషలో ఆలోచించి, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి, వారిలో డ్రాప్ ఔట్స్‌ని తగ్గించటానికి దోహదపడుతుంది. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 1,426 గిరిజన పాఠశాలలో 2020-21 విద్యా సంవత్సరానికి కూడా గిరిజన మాతృభాషలైన కోయ, గోండు, లంబాడ, కొలామిలలో వాచకాలను అందుబాటులో తెచ్చేలా చేశారు. వారి మాతృభాషలో పాఠాలు బోధిస్తే విద్యపై ఆసక్తి పెరిగి సులువుగా అర్థం అవుతుంది. చదువు మధ్యలో జారిపోయే విద్యార్థుల (డ్రాప్ఔట్స్) తగ్గుతారు. తల్లిదండ్రులకు కూడా పాఠ్యాంశాలలోని విషయాలను తమ పిల్లలకి వివరించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా గిరిజన తెగల సంస్కృతి - సంప్రదాయాలు, పండుగలు, పరిసరాలతో కూడిన పెయింటింగ్స్‌తో ముద్రించటం వల్ల విద్యార్థులకు చాలా ఇష్టంగా చదువుతున్నారని ఉపాధ్యాయులు కూడా వెల్లడించారు.

**నూతన విద్యావిధానం: మాతృభాషల అమలులో సవాళ్లు**

కేంద్రం ప్రకటించిన ఎన్ఈపీ ముసాయిదాలో మాతృభాషకు ప్రాధాన్యమిస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేంద్రం ప్రకటించిన జాతీయ విద్యావిధానంలో భాగంగా ఐదోతరగతి వరకూ మాతృభాషలోనే విద్యావిధానం అమలు సాధ్యమేనా? ఈ డిమాండ్ 1964 నుంచే ఉన్నా పలు కమిషన్లు, కమిటీలు సిఫారసులు చేసినా ఇప్పటి వరకు ఎందుకు అమలు కాలేదు? త్రిభాషా సూత్రం విఫలమవ్వడానికి కారణాలేంటి?. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత దేశంలో ప్రైవేటు, కార్పొరేట్, అంతర్జాతీయ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇప్పటికిప్పుడు మాతృభాషలో ప్రాథమిక విద్యను అందించేందుకు అవి సిద్ధంగా ఉన్నాయా? కొన్ని రాష్ట్రాలైతే ప్రభుత్వ బడుల్లోనూ విద్యలో ఇంగ్లీష్ మాధ్యమాలకు మొగ్గు చూపుతున్నాయి. ఇప్పుడు ఆ రాష్ట్రాలు మాతృభాషకు ప్రాధాన్యమిస్తాయా? ఈ సిఫారసు చేసిన కమిషన్ చైర్మన్ కస్తూరి రంగన్ మాతృభాషలో ప్రాథమిక విద్యతోనే విద్యార్థులు సైన్స్, గణితం సబ్జెక్టులను అర్థం చేసుకుంటారని, లేదంటే జారిపోయేవారి సంఖ్య పెరుగుతుందంటున్నారు. జపాన్ వంటి దేశాల్లో విద్యావ్యవస్థ విజయవంతం కావటానికి అదే కారణమన్నారు. అయితే కేంద్ర విద్యాశాఖ మాత్రం రాష్ట్రాలదే తుది నిర్ణయమని చెబుతోంది. దీంతో 'మాతృభాష'లో విద్యాబోధన అమలవుతుందా? కొఠారీ కమిషన్ మొదలు పలు కమిషన్లు, కమిటీల ప్రతిపాదనల్లాగే ఇదీ బుట్టదాఖలవుతుందా? తల్లిదండ్రులు ఇంట్లో రెండు వేర్వేరు భాషలను మాట్లాడే పిల్లల సంగతేంటి? అలా ఉంటే వారి మాతృభాషగా ఏమి పరిగణించబడుతుంది? స్థానిక భాష స్వయంచాలకంగా మాతృభాషగా మారుతుందా? బదిలీ చేయగల ఉద్యోగాల్లో తల్లిదండ్రులు ఉన్న పిల్లల గురించి ఏమిటి? వారి బోధనా మాధ్యమం స్థానిక భాష ఎలా అవుతుంది? వారి బోధనా మాధ్యమాన్ని ఎంచుకోవడానికి విద్యార్థులకు ఎంత స్వేచ్ఛ ఇవ్వబడుతుంది? అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

1968లో ప్రవేశపెట్టిన త్రిభాషా సూత్రం సరిగా అమలు కాలేదని 1992లో ఏర్పాటు చేసిన కమిటీ చెప్పడం గమనార్హం. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో దక్షిణాది భాషలను బోధించడం లేదని పేర్కొన్నది. ప్రైవేటు, కార్పొరేట్, 'ఇంటర్నేషనల్' స్కూళ్లలో మాతృభాషలో బోధన ఒక సబ్జెక్టుగానే పరిమితమైంది. ప్రభుత్వ బడుల్లో కొంతవరకు అమలైనా ఇప్పుడు కొన్ని రాష్ట్రాలు ఆంగ్లమాధ్యమ చదువుపై మొగ్గుచూపుతుండటంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. పైగా కేంద్ర మంత్రివర్గం అమోదం అనంతరం తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో విమర్శలు ప్రారంభమయ్యాయి. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నూతన విద్యావిధానానికి 1964 నాటి కొఠారీ కమిషన్ సిఫార్సులకు సారూప్యత ఉంది. మాతృభాషకు ప్రాధాన్యత, వృత్తివిద్య కోర్సులు, సైన్సుకు ప్రాధాన్యత, వర్సిటీల్లో పరిశోధనలకు పెద్దపీట, దేశ జీడీపీలో 6% నిధులను విద్యకు కేటాయించడంలాంటి అనేక అంశాలు అప్పటి సిఫార్సుల్లోనూ ఉన్నాయి. నాడు ఉన్నత విద్యలోనూ మాతృభాష అమలుచేయాలని సిఫారసు చేశారు. ఇప్పుడు కస్తూరి రంగన్ కమిషన్ ఐదవ తరగతి వరకు మాతృభాష తప్పనిసరి అని సిఫారసు చేసింది. ఇది సలహానే. కేంద్ర విద్యాశాఖ మాతృభాష/స్థానిక భాషలో ఐదో తరగతి వరకూ విద్యాబోధన ఉండాలనేదే జాతీయ విద్యావిధానం ఉద్దేశమని, అయితే అది సలహా మాత్రమేనని, తప్పనిసరి కాదని చెప్పారు. త్రిభాషా విధానం ఉంటుందని, నిర్ణయాధికారం మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. ఏ భాషనూ ఎవరిపైనా రుద్దడం లేదు. బోధనా మాధ్యమంలో ఏ భాషనైనా ఎన్నుకోవచ్చు అని నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదా కమిషన్ చైర్మన్ కస్తూరి రంగన్ అన్నారు. ఈ సలహాను రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతరవరకు అమలు చేస్తాయన్నది మునుముందు తెలుస్తుంది. నూతన విద్యావిధానంలో మాతృభాష లేదా స్థానిక భాషలో 5వ తరగతి వరకు విద్యాబోధన జరగాలని, రెండవ దశలో 8వ తరగతి వరకు దానిని పొడగించాలని ప్రతిపాదన పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలకు నష్టం కలుగుతుంది. ఒకవైపు పిల్లలకు ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీష్‌లో విద్యాబోధన అందించి వారికీ ఉన్నత అవకాశాలు కల్పించాలన్న కోరిక చాలా మంది బలహీన వర్గాల పిల్లల తల్లిదండ్రులలో బలంగా ఉన్న నేపథ్యంలో ముందుకు సాగుతున్న వివిధ రాష్ట్రాలకు కొత్త విద్యా విధానంపై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన ప్రతిబంధకంగా మారుతుందని వారి అభిప్రాయం.

ప్రజలను చైతన్య పరిచి ప్రాథమిక స్థాయివరకు అన్ని పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యనందించేలా కేంద్ర, రాష్ట్ర

**తరువాయి 23వ పుటలో.......**

సి.వి.క్రిష్ణయ్య
93965 14554

# తెలుగు నేర్పడంలో మెలకువలు - 2

(గత సంచిక తరువాయి...)

**గత** సంచికలో మన పిల్లలు తెలుగు ఎందుకు ధారాళంగా చదవలేకున్నారో, తప్పుల్లేకుండా రాయలేకపోతున్నారో కొన్ని కారణాలు తెలియజేశాను. తెలుగు బాగా నేర్చుకోడానికి ఆ సమస్యలు పరిష్కరించుకొంటే సరిపోతుంది. కాని అవి అంత తేలిగ్గా పరిష్కార మయ్యే సమస్యలు కావు. వాటిలో కొన్ని మనచేతిలో లేనివి కూడా ఉన్నాయి.

బయట ఎవరైనా స్వచ్ఛందంగా తమకుతాము నేర్చుకోవాలనుకొనే వాళ్లకు, ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో ఉండే వాళ్లకు బోధనకు సంబంధించిన అవగాహన లేనివాళ్లు కూడా సులభంగా నేర్పగల్గేటట్లు వాచకాలు ఉండాలి. ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పుకునేటట్లు ఉండాలి. ఏరోజు ఏమి నేర్పారో సులభంగా గుర్తుండేటట్లు ఉండాలి. ఇటు నేర్పేవాళ్లకు అటునేర్చుకొనే వాళ్లకు సులభంగా ఉండాలి. నేర్చుకొన్నది మరిచిపోకుండా ఉండేటట్లు, నేర్చుకొన్న అక్షారాలు నిరంతరం ఎదురవుతూ ఉండాలి. విసుగు పుట్టకూడదు. అది ఎలాగో చూద్దాం.

ఏ భాషలో లిపి నేర్చుకోవడానికైనా మూడు పద్ధతులు ఉంటాయి. 1. అక్షర పద్ధతి. 2. పద పద్ధతి. 3.వాక్య పద్ధతి. ఇందులో మనం మొదటి రెండు పద్ధతుల గురించి తెలుసుకొందాం. మూడవ పద్ధతి పెద్దవాళ్లు నేర్చుకోవడానికి ఉపయోగ పడుతుంది. దాన్ని వదలేద్దాం.

**1.అక్షర పద్ధతి :-** వర్ణమాలలో ఉండే అక్షరాలన్నీ నేర్పి, గుణింతాలు నేర్పి, వత్తులు నేర్పి, పదాలు వాక్యాలు చదవడం నేర్పే పద్ధతి అక్షర పద్ధతి.

**అక్షర పద్ధతిలో లోపాలు :**

1. ఉపయోగం ఉన్నా లేకపోయినా అన్ని అక్షరాలు నేర్పించడం... ఝ,ఞ,ఛ,థ,ఙ ఈ అక్షరాలతో పిల్లలకు తెలిసిన పదాలు ఏమున్నాయి. ఇంకా చాలా అక్షరాలతో ఒకటి రెండు పదాలు దప్ప ఎక్కువ పదాలు పిల్లలకు తెలిసినవి రావు. పైపెచ్చు ఇవి చాలా కష్టంగా కూడా ఉంటాయి.

2. అక్షరాలకు సంబంధించిన ఏదో ఒక రకమైన లింకు మెదడులో ఉండాలి. కాని అక్షర శబ్దాలుకాని, వాటి ఆకారాలుగాని మెదడులో ఏమీ లేవు. అందువలన నేర్చుకొన్న అక్షరాలు త్వరగా మెదడులో చేరవు. చేరినా వెంటనే చెదిరిపోతూయి. చాలా రోజులు అభ్యాసం చేయాలి. ఈ అభ్యాసం మొరటుగా ఉంటుంది.

3. అక్షరాలు విడివిడిగా దేనికై అది నేర్చుకొనేటప్పుడు ముందు నేర్చుకున్నవి మరచిపోతూ ఉంటారు. ఎందుకంటే అవి మళ్లీ మళ్లీ ఎదురుపడవు. ప్రత్యేకంగా మొదటి నుంచి గుర్తు చేసుకుంటూ రాస్తూ మరచిపోకుండా అభ్యాసం చేస్తూ ఉండాలి. చాలా ఆలస్యమవుతుందని పిల్లలు ఈపని చేయరు. టీచరు చేయించరు.

4. న్యాయంగా అక్షరాలు గుర్తించడం చదవడం వచ్చిందాకా రాతలోనికి పోకూడదు. కాని రాయడంద్వారా అక్షరం చదవడం నేర్పించడానికి పూనుకొంటారు. పలకమీద అయితే దిద్దాలి. నోట్ బుక్ లో ఇంపోజిషన్ రాయాలి. పిల్లలు త్వరగా విసిగిపోతారు. విసుగు ఒకరకమయిన అలసటను కోపాన్ని తెప్పిస్తాయి.పిల్లలకు నిరంతరం సృజనాత్మకంగా ఉండాలి. క్రీడలా ఉండాలి. ఇందులో ఎలాంటి క్రీడగాని సృజనగాని లేవు LSRW లు (లిసనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్) వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం నేర్చుకోవడంలో ఇది శాస్త్రీయమైన క్రమం. దీన్ని వదలి రాతతో దిద్దడంతో ప్రారంభించడం ఎంతటి అశాస్త్రీయమో గమనించండి. ఎందుకు ఇలా చేస్తున్నారు? నేర్పేవాళ్లకు ఇది సులభం. రెండక్షరాలు రాసిచ్చి వెళ్లి దిద్దుకోండి పదిసార్లు రాయండి అని పంపిస్తారు. కనీసం ఈ అక్షరాలు నువ్వు చూడకుండా రాయాలి – వీటిని చదవాలి నీ ఇష్టం అనేమాట చెప్పినా పిల్లలు వాళ్ల తంటాలు వాళ్లు పడతారు. ఇది కూడా చేయరు.

5. అక్షరాలన్నీ దేనికదినేర్చుకొన్నందువలన సగం అక్షరాలు ఒకదానిబదులు మరొకటి చదువుతూ ఉంటారు. ఒక్క పదమూ చదవలేరు. శలవులకు వెళ్లి వచ్చిన తర్వాత ఎక్కువశాతం మరచిపోతూ ఉంటారు.

6. ఇలా 1,2 తరగతుల్లో సరిగ్గా నేర్చుకోకుండానే పైక్లాసులకు వెళుతూంటారు. 1,2 తరగతుల్లో చెప్పిందేదో చెప్పాం. ఇంక చెప్పం అన్నట్లు మూడవ తరగతి సిలబస్ చెబుతూ -1,2 నేర్చుకోకుండానే వచ్చారని గొణుగుతూ ఉంటారు టీచర్లు. 3వ తరగతి సిలబస్ అందుకోలేరు. 1,2 తరగతుల్లో నేర్చుకోవలసిందేదో అదీ నేర్చుకోరు. బడికొచ్చి పిల్లలు టీచర్లు నటిస్తూ ఉంటారు. ఎక్కడో ఒకచోట ఒక గట్టి నిర్ణయం తీసుకోరు. ఎప్పుడైనా పిల్లలకు చదవడం రాయడం నేర్పించాల్సిందే అని గట్టి నిర్ణయం తీసుకుంటే ఏమవుతుంది? అసమర్ధ అవివేకపు విద్యాధికారుల అజ్ఞాన ఫలితమే ఇది.

7. పిల్లల్లో దాపరికం, సిగ్గు, భయం, కాపీ కొట్టడం వంటి అవలక్షణాలన్నీ ఏర్పడతాయి.

8. మరి ఒకప్పుడు ఈ అక్షర పద్ధతిలోనే గదా నేర్చుకున్నారు. ఇప్పుడెందుకు సాధ్యంగావడం లేదు. ఒకప్పుడు కూడా బడిలో చేరిన చాలామంది నాకు చదువురాదని బడిమానేసి వ్యవసాయపనుల్లో కుదురుకొనేవాళ్లు. అప్పుడు సాంప్రదాయంగా చదువుకొన్న కుటుంబాలునుంచి వచ్చినవాళ్లూ, తల్లిదండ్రుల శ్రద్ధకల్గిన పిల్లలు నిలబడేవాళ్లు. అంతేగాదు, భాష గణితాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాళ్లు. మిగిలిన సబ్జెక్టులకు అంత ప్రాధాన్యత ఉండేది కాదు. ఇప్పుడు క్రింది తరగతులనుండి తెలుగుతోపాటు ఇంగ్లీషు, హిందీ మరో రెండు భాషలు నేర్చుకోవాలి. ఇతర సబ్జెక్టులకు ప్రాధాన్యత పెరిగింది. గతంలోలాగా తెలుగు ఒక్కదానిమీద మాత్రమే మనస్సు పెడితే చాలదు. – ఇన్ని కారణాల వలన సులభంగా, తొందరగా పిల్లలు తమకైతాము నేర్చుకొనే పద్ధతిలో వాచకాలు ఉంటే ఎంతో

ఉపయోగం కదా! ఇందుకు పదపద్ధతి ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం.

**పద పద్ధతి :-** పదపద్ధతిలో కూడా అక్షరాలే నేర్పిస్తాం. కాకపోతే అక్షరాలు దేనికది విడిగా కాకుండా ఒక పదం ఆధారంగా నేర్పిస్తాం. ఈ పదాలు పిల్లలకు బాగా తెలిసినవై ఉండాలి. ఆ పదానికి బొమ్మకూడా ఉండాలి. తెలిసిన దాని ఆధారంగా తెలియంది నేర్చుకొంటారు. పలక అనే వస్తువు తెలుసు. పదం తెలుసు. కాని పలకలోని అక్షరాలు తెలియవు. ఈ తెలియని లిపిని తెలిసిన పదం ద్వారా నేర్చుకోవడం శాస్త్రీయం.

1. అక్షరాలు వరుసగా నేర్పడానికి కుదరదు. ఏ అక్షరాలు ఎక్కువ మన మాటల్లో వస్తాయో ఆ అక్షరాలను ముందుగా నేర్పించాలి. ఎందుకంటే ఆ అక్షరాలతో మరిన్ని పదాలను సృష్టించవచ్చు. ఉదా: పలక - అనే పదంలోని మూడు అక్షరాలతో - కల, పకపక, లకలక, అనే మూడు పదాలు వస్తాయి. రెండో పాఠంలో "పదవ" అనే పదం నేర్పిస్తాం. ఇందులో 'ప' మొదటి పాఠంలో వచ్చింది. ద,వ, రెండక్షరాలు కొత్తవి. మొత్తం ల,క,ద,వ, - ఈ నాలుగు అక్షరాలతో కల, వల, వడ, కడవ, కడప, పడక, - 6 పదాలు కొత్తవి వచ్చాయి. పడవ అనే పాఠంకింద - 6 పదాలు ఉంటాయి. వీటిని పిల్లలు చదవాలి. ఇలా ఒక్కోపాఠం చెప్పుకుంటూ వెళ్లేటప్పుడు పాత పదాల్లోని అక్షారాలన్నీ కొత్త పాఠాల్లో వస్తూ ఉంటాయి. పది పాత అక్షరాలలో ఒక కొత్త అక్షరం గుర్తు పెట్టుకోవడం సులభం. గుర్తుకురాకపోతే బొమ్మ ఆధారంగా గుర్తిస్తాడు. అంటే పదిపాఠాల తర్వాత టీచర్ సహాయం లేకుండానే తమకు తాము నేర్చుకోగలరు. ఇదే స్వయం అభ్యాసనం.

2. పాత అక్షరాలు ఎప్పుడూ ఎదురవుతూ ఉంటాయి గాబట్టి మరిచిపోవడం ఉండదు. అక్షరాలను గుర్తుకు తెచ్చుకోవడానికి పదాన్ని ఉపయోగించుకొంటారు. పలకలో 'ప', పలకలో 'క' అంటూ గుర్తుకు తెచ్చుకొంటారు.

3. ఒకేసారి అక్షరాలు నేర్చుకొంటూ చదవడం కూడా నేర్చుకొంటారు. పిల్లలకు ఒక క్రీడగా ఉంటుంది. పుస్తకం చదువుతున్నామనే నమ్మకం ఏర్పడుతుంది. ఆత్మ విశ్వాసం కలుగుతుంది.

### పాఠం ఎలా చెప్పాలి?

1. పైన బొమ్మను చూపించి బొమ్మ పేరు చెప్పమనాలి. బొమ్మ పేరు చెప్పగానే ఆ పేరు కింద అక్షరాలలో ఉంది చదవమనాలి. పిల్లలు చదవలేకపోతే మనం చదివి వినిపించాలి. పదంలోని అక్షరాలను విడివిడిగా పలికించాలి. కింద పదాలను కూడా చదివి వినిపించాలి. ఇలా జరిగిన తర్వాత పాఠం యొక్క పద్ధతి అర్థమవుతుంది. పిల్లలు వేగం అందుకొంటారు.

2. మొదట అక్షరాలు విడివిడిగా పలికి పదం చదవడం అలవాటు అవుతుంది. నాలుగైదు పాఠాలు జరిగిన తర్వాత విడిగా అక్షరాలు చెప్పకుండా ఒకేసారి పదం చదవడం అలవాటు చేయాలి. లేకపోతే విడివిడిగా చదివి పదం చదివే పద్ధతి చాలా రోజులు కొనసాగుతుంది. ఇది పిల్లలకు ఎంతో శ్రమ.

### తీసుకోవలసిన జాగ్రత్తలు :

1. మనం పదాలు పలికించేటపుడు పిల్లలు అదే పదాన్ని చూస్తూ ఉండాలి. తమ వేలును ఆ పదం పైన ఉంచి పలికే అలవాటు చేయాలి. ఎప్పుడు చదువుతున్నా వేలు ఆ పదంపై ఉండేటట్లు అలవాటు చేయాలి. లేకపోతే చూపు చదివే వరుసనుండి పక్క వరుసలోకి వెళుతుంది. ఇవన్నీ చాలా చిన్నవిషయాలనిపించవచ్చు. పలికే పదాన్ని కాకుండా వేరే పదాన్నిచూస్తే మొత్తం గందరగోళం అవుతుంది.

2. పిల్లల్ని హైరానా పెట్టకూడదు. సాధ్యమైనంతవరకూ సొంతంగా చదవనీయాలి. ఆలస్యమవుతూ ఉంటుంది. పిల్లలు ఆలోచిస్తూ ఉంటారు. మనం తొందరపడి ఆ పదాన్ని చెబితే పిల్లలు నిరుత్సాహ పడతారు. వాళ్లకు ఎలాంటి ఆసక్తి ఉండకుండా పోతుంది. మన సాయం కోసం ఎదురుచూస్తూ స్వతంత్ర ప్రయత్నం మానుకుంటారు.

3. ప్రతిరోజు వెనకటి ఒకటి రెండు పాఠాలు చదివిస్తూ ఉండాలి. నేర్చుకున్న కొత్త పాఠాలు స్వయంగా టీచరు వినాలి. లేదా పెద్ద పిల్లల్ని సహాయకులుగా నియమించుకోవచ్చు.

**అక్షరాలు నేర్పిన క్రమం :** (మేము రాసిన వాచకాలలో)

**1వ తరగతి** :- 1. అఆ, ఇఈ, ఉఊ, ఎఏ, ఒఓ,ం కచటతప, గజడదబ, నమయరలస - (28 అక్షరాలు) - హల్లులకు గుణింతాలు.

2. అన్ని అక్షరాలకు ఒక గుణింతం పద్ధతిలో నేర్పడం జరిగింది. కా,పా,దా,తా,లా పదాలతోపాటు జంట పదాలు, విశేషణంతో కూడిన పదాలు, వాక్యాలు

3. ఒక పాఠం , ఒక కథ, ఒక ఉత్తరం .

4. మధ్యమధ్యలో టీచర్ పాడి వినిపించి పిల్లలకు నేర్పడానికి పాటలు, గేయాలు, పాఠం చివర అభ్యాసాలు - రాతకోసం

**2 వ తరగతి** :

1. సారూప్య ద్విత్వాలు - ప్ప, చ్చ, ట్ట డ్డ,
2. వైరూప్య ద్విత్వాలు - క్క, త్త, న్న, మ్మ,
3. సారూప్య సంయుక్తాలు - ర్ప, ధ్ద, ర్గ,
4. వైరూప్య సంయుక్తాలు - ర్క, ర్మ, ర్న,
5. వత్తు అక్షరాలు - ఖ, ఘ, ఛ, ఝ,
6. ఐ, ఔ, శ, ష, హ, ణ, ఞ,ఙ - క్ ర్ హల్లులు

పాఠాలన్నీ గేయాలు, పాటలు, వ్యాసాలు, కథల రూపంలో ఉంటాయి. ఈ పద్ధతిలో జనవిజ్ఞానవేదిక తరపున 50 మంది టీచర్లు చర్చోపచర్చలు చేసి రూపొందించిన వాచకాలు - తేట తెలుగు-1, తేట తెలుగు - 2, . నేను స్వయంగా మూడేళ్లు 1,2 తరగతుల పిల్లలకు చెప్పిచూసాను. నేను హైస్కూల్లో సీనియర్ తెలుగు పండితుడిని. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో మూడేళ్లు ఎలిమెంటరీ స్కూల్లో పనిచేసాను.

నేను విజయవాడ పోరంకిలో ఉంటున్నాను. "వికాసవిద్యావనం" బడితో అనుసంధానమై ఉన్నాను. అక్కడ ప్రాథమిక విద్య వరకు తెలుగు మీడియం, 6 నుండి ఇంగ్లీషు మీడియం. 5 లోపు చేరే పిల్లలకు తెలుగు వచ్చి తీరాలి. ఇతర దేశాల నుండి - ఇతర రాష్ట్రాలనుండి వచ్చిన పిల్లలకు తెలుగు రాదుకదా. అలాంటి పిల్లలు 2,3,4 తరగతుల పిల్లలు రోజుకు గంటచొప్పున రెండు మూడు నెలల్లోనే ఇతర పిల్లలతో సమానంగా

నా పర్యవేక్షణలో నేర్చుకొన్నారు. ఇలా చెప్పండి అని తల్లిదండ్రులకు వివరించి, 1,2, వాచకాలు ఇచ్చి పంపిస్తాను. తల్లిదండ్రుల సహకారంతో పిల్లలు నేర్చుకొన్నారు.

**1,2, తరగతుల వాచకాలు తయారు చేసుకోవడం :**

ఈ పద్ధతిలో ఎవరికి వారు 1,2 తరగతుల వాచకాలు తయారు చేసుకోవటం అవసరం. ఎందుకంటే పిల్లలకు తెలిసిన పదజాలం జిల్లా జిల్లాకు మారుతుంది. గిరిజనుల పదజాలం వేరుగా ఉంటుంది. కనీసం 1వ తరగతి వారికైనా వాచకాలు తయారు చేసుకుంటే మంచిది.

గుర్తుంచుకోండి - కాలం మారింది. అనేక అశాస్త్రీయమైన భావాలు, సంప్రదాయాలు మన విశ్వాసంలో ఉంటాయి. సులువైన మంచి మార్గాలెన్నుకోడానికి మనసు గింజుకులాడుతుంది. మనం ఆలోచించాలి.

వినడం ద్వారా మాట్లాడడం నేర్చుకొంటారు. చదవడం ద్వారా రాయడం నేర్చుకొంటారు. కింది తరగతిలో రాతకు ప్రాధాన్యత తగ్గించి చదవడానికి ప్రాధాన్యత ఇవ్వండి.

తెలుగు త్వరగా సులభంగా నేర్పడంలో ఇవి నా అనుభవాలు. ఇంకా చాలామందికి చాలా అనుభవాలు ఉండవచ్చు. ఇలా అనుభవాలు ఉన్నవారు వారి అనుభవాలను కూడా పంచుకోవాలని కోరుతున్నాను. "అవి ప్రత్యక్షంగా తామ పిల్లలకు చెప్పి చూసిన అనుభవాలె ఉండాలి. ఊహలుకాదు.

పదవ తరగతి వరకు చదివి, తప్పులుపడతాయేమోనని భయపడి తెలుగును ఉపయోగించుకోలేని యువకులకు వారం రోజులపాటు రోజుకు గంట చొప్పున చెప్పి, ఉద్యోగంలో చేర్చిన ఒక అనుభవాన్ని. వచ్చే సంచికలో వివరిస్తాను -రచయిత.

## ఈశాన్య రాష్ట్రాల జనజాతుల భాషలకు....

**11వ పుట తరువాయి.......**

తీసుకోవాలి. ఇవన్నీ విద్యా విధానంలో చేర్చలేదు. భాషగా ఆంగ్లం నేర్పే పద్ధతి సమూలంగా మార్చి, సంభాషణలకు, బయట వాడుకకు అవసరమైన ఆంగ్లం మాత్రమే నేర్పి, మిగితా సమయం మాతృభాషల అధ్యయనానికి కేటాయించాలి. కానీ పరిస్థితి అలా లేదు. విద్యావిధానంలో ఒక పక్క మాతృభాషల/ప్రాంతీయ భాషల పరిరక్షణ ఊసూ లేదు, పనికొచ్చే ఆంగ్లం నేర్పే విషయమై ఎలాంటి సూచనలు లేవు. రెంటికీ చెడ్డ రేవడిలా విద్యార్థుల బ్రతుకులు తయారయ్యేలా ఉంది. అమలులో కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై మాతృభాషా మాధ్యమ అంశం పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై ఎంత జాగరూకతతో వ్యవహరిస్తున్నాయో మనకు ప్రత్యక్షంగా కనపడుతూ ఉంది. ఎంత అల్పసంఖ్యాక భాషీయులున్నా ఒక భాషను మాతృభాషగా కలిగిన 40 మంది పిల్లలున్నా ఆ భాషలో బోధించే ఒక ఉపాధ్యాయురాలిని/ఉపాధ్యాయుడిని అందుబాటులో ఉంచాలన్నది మన స్వాతంత్ర్యానంతర ప్రభుత్వ ఉద్దేశ్యం. డెబ్బై ఏళ్ళ తరువాత, పూర్తి సాంకేతికత అందుబాటులో ఉన్న ఈ తరుణంలో ఒక్క విద్యార్థి కోరినా వారి మాతృభాషలో విద్యను అందించగలిగే అవకాశం నేడు కలదు, ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు ఉన్నా లేకపోయినా! అయినా ఈ విద్యావిధానం ఆ విషయమై స్పష్టతను ఇవ్వలేదు.

భావ ప్రకటనకు, సాంకేతిక విషయాలకు, విజ్ఞాన సంబంధ విషయాలకు భారతీయ భాషల్లో ఉన్నంత పదసంపద బహుశా వేరే భాషల్లో దొరకవచ్చేమో. వందల ఏళ్ళ చరిత్ర గల భాషలు అన్ని శతాబ్దాల జ్ఞానాన్ని తమలో ఇముడ్చుకున్నాయి. భారతదేశ సాంస్కృతిక, సామాజిక వారసత్వాన్ని పదిల పరచాలంటే బహుభాషా సమాజంలో అన్ని భాషలు మనగలిగే పరిస్థితి రావాలి. భాషా రాజకీయాలకు స్థానం ఉండకూడదు. ఆంగ్లానికిచ్చిన అనవసరపు హోదాను వెంటనే తీసివేసి అన్ని భాషలు సమానమే అని చాటాల్సిన విద్యావిధానం, మళ్ళీ తిరిగి ఆంగ్లం వైపుకు, హిందీ వైపుకు, సంస్కృతం వైపుకు పక్షపాతం వహించడం సరైన పద్ధతి కాదు.

**జనజాతుల పిల్లలను వారికి సంబంధించిన చరిత్రా సంస్కృతులు వారికి పరాయి అయిన భాషల్లో చదివించడం రాజ్యాంగ విరుద్ధం. జనజాతుల సంరక్షణ కోసం రూపొందించిన ఎన్నెన్నో విధాన చట్టాలను హేళన చేసేలా విద్యావిధానం మిగిలిపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. 21వ శతాబ్దంలో భారతదేశం తన స్వదేశీ జనజాతులకు వారి వారి మాతృభాషల్లోనే విద్యను అందించాలి. ఆ విద్య ఇంతకు ముందు జరిగిన తప్పిదాలను సరిదిద్దే దిశగా మరింత సృజనాత్మకంగా, సరికొత్తగా, అందరినీ కలుపుకుపోయేదిగా ఉండాలి. ప్రజాస్వామ్య వ్యవస్థగా ఉన్న మన ప్రభుత్వం ప్రజలను విద్యాపరంగా మరింత చైతన్యవంతులని చేసే విధంగా, ప్రతి ఒక్కరి సామాజిక-ఆర్థిక అభివృద్ధికి దోహద పడేదిగా ఉండాలని ఆశిద్దాం. కానిపక్షంలో మన హక్కుల కోసం పోరాడి సాధించుకుందాం.**

## కాళోజి పుట్టినరోజు: సెప్టెంబరు 9: తెలుగు మాండలిక భాషాదినోత్సవం



*"ఏ భాషరా నీది ఏమి వేషమురా*
*ఈ భాష ఈ వేషమెవరికోసమురా*
*ఆంగ్లమందున మాటలాడగలిగిననే*
*వింతగా చూసెదవు ఎందుకోసమురా*
*సూటుబూటు హేటు సోకుగా తొడుగ*
*ఘనతేమి వచ్చెరా గర్వమేటికిరా*
*తెలుగుబిడ్డవయుండి,తెలుగురాదంచు*
*సిగ్గులేకా ఇంక చెప్పుదెందుకురా*
*దేశభాషలందు తెలుగులెస్స యటంచు*
*తెలుగుబిడ్డా ఎపుడు తెలుసుకుందువురా*
*తెలుగుబిడ్డవయుండి తెలుగు మాట్లాడేందుకు*
*సంకోచపడేవు సంగతేమిటిరా*
*అన్యభాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు*
*సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!"*

# కనుమరుగు

## స్మరణీయ సాహితీవేత్త, రచయిత
## రాపాక ఏకాంబరాచార్యులు



**మ**రణాలకి అనేక కారణాలు! ఈ మధ్య వచ్చిన దారుణ కారణం అందరికీ తెలిసిందే.

సాహిత్య సమాజానికి ఎన్నో వ్యాసాలు, గ్రంథాలు రాసి, సభానిర్వహణ లకు ఆర్థికంగా సైతం దోహదం చేసిన రాపాక ఏకాంబరాచార్యులు మృతి చెందడం భర్తీ చేయలేని ఒక వెలితి. అర్ధాంగి చనిపోయిన మరుసటిరోజే చనిపోవడం చూస్తే కారణం మనకు తెలిసినా ఇది ఒక 'పతీసహగమనం'లా అనిపించి గుండెల్ని తొలిచి వేస్తుంది. ఆంధ్రజ్యోతి ఆగస్టు 17వతేదీన ప్రసిద్ధ రచయిత దాట్ల దేవదానం రాజు నివాళి రచన ద్వారా రాష్ట్రమంతా గల ఆయన అభిమానులకు రాపాక మృతి తెలిసింది. రచయితలు ఎన్నో గ్రంథాలు రాయొచ్చు. కాలంలో తేరి నిల్చేవి కొన్ని వుంటాయి. కులాలు, కుల సంస్కృతుల అధ్యయనంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర బహుముఖకాంతి భరితం, 'విశ్వబ్రాహ్మణ సర్వస్వం' అనే ఆయన శ్రమైక సాధనా రచనలు బృహత్‌సంపుటాలుగా వచ్చి చరిత్రలో నిలిచాయి; ఎప్పుడూ నిలుస్తాయి కూడా. ఎనభైఏళ్ళలో ఎన్నో రచనలు చేశారు. 'అవధాన విజ్ఞాన సర్వస్వం' అనే మరొక బృహద్గ్రంథం ఆయన పరిశోధనాధిషణ త్వానికి పట్టుగొమ్మ. అనేక పత్రికల్లో అవధానులపై, అవధానాలపై, సాహిత్య అంశాలపై ఎన్నో వ్యాసాలు రాశారు. సాహిత్యసమాజపు చూపు మరింతగా ఆయన రచనలపై ప్రసరిస్తే త్రవ్వుకోవలసిన అంశాలైతే చాలానే వున్నాయి. అందరి వాడుగా, సాహిత్య మమేకత్వ సుగుణశీలిగా, సదా స్మరణీయులు. ఈనడు మమధునా పంతుల వారి శతజయం త్యుత్సవాలు బొంబాయిలో జరిపించడంలో రాపాక వారిదే ఏకపాత్ర అన్నా అతిశయోక్తి కాదు. దృశ్య, శ్రవణమాధ్యమా లకు కొందరు రచయితల గ్రంథాలకు రాపాకవారు ఒక గ్రంథబాండాగారి పాత్ర నిర్వహించారని, సాహిత్య సమాచర నిధిగా ఉపకరించారని చాలా తక్కువ మందికి తెలుసును. ఆయన స్మరించితీరవలసిన సాహిత్యవేత్త, రచయిత, మధునాపంతుల ప్రేమికుడు. ఈయనదీ మధునాపంతులవారి పల్లెపాలెమే. వీరిద్దరి మధ్య బంధుత్వం మించిన ప్రేమలుండేవి.

---

**కవిత** **మనసే ఒక దీపం**

**పా**టలో కరోనా కలిసింది
మధురంగా లేదు
నడకలోకి కోవిడ్ దిగింది
ధారాళంగా లేదు

**భ**యమూ ధైర్యమూ కలిసిన
అసహజ మిశ్రమం
సకల సందేహాల ఆశ్రయం.
వీరరసంగా
మారవలసిన ఉత్సాహం
ముద్ద గట్టుకపోతున్నది

**జీ**వితం ఎప్పుడూ
ఇంత అర్థవిహీనంగా లేదు
సౌందర్యానికి కొలమానం
దృష్టికోణం కానేకాదు

**కా**లం గడుస్తుంది గానీ
కస్తీగా తిరుగుతున్న గానుగలా ఉంది
గడియారం కదుల్తుంది గాని
స్తబ్దతకు వ్యాఖ్యానంలా ఉంది

**చె**దలు పట్టిన ఉదయం
మొదలు కాని కావ్యంలా ఉంది
నిజానికిది జీవితం కాదు
మసిబారిన మరకతం

**ఇం**త చీకటిలో కూడా
మనస్సొక్కటే
చెక్కుచెదరని నక్షత్రంలా మెరుస్తుంది
దీన్ని ఆసరాతోనే
ఆవలి తీరాన్ని స్వప్నిస్తున్నాను

- డా. ఎన్. గోపి
93910 28496

---

## అర్థాంతరంగా అదృశ్యమైన 'మణిహారం'
## పట్నాయకుని వేంకటేశ్వరరావు



**ఇంటినే** తన వి.ఆర్.ఛానల్‌కి కార్యాలయం చేసుకున్నారు. అన్నిటా చేదోడైన అర్ధాంగి ఇందిరనీ, కుమార్తెనూ కార్యకర్తలుగా మలిచారు. హైదరాబాదు సాక్షి దినపత్రికలో ఓవైపు డిప్యూటీ న్యూస్ ఎడిటరుగా సక్రమంగా ఉద్యోగం నిర్వహించుకుంటూనే వి. ఆర్. ఛానల్ ద్వారా 'వారం వారం మణిహారం' కార్యక్రమాలతో తెలుగు భాషకు, సాహిత్యానికి, సంస్కృతికి ఒక తపనతో ఒక అంకితభావంతో నిస్వార్థంగా సేవ చేశారు. తెలుగు సామెతలు, నానుడులు, వేమన పద్యాలు, తెలుగుపై పాటలు, పెద్దలతో మాట్లాడించడాలు- ఇటువంటివాటితో ఒకటీ రెండూ కాదు... వందవారాల కార్యక్రమాలు హుందాగా నిర్వహించారు.

శ్రీకాకుళం, కాపుగోదాయవలసకు చెందిన సంతబొమ్మాళిగ గ్రామంలో పుట్టిన వి.ఆర్ తెలంగాణాలో స్థిరపడ్డారు. చడీ చప్పుడూ చేయకుండా వెళ్ళిపోయిన యాయన్ని ఆయన రాసిన 'గుండెచప్పుళ్ళు'లోనే చూసుకోవాలి, యింక.

– సన్నిధానం నరసింహశర్మ 9292055531

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి
94400 37258

# తప్పు చెయ్యడం తప్పు కాదు

**తప్పు చెయ్యడం తప్పు కాదు. ఏ తప్పూ చెయ్యక పోవడం తప్పు. చేసింది తప్పని తెలిసిన తరువాత కూడా అది తప్పని ఒప్పుకోకపోవడం తప్పు. దాన్ని సరిదిద్దుకోకపోవడం ఇంకా పెద్ద తప్పు. ఆ తప్పునే పదేపదే చెయ్యడం, ఇతరుల్ని కూడా దాన్నే చెయ్యమని ప్రోత్సహించడం, తప్పు చెయ్యడం ద్వారా జీవనోపాధిని కల్పించుకోవడం, అందరికీ అదే తప్పుని చెయ్యక తప్పని పరిస్థితిని కల్పించి తాము చేసిన తప్పునే ఒప్పుగా చెలామణీ అయ్యేలా చెయ్యడం అనేది కేవలం తప్పు మాత్రమే కాదు. సామాజిక నేరం.**

**దా**దాపుగా తెలుగువారందరూ చేస్తున్న సామూహిక నేరం ఒకటుంది. అదే మనం మన భాషపట్ల చూపుతున్న నిర్లిప్తత, నిర్లక్ష్యం, నిరాసక్తత.

భాష అనేది భావాన్ని వ్యక్తం చేసే ఒక వాహిక. అందులో ఎక్కువ తక్కువలు లేవు. ఉండవు. ఉండ కూడదు. మనం మాటలు నేర్చుకునే భాష మనకి తల్లిలాంటిది. ఒక మనిషికీ అతని భాషకీ మధ్యనున్న సంబంధం కూడా తల్లికీ బిడ్డలకీ ఉండే అనుబంధం లాంటిదే. అందుకే ఎవరికి వారు తమ భాష గురించి చెప్పేటప్పుడు దానిని "మాతృభాష" అనే వ్యవహరిస్తారు. ఎంత పేదరాలైనా, చిరుగుల చీరలు కట్టుకున్నా అమ్మ.., అమ్మే..! ఎంత గొప్పావిడైనా ఎంత ఐశ్వర్యవంతురాలైనా బ్రిటీషురాణిని మనం అమ్మా అని పిలవలేము కదా ?ఆవిడని మన కన్నతల్లిగా ఒప్పుకోలేము కదా ? ఒక వేళ మనం ఒప్పుకున్నా ఆవిడ మనల్ని బిడ్డలుగా ఒప్పుకోవాలి కదా ? మనం ఆవిడని అమ్మా తల్లీ అంటూ అంగలార్చినంత మాత్రాన ఆవిడ కరిగిపోయి మనని అక్కున చేర్చుకోదు కదా ? (ఈ వాక్యాలు రాస్తున్నప్పుడు నాకు సోనియా గాంధీ గుర్తొచ్చింది. ఆవిడ అడక్కుండానే తెలంగాణా ఇచ్చిన ధీరోదాత్తురాలు అని ఏ రాజకీయ పక్షులైనా నామీదకొస్తారేమో అనే అనుమానం వచ్చింది. ఆ వెనువెంటనే ఆవిడ తెలంగాణా ఇచ్చిన తరువాత హైదరాబాదులో తెలుగువాళ్ళంతా ఎంచక్కా తెలంగాణా మాండలిక పదాల్ని వాడటానికి ఉత్సాహం చూపడం గుర్తొచ్చింది.)

భారతదేశంలో ఈనాటికీ నిరాఘాటంగా కొనసాగుతున్న బానిస విద్యావిధానానికి రూపకల్పన చెయ్యడానికే పనిగట్టుకు వచ్చిన మెకాలే కూడా భారతీయుల మాతృభాషలని కాదని ఇంగ్లీషుని మన తలమీద బలవంతంగా రుద్దే ప్రయత్నం చెయ్యలేదు. ఎందుకంటే ఒక వ్యక్తి వికాసక్రమంలో అతని మాతృభాష పోషించే పాత్రేమిటో ఆయనకి తెలుసు. భారతదేశంతో పోలిస్తే చాలా చిన్నదేశంలోని ప్రజలు మాట్లాడే భాష ఆంగ్లం. అది ఈ రోజు ప్రపంచ దేశాల్లో అత్యధికులు అర్థం చేసుకునే భాషగా రూపొందడం వెనుక ఉన్నది ఏమిటి ? వారికి వారి మాతృభాష పట్ల ఉన్న గౌరవం. దానిని విశ్వ వ్యాప్తం చెయ్యాలనే తపన. తమ వ్యాపారాలద్వారా , ఆక్రమణలూ దురాక్రమణల ద్వారా, విభజించి పాలించడంలోని మెలకువల ద్వారా తమ భాషనీ సంస్కృతినీ మతాన్నీ అలవాట్లనీ ఒక పథకం ప్రకారం విస్తరిస్తూ వచ్చారు. వస్తున్నారు. ఏకంగా మన గుండెల్లోకే వచ్చి విడిది చేసిన ఒక అక్కరకు రాని అతిథులుగా మారిపోయారు. హఠాత్తుగా జరిగిన పరిణామం కాదు. ఆ ప్రక్రియ వందల సంవత్సరాలుగా కొనసాగుతోంది. కొనసాగుతూనే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో తరాలు మారుతున్నకొద్దీ అవసరార్థం రెండో భాషగానో మూడో భాషగానో నేర్చుకున్న భాషే మొదటి స్థానంలోకి రావడం అనివార్యం అయిపోతుంది. ఎలాగంటే నాలుగు వందల ఏళ్ళ క్రితం స్థానిక భాషలు మాట్లాడే అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోనివారిలో ఎవరికీ ఇంగ్లీషు రాదు. కానీ ఇప్పుడు చాలా మందికి ఆంగ్లం మాతృభాషగా మారింది. అమెరికన్ ఇంగ్లీషు తనదే అయిన ఒక ప్రత్యేకమైన అస్తిత్వాన్ని కలిగి ఉంది. **ఆంగ్లేయులు తమ భాషకి అంతటి ప్రాచుర్యం కల్పించిన తరువాత కూడా ఇప్పుడు ప్రపంచంలో అత్యధిక సంఖ్యాకుల మాతృభాష ఆంగ్లం కాదు. ఆంగ్లం మాతృభాషగా ఉండేవారి సంఖ్య, మాండేరియన్ భాష మాట్లాడేవారి సంఖ్యలో మూడవ వంతు మాత్రవే. అలాంటి ఇంగ్లీషు నేర్చుకోవడానికి మనం తెలుగుని నిర్లక్ష్యం చెయ్యడం తప్పో ఒప్పో ఆలోచించక తప్పని పరిస్థితులు ఏర్పడిన సంధి కాలమిది.**

మనం ఇంగ్లీషు నేర్చుకుంటే మాత్రమే వృద్ధిలోకి రాగలమనే ఆలోచన తప్పు. ఎందుకంటే వృద్ధిలోకి వచ్చినవాళ్ళందరూ కేవలం ఇంగ్లీషు నేర్చుకోవడం వల్ల మాత్రమే ఆ స్థాయికి రాలేదు. అలాగని ఇంగ్లీషుని నిర్లక్ష్యం చెయ్యడం కూడా తప్పే. ఇంగ్లీషుని నెత్తిన పెట్టుకుని తెలుగుని కాలరాయడం తప్పు. అది ఎంతవరకూ వచ్చిందంటే, ఆంధ్రదేశంలో చదువుకున్నవాళ్ళు అసలు తెలుగు ఊసెత్తకుండానే ఉన్నత విద్యని పూర్తి చేయవచ్చు. పట్టాలు పొందవచ్చు. ఈ పరిస్థితి కేవలం తెలుగునాట తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదు.

**ఇంగ్లీషు మనని ప్రపంచ పౌరుడిగా చేస్తుందనే భ్రమలు ఆంగ్లేయులు కల్పించినవి కాదు. మనకి మనమే ఊహించుకున్నవి. మనంత మనమే నెత్తిన రుద్దుకున్నవి. మనని ఎవరో బందీలుగా చెయ్యలేదు. మనకి మనమే కాళ్లకీ చేతులకీ బేడీలు తగిలించుకుని దాస్యంలోనే స్వాతంత్ర్యాన్ని దర్శిస్తున్నాం. లేదా స్వతంత్రంగా దాస్యాన్ని కోరి తెచ్చుకుంటున్నాం.**

**అది ఎలా జరుతోందంటే..,**

మనం ఒక ఉద్యోగంలో చేరతాం. అక్కడ మనకి ఇతర ప్రాంతాలవారితో సంబంధ బాంధవ్యాలని నెలకొల్పుకోవలసి వస్తుంది. అలాంటి సందర్భాలలో అనుసంధానానికి ఉపకరించే భాష ఒకటి అనివార్యమౌతుంది. అప్పుడు తెలుగులోనే మాట్లాడతామంటే కుదరదు. అందుకే ఆయా సంస్థలు తమ ఉద్యోగుల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడానికి అనువుగా ఇంగ్లీషు భాషని నేర్పడానికి తరగతులు నిర్వహిస్తాయి. ఆ తరగతుల్లో మనలో ఉన్న పదసంపదని వినియోగించుకునే విధానాలు నేర్పుతారు. (ఈవిధంగా

ఉద్యోగం చేసేవాళ్ళకి ఆంగ్ల తరగతులు నిర్వహించడం స్వాతంత్ర్యం వచ్చినప్పటినించీ కూడా ఉంది.)

అక్కడ ఇంగ్లీషు నేర్చుకున్న అనతి కాలంలోనే ఆ ఉద్యోగులు చేస్తున్న పనుల్లో ఉన్నతిని పొందుతారు. అందుకుగల కారణం ఏమిటి అని వాళ్ళని వాళ్ళు ప్రశ్నించుకున్నప్పుడు వారికి దొరికే సమాధానం "కమ్యూనికేషన్ స్కిల్స్ " అనే ఆంగ్ల పదబంధం. **ఇంగ్లీషు నేర్చుకోవడం ద్వారా వారిలోని కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగాయనే అపోహలో పడిపోతారు. నిజానికి వారిలోని కమ్యూనికేషన్ స్కిల్స్ ఆంగ్లభాష వలన పెరగలేదు. వారిలో ఉన్న కమ్యూనికేషన్ స్కిల్స్ని తెలుగు రానివారి ముందు ప్రదర్శించడానికి ఇంగ్లీషు ఒక వాహికగా ఉపయోగ పడింది, అంతే.** కానీ మనవాళ్ళు అంత దూరం ఆలోచించరు. తమకి పదోన్నతి రావడానికి ఇంగ్లీషు కారణమైందనీ, ఒకవేళ ఆ ఇంగ్లీషేదో అంతకు ముందే వచ్చి ఉంటే ఇప్పుడున్న స్థాయికి అప్పుడే చేరుకుని ఉండేవారమనీ భావిస్తారు. అంతేకాదు, తాము పడిన కష్టాలు తమ పిల్లలు పడకూడదని కోరుకుంటారు. దాంతో వెంటనే వెళ్ళి దగ్గరలో కనపడిన మంచి ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్చేస్తారు.

ప్రపంచంతో సంపర్కం అవసరమైనప్పుడు ఆ అవసరమే వారికి కావలసినదాన్ని నేర్పుతుంది. అయితే అవసరం లేకపోయినా మనుషులు అందరూ తప్పకుండా నేర్చుకోవలసినవి కొన్ని ఉన్నాయి. మంచి నడవడిక, నైతిక ఋజువర్తన, సంస్కృతీ సంప్రదాయాలు మొదలైనవన్నీ మనం ఎటువంటి అవసరం లేకపోయినా నేర్చుకోవలసినవి. ఆచరించవలసినవి. భద్రంగా కాపాడుకోవలసినవి. ఎందుకంటే అవి మనకి అస్తిత్వాన్ని కల్పించే చిరునామాల్లాంటివి. అవన్నీ **కూడా తల్లిభాషతోబాటుగా మనకి సంక్రమించే ఆస్తులు. వాటిని సంరక్షించడంలో బడి, ఇల్లు పరస్పరం పూరకాలుగా పనిచేస్తాయి. బడి పూడ్చలేని గోతుల్ని ఇల్లూ, ఇల్లు పూరించలేని ఖాళీల్ని బడీ పూరిస్తాయి.**

**మనం మన పిల్లలని ఆంగ్లమాధ్యమంలో చేర్చడం ద్వారా, బడికీ ఇంటికీ మధ్య ఒక పెద్ద అగాథం ఏర్పరుస్తున్నాం.** ఎలాగంటే, ఇంట్లో నేర్పే భాషవేరు. బడిలో నేర్పవలసిన భాష వేరు. ఇది పిల్లల సమస్య అయితే, బయట వ్యవహరించవలసిన భాష వేరు. బడిలో నేర్పక తప్పని భాష వేరు కావడం అయ్యవార్ల సమస్య. ఈ సమస్యవల్ల ఉత్పన్నమైన మరో ప్రధానమైన సమస్య ఏమిటంటే అర్థం అయినా కాకపోయినా వల్లె వేయించడం ఉపాధ్యాయులకీ, బట్టీ పట్టడం విద్యార్థులకీ అనివార్యం కావడం. ఈ సమస్య కేవలం మన భాషాపరమైన అవగాహనా రాహిత్యం వల్ల మాత్రమే ఉత్పన్నమైంది.

మన దేశంలో ఆర్థిక వనరుల్ని సమకూర్చడంలో ప్రధాన పాత్ర పోషించేది రైల్వేలు. అందుకే రైల్వే బడ్జెట్ కి చాలా ప్రాధాన్యత ఉంటుంది. మన దేశంలోని రైల్వేలైన్లలో అత్యధికశాతం బ్రిటీషువారు వేసినవే. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా లెక్కలేనన్ని పెద్ద పెద్ద పట్టణాలకి రైలు సదుపాయం కల్పించుకోలేకపోయాం. మనం వారినించీ నేర్చుకున్నదేమిటి ? ఒకవేళ మనం ఆంగ్లేయుల్లా ఆలోచించగలిగి ఉంటే కనీసం కొన్ని పెద్ద పట్టణాలవరకూ అయినా రైల్వే లైన్లని వేసుకుని ఉండేవాళ్ళం. కానీ మనం నేర్చుకున్న ఇంగ్లీషు, మనకి ఇంగ్లీషువాడిలా నిర్మాణాత్మకమైన ఆలోచనల నివ్వలేదు. మనం వారినించీ కేవలం "సమాజాన్ని ఉపయోగించు కోవడం" ఎలాగన్నది మాత్రమే నేర్చుకుంటున్నాం. వారి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన "సమాజానికి ఇవ్వడం" అనే మౌలిక సూత్రాన్ని విస్మరిస్తున్నాం. అందుకే క్రమేణా అవినీతికి చిరునామాగా మారిపోతున్నాం.

**ఇవన్నీ మనని మనం కోల్పోవడం వల్ల సంభవించిన విపరిణామాలు. వీటికి దారితీసిన కారకాల్లో భాష పట్ల మనం చూపించే నిర్లిప్తత కూడా ఒకటి. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. మన అస్తిత్వాన్ని కాపాడు కోవడానికి భాషని కూడా ఒక వాహికగా గుర్తిద్దాం. దానిపట్ల ఉదాసీనతని వదిలేద్దాం. పిల్లలని తెలుగులో చదివిద్దాం, తెలుగులో ఆలోచించడం నేర్పుదాం. తద్వారా ముందు తరాలవారికి మన ఉనికిని తెలియజేద్దాం. మన ఇల్లు మనవే చక్కదిద్దుకుందాం. దీనికి ప్రభుత్వాలిచ్చే నిధులతో పనిలేదు. ఉన్న పనల్లా మన పూనిక అనే వెలకట్టలేని** పెన్నిధితోనే.




"ఒక బిడ్డ మాతృభాషలో
ఒక సంవత్సరంలో
నేర్చుకున్న విద్య
పరాయి భాషలో
నేర్చుకోవడానికి నాలుగేళ్ళు
పడుతుంది"

**- రవీంద్రనాథ్ ఠాగూర్**

డా॥ నాగసూరి వేణుగోపాల్
94407 32392

# ద్వేషరాహిత్యం, సమన్వయం, తార్కికత, హాస్యాల మేళవింపు తాపీధర్మారావు సాహిత్య విమర్శ



ఇది క్వారంటైన్ కాలం... లాక్ డౌన్ టైం! తాపీ ధర్మారావు లాక్‌డౌన్‌లో ఉన్నారు... మీకు తెలుసా? అయితే, ఇది చదవండి:

"... పూర్వపు రీతినే వ్రాసివేద్దామంటే, నా హృదయంలో కలిగిన మార్పు దానికి ఒప్పుకునేది కాదు. అందుచేత మౌనం కలిగింది నా కలానికి. దీనివల్ల స్నేహితులయిన పత్రికా సంపాదకులకి నాపై కోపం కూడా కలిగింది. ఏమి చేయను? నాపై నాకే కోపం కలిగినపుడు ఇతరులకి కలగదా!..." దీనికి నేపథ్యం ఇది -

"మూడు సంవత్సరాలు - వెయ్యిరోజులు - దాటిపోయాయి. ఒక్క ముక్క అయినా వ్రాయలేదు... ప్రచురించడం అంతకన్నా లేదు. నిజమే, కాని, చదివినది మాత్రం చాలా ఉంది. నేను దగ్గరదగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవగలిగాను. సారస్వతం అంటే ఎలాంటి సారస్వతం? దిక్కూమొక్కూ లేని సారస్వతం కాదు. అనుకరణమే ప్రధానమనుకునే సారస్వతం కాదు. జీవం లేని పాత్రలు కావు. జీవకళలు ఉట్టిపడుతూ ఉండే గ్రంథాలు. చాలా ప్రశస్తమైనవి దేశదేశాలలోనూ, ఖండఖండాలలోనూ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలు. వందలకొద్ది ఇతర భాషలలోకి తర్జుమా అయిన గ్రంథాలు, అన్ని జాతులవాళ్ళ పొగడ్తల్నీ, లక్షలకొద్దీ బహుమానాన్ని పొందిన గ్రంథాలు. ప్రపంచంలోని జనులనీ, వాళ్ళ అభిప్రాయాలనీ ఒక్కసారి మార్చివేసిన గ్రంథాలు. రష్యా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా... ఈ దేశాలలో మిక్కిలి ఉత్తమమైన గ్రంథాలు.

ఈ గ్రంథాలు కరువుదీర చదివాను. నా స్వభావాన్ని బట్టి చదివిన వాటిని గురించి విమర్శించుకున్నాను. ఆలోచించుకున్నాను. తరువాత ఆయా దేశాలలో ఆ గ్రంథాలను గురించి విమర్శనలు చూశాను. నోబెల్ మొదలైన గొప్ప గొప్ప బహుమానాలు ఈ గ్రంథాలకెందుకిచ్చారో తెలుసుకున్నాను.

దీని అంతటివల్ల నా అభిప్రాయాలు చాలా ఎక్కువగా మారిపోయాయి. మారక తప్పదు ఆ గ్రంథాలని చూచిన తర్వాత. సారస్వతం అంటే ఏమిటి? భాషఎటువంటిది? భావం ఎలాగుండాలి? కవి ఎటువంటివారు? .... గురించి నా అభిప్రాయాలు మారిపోయాయి... పూర్తిగా మారిపోయాయి."

ఈ మాటలన్నీ తాపీ ధర్మారావు 1936 సంక్రాంతి సంచిక నుంచి గూడవల్లి రామబ్రహ్మం నడిపిన 'ప్రజామిత్ర' పత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడిన 'కొత్త పాళీ' తొలి నాలుగు పేరాలు!

1933 నుంచి 1936 మధ్యకాలంలో తాపీవారు రాయకుండా చదివిన సమయం.

ఏమి చదవాలి, ఎలా చదవాలి - అనే ప్రశ్నలకు వారు ఇచ్చిన జవాబుగా ప్రతి ఒక్కరు గ్రహించాల్సిన అవసరం ఉంది. చదివిన తర్వాత తన స్వభావాన్ని బట్టి విమర్శించుకున్నారు, ఆలోచించుకున్నారు. తర్వాతనే ఇతరులు ఆ గ్రంథాల గురించి వ్రాసింది చదివారు. ఈ ధోరణి మనం ఎదగడానికి దోహదపడే విధానం. ఈ దశ పూర్తి చేసేటప్పటికి ధర్మారావు వయసు నలభైకు మించలేదు. తాపీవారిని వ్యావహారిక భాషా వైతాళికుడిగా మనం కొనియాడుతాం. ఘనమైన పత్రికా సంపాదకుడిగా గౌరవిస్తాం, తెలుగు సినిమాలకు చక్కని భాషను, స్క్రీన్ ప్లే విధానాన్ని ఇచ్చిన దార్శనికుడిగా కీర్తిస్తాం. అయితే ఆయనను తెలుగు సాహిత్య విమర్శకుడిగా కూడా గట్టిగా చెప్పాల్సిన అవసరం చాలా ఉంది అనిపిస్తోంది.

లాక్ డౌన్ టైంలో మళ్ళీ ఇనుప కచ్చడాలు, దేవాలయాలపై బూతు బొమ్మలు, సాహిత్యమొర్మరాలు, పాతపాళీ, కొత్తపాళీ పుస్తకాలను జాగ్రత్తగా చదివాను. సాహిత్య విమర్శను కూడా బొరుగులు తిన్నంత సులువుగా అందివ్వగలిగిన ప్రతిభాశీలి తాపీ. కొత్తపాళీ గురించి చాలామంది రాశారు, శ్లాఘించారు, తాపీవారికి పర్యాయపదంగా వాడారు. అయినా ఇప్పటికీ తెలుగు పాఠకులు కొత్తపాళీని కొత్తగా, సమగ్రంగా, సవ్యంగా చూడాల్సి ఉందేమో అనిపిస్తోంది. అందుకే ఈ విశ్లేషణ.

నిజానికి తాపీ ధర్మారావు 'కొత్తపాళీ' ద్వారా సాహిత్యరచనకు ఒక సిలబస్ రూపొందించారు. ఏదిసాహిత్యం? ఎవరికోసం ఆ సాహిత్యం? దాని ఉద్దేశ్యం (విషయం) ఏమిటి? ఎలా రాయాలి? అలానే ఎందుకు రాయాలి? - అనే విషయాలపట్ల సమగ్రమైన అవగాహన కల్గిస్తారు. అలాగే కవి లేదా రచయిత నిల్చున్న కాలానికి, సమయానికీ - గతాన్నీ, గత సాహిత్యాన్ని ఎలా చూడాలి? ఏమి స్వీకరించాలి అలాగే భవిష్యత్తులో బాధ్యత ఏమిటి అని కూడా చాలా సులువుగా బోధపడేట్టు విశ్లేషిస్తారు వారు.

సాహిత్య విమర్శకుడిగా ధర్మారావులో అ) పాండిత్యం ఆ) విశ్లేషణ ఇ) ఓపిక విశేషంగా ఉన్నాయి. అంతకుమించి వారిలో మనం చూడాల్సినవి అ)సాహిత్య విమర్శను చదివించేదిగా రాయడం ఆ) హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, వెటకారాన్ని పుష్కలంగా వాడటం ఇ) ఎటువంటి ద్వేషం లేకుండా సహనం, సమన్వయంతో కూడిన దృష్టితో సాహిత్య పరిశీలన ఈ) హేతుబద్ధంగా ఏది ప్రయోజనకరమో, కాదో అని విశ్లేషించి చూపడం. ఋ) తెలుగునూ, తెలుగు సాహిత్యాన్ని నెత్తిన పెట్టుకుని అవి మరింత ఉజ్జ్వలంగా ఉండాలనడం. - వెరసి నవనవోన్మేషంగా తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు ఇవ్వడం!

మూడు సంవత్సరాల అధ్యయనం తర్వాత వెలువరించిన వ్యాస సంపుటి - కొత్తపాళీ. ఈ వ్యాసాలను 1955లో పుస్తకంగా వెలువరిస్తూ ఇలా అంటారు.

"...నాకు సంస్కృతం మీద పదద్వేషమని కొందరయ్యలంటూంటారు.

కాదు. నాకు కావాలి సంస్కృతం, కొద్దో గొప్పో ఇప్పటికీ చదువుకుంటుంటాను. అది గొప్ప రత్నాల గని. నిజమే. ఇష్టమున్న వాళ్ళు సంస్కృతం చదవవలసిందే, దానిలో ఉన్న విజ్ఞానం తెలుసుకోవలసిందే, ఆ విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకురావలసిందే. అది కూడదనను. అనవసరంగా ఆ భాషను దిగుమతి చేయకండంటాను. తెలుగుతనం నిలుపమంటాను. అంతే..."

అలాగే కొత్త పాళీ చివరి వ్యాసం చివరలో ఇలా అంటారు: "...సాహిత్యాన్ని పట్టి ఆ జాతి వారి విజ్ఞానము, జీవన విధానము, ఆచారాలు, సంస్కృతి తెలుసుకోవడానికి వీలుండాలి. సాహిత్యంలో జాతి కనబడాలి. జాతికి సాహిత్యం అద్దంలాగుండాలి." ఇంకా అంటారు:

"తెలుగు కవి, తెలుగు రచయిత, తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి... తెలుగు సంస్కృతీ, తెలుగు గడ్డా, యుగయుగాల నుంచి వచ్చిన తెలుగు విజ్ఞానమూ తనకిచ్చిన శక్తి, అతను తెలుగు ప్రజకి రుణపడి ఉన్నాడు. ఆ రుణం తీర్చాలి తన ఇష్టం వచ్చినట్టు వినియోగించుకోకూడదు. మళ్ళీ తెలుగు వాళ్ళకు తాను కొంత చెల్లించాలి" –

ఇదీ తాపీ ధర్మారావు చూపునకు ఉండే ప్రణాళిక!

పీఠికలో ఇంకా అంటారు: "నేను ఇతరులకు నిజం చెప్పుదామని తలచాను. ఆ ఉద్దేశ్యంలో వ్రాసిన వ్యాసాలు కాబట్టి కొంత మిషనరీ మత బోధకుల పద్ధతి అవలంబించవలసి వచ్చింది" అంటూ తన వాదనా శిల్పం గురించి కూడా పరిశీలించేవారికి పనిపురమాయించాడు.

"పాతదానిని విడిచిపెట్టకూడదు. విడిచిపెట్టలేము గూడాను. పాతది ఉండవలసిందే. ప్రపంచంలో మనం చూస్తూ ఉన్న అభివృద్ధి అంతా పాతదాని మీద మెరుగే గదా! తెరచాపల ఓడ ఆధారం చేసుకునే స్టీమర్లు తయారు చేసిన వారు తీగమీద వార్తలు పట్టే వైర్ లెస్ కనుక్కున్నారు... నిలిచే యోగ్యత ఉంటేనే నిలుస్తుంది. కాని తొందరపడి పారవేయడం మంచిది కాదు..." అంటూ భవిష్యత్తుకు గతానికి ఉండే లంకెను చెబుతూ ఒక సైన్స్ విషయాన్ని ఎలా హాయిగా ఉపమానంగా వివరించారో గమనించండి. అదీ ధర్మారావులోని సారళ్యం.

ఈ వివరణలు చూడండి: "... అందులో సంస్కృతమే ఉండనీయండి, తెలుగే ఉండనియ్యండి, ఇంగ్లీషు, హిందూస్తానీ మరేదయినా ఉండనీయండి. ఏమైనాసరే తెలియడం ప్రధానం..." అంటారు. 1936లో రాసిన మాటలు నేటికీ చాలామందికి ఎంతో అవసరమనిపిస్తుంటుంది – కొన్ని సమయాలలో వినిపించే వాదనల రొద వింటూంటే... విషయం ఎక్కడో, శైలి ఎక్కడో, భాష ఎక్కడో చాలా స్పష్టంగా చెబుతారు వారు. సంస్కృత సాహిత్యమే కాదు, జానపద సాహిత్యం ఏమిటో కూడా చెబుతారు ధర్మారావు. ... ఊహలకి కనబడేటట్టూ, ప్రజలకి బోధపడేటట్టూ వర్ణనలు చేసేవారు. పాటలో ఉన్న సంగతీ, ఆ వర్ణన అంతా తెలుస్తూనే ఉండేది కాబట్టి ప్రజల హృదయాలు అలా ఉర్రూతలూగుతూండేవి."

కొన్ని ముచ్చటలు వారి వ్యాసాల నుంచి చూడండి:

1) తెనుగు చేస్తానని చెప్పి, మరింత సంస్కృతం గుర్తు తెలియకుండా చేయడం అక్రమం. తన పాండిత్యం ప్రదర్శించడానికి వ్రాసుకొనడమే అంటుంది మొల్ల – నన్నయ గురించి, (పుట 65)

2) తాను తెలుగు కోసమూ, ద్విపదల కోసమూ, తెలుగు ప్రజల గాథల కోసమూ చూచేవాళ్ళు కొంతమంది ఉండేవాళ్ళు – నన్నెచోడుడు, పాలకురికి సోమనాథుడు మొదలైన వాళ్ళు. వీళ్ళ పేర్లే మొన్న మొన్నటిదాకా మనకు తెలియకుండా పోయాయి. (పుట 67)

3) కవి సమయాలన్నారు, సాహిత్యసూత్రాలన్నారు, కావ్యమర్యాదలన్నారు, నాటక లక్షణాలన్నారు, వెయ్యిపేర్లు చెప్పారు. పదివేల నియమాలు దింపారు... ఇవన్నీ సంస్కృతం రేవులో నుంచే దిగుమతి. (పుట 84)

4) పగలు కలువపువ్వులు వికసించి ఉండటం ఎంతమంది చూచారు కాదు? అవి కలువలు కావంటారా? (పుట 85)

5) తెలుగులో తెలుగు సాహిత్యాన్ని చూపాలి. సంస్కృతం పరిచయం వల్ల మరింత అభివృద్ధి పొందడానికి బుద్ధిపుట్టాలి. గాని బానిస బుద్ధి పుట్టిపోకూడదు. (పుట 89)

6) నెలకు రు.20లు ఇచ్చి ఒక పండితుని పెట్టుకుని (సిలప్పదికారం) గ్రంథంలోని సంగతులు తెలుసుకున్నాను (ఇది 1936కు పూర్వ విషయమని మనం గమనించాలి, పుట. 91) కవి దాని (సిలప్పదికారం)లో తన శక్తులని చూపించాడు. ముష్టిలేని మొగతనాన్ని కనబరిచారు. స్వతంత్రం అంటే ఏమిటో తెలిపించాడు. కవి అన్న వాడికి నోరూరించాడు. (పుట 92) అరవవాళ్ళపాటివారమే కాదు, అరవవాళ్ళ కన్నా ఎక్కువ వాళ్ళమే. ఎన్నో విధాల ఎక్కువ వారమే (మనము) (పుట 94)

7) కృష్ణరాయ చక్రవర్తినీ, ఆతని ఆముక్తమాల్యదా చూడండి. ఆ ఊహాచాతురీ ఆ ప్రపంచ పర్యావలోకనమూ, ఆ కవిత్వదృష్టి చూచినవాళ్ళకి అతడు గ్రుడ్డి వ్రాతగాడు కాక, ఒక నూరు కళ్ళున్న వ్రాతగాడిలా కనిపిస్తాడే! (పుట 105)

8) పేరుగాంచిన ప్రబంధాలని మనం కొంచెం జాగ్రత్తగా చూడాలి. వాటిని కేవలం పారవేయకూడదు. అలా పారవేసినట్టయితే ఆంధ్ర సారస్వత జీవనంలో మూడు, నాలుగు వందల సంవత్సరాలు వ్యర్థమయిపోయినట్టే అవుతుంది. అంత నష్టానికి ఎవరు ఒప్పుకోగలరు? (పుట 107)

9) గ్రంథాలలో స్త్రీ పురుష సాంగత్య విషయంలోని సంగతులన్నీ మడికట్టుకుని విడిచిపెడితే బాగుండదు. (పుట 120)

10) చదివేవాళ్ళు గ్రహించకపోవడం చేత చక్కని కవిత్వం చావవలసి వచ్చింది. (పుట 132)

11) వేడినెత్తురుతో జీవయాత్ర సాగిస్తూ ఉన్న తెలుగు ప్రజలకి మనసాహిత్యంలో జాగా లేకపోయింది. జావా, సుమత్రా ద్వీపాలకి వెళ్ళి వలసలు ఏర్పాటు చేసే చేవగలిగిన తెలుగు తనానికి జాగా లేకపోయింది. పడవలు కడుతూ, సముద్రాలు దాటిన తెలుగు సాహసానికి జాగా లేకపోయింది. ఇంతెందుకు, బ్రతికి ఉన్న తెలుగుకు జాగా లేకపోయింది తెలుగు సాహిత్యంలో. (పుట 93)

ఎనభైయ్యేళ్ళ క్రితం రాసిన 'కొత్తపాళీ' సాహిత్య విమర్శగా – సాహిత్య విమర్శలో సహనం, సమన్వయం, హేతుబద్ధత, తార్కికత, తెలుగు మీద మనకుండాల్సిన గురి – మరీ ముఖ్యంగా హాయిగా, అలవోకగా చదివేలా రాయగలగడం – వంటి కోణాలలో నేటికీ మనకు అవసరం.

బండారు రామ్మోహన రావు
98660 74027

# 'నవోదయా'నికి నాంది పలికిన మన పీవీ



**పా**ములపర్తి వెంకట నరసింహా రావు! ఎంత నిండైన తెలుగు పేరు! తెలుగుదనానికి ఆయన నిలువెత్తు నిదర్శనం.

ఆయన ముద్దుపేరు పీవీ. 'ముద్దున పేరు చెడింది, సొగసున నడక చెడింది' అంటారు. కానీ ఇక్కడ అలా జరగలేదు... ప్రజలు ముద్దున పెట్టిన పేరు. పీవీ అంటే పరిచయం అక్కర లేని పేరుగా చిరస్థాయిగా నిలిచిపోయింది.

'రాజు తాత్వికుడు కావాలి ; తాత్వికుడే రాజు కావాలి' అంటాడు ప్రఖ్యాత పాశ్చాత్య తత్వవేత్త ప్లేటో. దానికి చక్కని ఉదాహరణ మన పి.వి. ప్లేటో తన రచనలలో చెప్పిన విధంగానే తాత్వికతతో పాటు రాజకీయ చాణక్యం కూడా ప్రదర్శించారు.

పంతొమ్మిది వందల డబ్బై సంవత్సరంలో ఆయన మన రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆనాడే నల్లగొండ జిల్లా సర్వేల్ గ్రామంలో తొలి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను స్థాపించారు.

రాజకీయ నేతగానే కాదు, సాహిత్య రంగంలో కూడా బహుముఖ ప్రజ్ఞాశాలి. వారి గురించి చెప్పడం అంటే సూర్యుని ముందు దివిటీ పట్టడమే. ఆయనతో నాకు ఉన్న సాన్నిహిత్యం, నాకున్న అనుబంధంతో ఒకటి రెండు సంఘటనలనూ, ఆయన మా ప్రాంతానికి చేసిన సేవల గురించీ ప్రస్తావిస్తాను.

ఆయన ప్రధాన మంత్రిగా ఉండగా నేను ఆయన పుట్టిన రోజైన 1992 జూన్ 28 వ తేదీ నాడు ఢిల్లీలోని ఆయన అధికార నివాస గృహంలో కలిశాను. ఆ సందర్భంగా జరిగిన సంగతిని మీకు విన్నవిస్తాను.

అప్పుడు నేను యువజన కాంగ్రెస్‌లో ఉండేవాడిని. అప్పుడు మా గజ్వేల్ ఎమ్మెల్యేగా గీతారెడ్డి గారు ఉన్నారు. చెన్నారెడ్డి మంత్రివర్గంలో క్యాబినెట్ మంత్రిగా ఉన్న ఆమెను ఆ తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి గారు తన క్యాబినెట్‌లో తీసుకోలేదు. ఆమెకు మంత్రి పదవి కావాలని కోరుతూ అందుకోసం మా నియోజకవర్గంలోని అప్పటికే వివిధ పదవుల్లో ఉన్న యువజన కాంగ్రెస్ నాయకులను తీసుకొని ఒక బృందంగా నేను పి.వి.నరసింహారావు గారి దగ్గరికి వెళ్ళాను. పి.వి. గారిని కలసి వినతిపత్రం ఇచ్చాము. మాకు అరగంట టైం కేటాయించారు.

ప్రజ్ఞాపూర్ సర్పంచ్‌గా మండల ఉపాధ్యక్షుడిగా నన్ను ఆయనకు పరిచయం చెయ్యగానే ఆయన నాతో అన్న మొట్టమొదటి మాట... మీ ఊరికి దగ్గరలోనే మా ఇంటి పేరుగా వున్న "పాములపర్తి" అనే ఊరు నాకు చూడాలని ఉంది, ఆ ఊరికి నన్ను తీసుకొనిపో రామ్మోహన్ అన్నారు. తప్పకుండా సార్ అన్న నేను ఆయన కోరికను తీర్చలేకపోయాను.

మితభాషి. అలుగుటయే ఎరుంగని, కోరికలే కోరని స్థితప్రజ్ఞుడయిన పివి గారి చిన్న కోరికను తీర్చలేకపోయానే అనే బాధ నాకు ఇప్పటికీ ఉంది. ఆ తర్వాత కూడా హైదరాబాదులో పి.వి గారితో వివిధ సందర్భాలలో రెండు మూడు సార్లు కలసిన సందర్భంలో పాములపర్తి గురించి మాట్లాడుకున్నాము. ఆయనకు వీలైనప్పుడు ఎప్పుడైనా తీసుకెళ్ళాలని ప్రయత్నం చేశాను కానీ తీరని పనుల వల్ల పీవీ గారికే వీలుకాలేదు.

పివి గారితో మా గజ్వేల్ నియోజకవర్గానికి మరొక ముఖ్యమైన అనుబంధం ఉంది. అదేమిటంటే పీవీ నరసింహారావు గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యాశాఖ మంత్రిగా ఉండగా 1970 -71 విద్యాసంవత్సరంలో మా పక్క గ్రామమైన జగదేవపూర్ గ్రామానికి మొదటి ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. అప్పటిదాకా విద్యావిధానంలో (హెచ్.ఎస్.సి) హయ్యర్ సెకండరీ సర్టిఫికెట్ అంటే పదకొండవ తరగతి అన్నమాట. ఆ తర్వాత పియుసి 12వ తరగతి ఉండేది. జగదేవపూర్ జూనియర్ కళాశాలను పి.వి. గారే స్వయంగా ప్రారంభించవలసి ఉండేది కానీ అనివార్య కారణాల వల్ల ఆయన రాలేకపోయారు. అప్పటికి గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు పెద్ద గ్రామం. అప్పటికి మండలాల ఏర్పాటు కూడా కాలేదు. జగదేవపూర్ గ్రామ అప్పటి సర్పంచ్ అదరాసుపల్లి నరసింహరామయ్య పంతులు గారితో పి.వి. గారికి రాజకీయ స్నేహసంబంధాలు ఉండడం వల్ల గజ్వేల్ పట్టణాన్ని కాదని ఒక చిన్న మారుమూల పల్లెటూళ్లో జూనియర్ కళాశాల ఇచ్చారు. గజ్వేల్ నియోజకవర్గంలో మాకు మొట్టమొదటి జూనియర్ కళాశాల అది. మేము పదవ తరగతి పాస్ అయిన తర్వాత ఇంటర్మీడియట్‌కి వెళ్లాలంటే అటు హైదరాబాద్, ఇటు సిద్దిపేట, మెదక్ లేక భువనగిరికి వెళ్లాల్సి ఉండేది. ఆ జూనియర్ కళాశాల రావడం వల్ల మా గజ్వేల్ తాలూకాలో పదవ తరగతి దాటి పైచదువులు చదువుకోడానికి యువతకు అవకాశం లభించింది. ముఖ్యంగా అప్పటికి పదవతరగతితోనే చదువు ఆపేస్తున్న ఆడపిల్లలకు ఇంటర్ వరకు విద్యా సౌకర్యం లభించింది. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉండగా ఆయన ప్రభుత్వంలో మానవ వనరుల శాఖ అనే ఒక కొత్త శాఖను ఆయన ప్రవేశపెట్టారు. దానికి మంత్రిగా పీవీ గారిని ఎంచుకున్నారు. పి.వి. గారికి పనికిరాని శాఖ ఇచ్చారని "లూప్ లైన్"లో పెట్టారని చాలామంది విమర్శించారు కానీ మానవ వనరులశాఖకే పీవీ వన్నె తెచ్చారు. ఆ శాఖను సమర్థవంతంగా నిర్వహించిన ఆయన దానిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. తర్వాత ఆ శాఖ కోసం ఎంతోమంది మంత్రులు పరితపించారు. ఆర్థిక, రక్షణ విదేశీ వ్యవహారాల శాఖ కంటే మానవ వనరుల అభివృద్ధి శాఖను ఉన్నత స్థితిలో నిలిపారు. అప్పుడే నూతన జాతీయ విద్యా

విధానాన్ని ప్రకటించి దేశవ్యాప్తంగా జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను నెలకొల్పారు. అలా అప్పుడే మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఇరవైమూడు జిల్లాలలో నవోదయ పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

ఆయన గురించి మరికొన్ని విషయాలు చెప్పుకోవాలంటే గల్లీ నుండి ఢిల్లీ వరకు ప్రజాప్రతినిధిగా చేసిన అనుభవం ఆయనది. పంచాయతీరాజ్ వ్యవస్థలో మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం ఎమ్మెల్యేగా ఎంపీగా ముఖ్యమంత్రిగా కేంద్రమంత్రిగా ప్రధానమంత్రిగా ఆయనకు అప్పగించిన ప్రతి బాధ్యతను అంతే నిబద్ధతతో నిర్వర్తించారు. మా సిద్దిపేట నియోజకవర్గానికి 1957లో ఎమ్మెల్యే గా ఎన్నికైన పి.వి రాజేశ్వరరావు గారు పీవీ నరసింహారావు గారికి రాజకీయ గురువు. ఆయన ఇంటికి పి.వి. గారు చాలా సార్లు వచ్చేవారు.

పీవీ గారి తర్వాత ప్రధానమంత్రిగా పనిచేసిన అటల్ బిహారీ వాజపేయి పీవీ నరసింహారావు గారిని తన రాజకీయ గురువు అని ఒక సారి బహిరంగంగా అన్నారు. అటల్ బిహారీ వాజపేయి ఆఫీసులో పివి గారి చిత్రపటం ఉండేది.

థింక్ గ్లోబల్ యాక్ట్ లోకల్ అనే దానికి పీవీ నిలువెత్తు నిదర్శనం. ఆర్థిక సంస్కరణలకు పెద్దపీట వేసి మానవ వనరుల శాఖను ఇవాళ సర్వ వ్యాప్తం చేసిన తీరు మెచ్చుకోదగినది. ఆయన మరణం తర్వాత తన సొంత పార్టీవారే ఆయనకు ఇచ్చిన విలువ ఏమిటో, మనం గమనించాము ! కానీ పార్టీలు వేరైనా అజాత శత్రువులా ఉన్న ఆయన శత జయంతి ఉత్సవాలను సంవత్సరమంతా నిర్వహిస్తామన్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుగారి ప్రకటనతో పీవీ గారి స్మృతికి సరియైన నివాళి అర్పించే అవకాశం వచ్చింది. **రాజకీయ నాయకుడే కాదు... కవి, తత్వవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీకి 'భారతరత్న' ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేస్తామన్న ముఖ్యమంత్రి ఆ వైపున కృషి చేయాలి. ప్రధానమంత్రిని కలసి ఒప్పించి వచ్చే సంవత్సరం అయినా పీవీ గారికి భారతరత్న తీసుకువస్తారని తెలుగు ప్రజలు ఆశ పడుతున్నారు. ఆ ఆశ తప్పక నెరవేరుతుందని ఆశిద్దాం.**

**13వ పుట తరువాయి .......**

## తెలంగాణలో మాతృభాష ప్రాధాన్యం - సవాళ్లు

ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడం తక్షణావసరం. మాతృభాషలో బోధన జరపడమంటే ఇతర భాషలను నేర్చుకోవద్దని కాదు. ప్రాథమిక విద్యాభోదన మాతృభాషలో తప్పనిసరి చేసి, ఇప్పుడు ఉన్నట్లుగానే ఉన్నత విద్యలో తెలుగును ఒక విషయంగా ఉంచినప్పుడే అమ్మ భాష మనుగడలో ఉండగలదు. రాజ్యాంగంలో పొందుపరుచు కున్నట్లు మాతృభాషను రక్షించుకుంటూ అన్యభాషలు నేర్చుకోవడం ఉత్తమం. అభివృద్ధి చెందిన దేశాలైన జపాన్, చైనా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ లాంటి దేశాల్లో వారి వారి మాతృభాషల్లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. మన దేశంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు వారి మాతృభాషకు తగిన గుర్తింపు, ప్రోత్సాహాన్ని ఇస్తూ పరిరక్షిస్తు న్నాయి. ఆంగ్ల మాధ్యమాన్ని ఆర్భాటాల అద్దాల్లో చూపిస్తూ మాతృభాషపట్ల నిర్లక్ష్య భావనకు గురిచేస్తున్న కార్పోరేట్ ప్రైవేటు పాఠశాలలకు అడ్డుకట్టవేయాలి. ఆంగ్ల మాధ్యమం మోజులో పడి తెలుగు మాధ్యమానికి తిలోదకాలిస్తున్న సంకుచిత దృష్టి నుంచి ఎంత తొందరగా బయటపడితే అంతమంచిదనే భావనను తల్లిదండ్రుల్లో రావాలి. ఆధునిక సాంకేతిక ఉపకరణాల్లో వాడటానికి మాతృభాషను ఆధునీకరించే కృషి తక్షణమే చేపట్టాలి. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల్లో కార్యకలాపాలన్నీ ప్రజల భాషలోనే జరపాలి. అలాగే వివిధ శాఖల వెబ్‌సైట్స్ కూడా తెలుగులో అనువదించేలా రూపొందిచాలి. తెలుగు మాధ్యమంలో చదివే వారికి కూడా ఉద్యోగ, ఉపాధిలో ప్రత్యేక అవకాశాలు కల్పించాలి. ఈ విధంగా ప్రభుత్వ పరంగానే కాదు, ప్రజలందరూ భాషాభిమానంతో తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలి.

రచయిత పరిశోధక విద్యార్థి,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్
సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం,

### గురజాడ అప్పారావు పుట్టినరోజు: సెప్టెంబరు 21: ఆధునిక తెలుగు సాహితీ దినోత్సవం



*"సాంఘిక అవినీతి క్రిములతో నిండిన దుర్భరదాస్యం నుంచి మహిళల్ని కాపాడటానికి, సమాజాన్ని అప్రదిష్టపాలు చేసే పరిస్థితిని కళ్ల ఎదుట పెట్టి, నైతిక భావాల ఉన్నత ప్రమాణాన్ని ప్రాచుర్యానికి తేవడం కంటే సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేది ఉంది?"*

*"నేను జీవితాన్ని చిత్రిస్తున్నాను. దాన్ని కళాత్మకంగా, ఆదర్శప్రాయం చేస్తూనే, కళ నా ప్రభువు అయినప్పటికీ- సంఘం ఎడల నా బాధ్యత ఒకటుంది. జీవితంతో నేను చర్లాటమాడను."*

*"దేశమును ప్రేమించుమన్నా...మంచియన్నది పెంచుమన్నా...*
*వట్టిమాటలు కట్టిపెట్టోయ్... గట్టిమేల్ తలపెట్టవోయ్ !!"*

# పదనిష్పాదనకళ 2

(గత సంచిక తరువాయి...)

*The joy of coining new words!*

### జనాద్యతావాదం

**ఈ** సందర్భంగా కొందఱు ఒక తరహా 'జన-ఆద్యతావాదాన్ని' లేవదీయడం గోచరిస్తుంది. భాష ప్రజలకు చెందినదనీ, ప్రజలే దానికి ఆద్యులనీ, సృష్టికర్తలనీ, కాబట్టి వారే అంతిమ నిర్ణేతలనీ, వారు ఏది వాడితే అదే ప్రమాణమనీ, "వాడుకలో ఉన్న పదాల్ని ఏ పండితులు సృష్టించారు ?" అని ప్రశ్నిస్తూ వాదించేవారున్నారు. 'ప్రజలు' అనేదొక సామూహిక నామవాచకం (collective noun). అదొక ఏకాండీ స్వరూపం (monolithic entity) కాదు. అదొక నామరూపరహిత స్వమూర్తి (faceless entity). అందులో అందఱం ఉన్నాం. రకరకాల వాళ్ళున్నారు. అనేక తరాలవాళ్ళున్నారు. వాళ్ళల్లో పండితులు కూడా ఉన్నారు. కనుక పండితుడు కూడా ప్రజే. ఆ ప్రజల్లో తెలియని ప్రజ కంటే తెలిసిన ప్రజ ఎక్కువ వరణీయం. రోగం వచ్చినప్పుడు అందఱూ స్పెషలిస్టుల దగ్గఱికే పరిగెడుతున్నారు తప్ప, "అన్ని వైద్యాలకూ పసరు వైద్యమే మూలం" అని కోయ వాళ్ళ దగ్గఱికి పోవడం లేదేం? రోగం ఏంటో వైద్యుణ్ణే అడిగి తెలుసుకుంటున్నారు తప్ప దానిగుఱించి పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి ఊరివాళ్ళకి వోటింగ్ పెట్టడం లేదేం? భాష విషయానికొస్తేనే జనాద్యతావాదమా? సరే, ఆ వాదాన్ని కాసేపు మాటవరసకి అంగీకరిద్దాం. మఱి ఆనాడు తెలుగు తప్ప వేఱే భాష లేదీ గడ్డమీద. వ్రాతకోతలు తెలియవు. అన్నీ మనసులోనే ధారణ చేసుకొని తరువాతి తరానికి అందించేవారు. మఱి అలా మారుద్దామా ఇప్పటి విద్యావ్యవస్థని కూడా?

కాబట్టి వైద్యానికే కాదు, ఈ రోజుల్లో భాషక్కూడా సుశిక్షితులైన విశేషజ్ఞులు (specialists) కావాలి. ఎందుకంటే ఈ రోజుల్లో భాష కూడా ఒక పురోగతశాస్త్రమే (advanced science). ఆ శాస్త్రం తెలిసినవారే దాని మీద సాధికారంగా మాట్లాడడానికీ, దానిలో కాలోచితమైన మార్పులు చేయడానికి, దానిమీద ఇతరులకు సలహాలివ్వడానికి అర్హులు. మిగతా వారు కారు. అందఱూ భాషే మాట్లాడుతున్నంత మాత్రాన అది అందఱి స్వామ్యమూ అయిపోదు, పులిని చూసినవాడల్లా వేటగాడు కానట్లే! అందఱికీ రక్షణ అవసరమే గానీ అందుకోసం అందఱి చేతుల్లోనూ తుపాకులు పెట్టలేం. దానికి భటశాఖ (police department) ఉంది. సాఫ్టువేర్లు వాడుకునేవారంతా ఆ శాస్త్రం చదివినవారు కారు. వాహనచోదకు లంతా ఆటోమొబైల్ ఎంజినీరింగ్‌లో పట్టభద్రులూ కారు. వారు తమకేం కావాలో తెలిసినవారు మాత్రమే. దాని కోసం ఏం చేయాలో తెలిసినవారు కారు. అలాగే, భాష అంటే అభిమానం ఉండడమూ, దానికి ఏదైనా చేయగలగడమూ ఒకటి కావు. మొదటి దానికి మనసు చాలు. రెండోదానికి శిక్షణ కావాలి.

ఇది కూడా ఆదిమకాలమైతే బావుండేది, అన్నీ ప్రజల చేతుల్లో పెట్టి మనం ఇంట్లో పడుకొని సుఖంగా నిద్రపోయేవారం ! మానవజాతి శైశవదశలో ప్రాకృతికంగా ఎదిగినప్పటి పరిస్థితుల్ని ఇప్పుడు యథాతథంగా అనుకరించలేం, అనుసృజించలేం. ఆనాటి భాషావసరాలూ, ఈనాటి భాషావసరాలూ అచ్చుమచ్చుగా ఒకటి కావు. ఆనాటి అవసరాలు తీర్చడానికి మామూలు ప్రజలు సరిపోయారు. ఇప్పుడు నిపుణులు కావాల్సిందే. ఎంత ప్రజాస్వామ్యమైతే మాత్రం ప్రజలు ఎన్నింటిగుఱించి ఆలోచించగలరు? రోజువారీ బతుకుబండి గుఱించా ? పర్యావరణం గుఱించా ? అవినీతి గుఱించా ? ఎవఱి గొడవలు వాళ్ళవి. ఎవఱి తిప్పలు వాళ్ళవి. మఱోపక్క నాగరికత చాలా ముందుకొచ్చేసింది. సమాజం చాలా వివిధీభవించింది. విశేషజ్ఞతలు (specializations) ముదిరాయి. ఒకఱి జీవనరంగం ఇంకొకఱికి అర్థం కాదు. అందఱినీ భాష గుఱించి ఆలోచించమని కోరలేం. ఎవఱు ఏది ఆలోచించాలో వాళ్ళే అది తప్పనిసరిగా ఆలోచించాలి.

### వ్యావహారికవాదం వేస్తున్న వెఱ్ఱితలలతో తెలుగుభాషకీ, నూతన పదనిష్పాదనకీ వాటిల్లుతున్న అపారనష్టం

వ్యావహారికవాదాన్ని మొదట్లో ప్రారంభించిన కీ.శే. గిడుగు రామమూర్తిపంతులుగారు అనుకున్నది వేఱు. ఇప్పటి వ్యావహారికవాదులు చేస్తున్నది వేఱు. మాట్లాడే భాషలోనే 'అన్నీ' వ్రాయాలని గిడుగు రామమూర్తిగారు అనలేదు. మాట్లాడే భాషకి ఉన్న పరిమితులు ఆయనకు తెలుసు. ఆయన కోరినది వ్యాకరణపరమైన వ్యావహారికం (colloquial grammar). పదాలవారీ వ్యావహారికం (colloquial wording) కాదు. పైగా ఆయన వాదంలో అనువాదాంశాలకు అంతగా చోటు లేదు. ప్రాథమికంగా ఆయన కోరినది విద్యావంతులు మాట్లాడే శిష్టవ్యావహారిక ప్రయోగం. అంటే "వచ్చుచున్నాను" అనే పుస్తకశైలికి బదులు "వస్తున్నాను" అని ఉండాలని ఆయన కోరారు. కానీ ఈ రోజున చాలామంది ఆయన పేరుతో తమ సొంత కార్యావళులు అమలుజఱుపుతున్నారు. పుస్తకాలలో ఉన్న అన్ని శాస్త్రసాంకేతిక పదాల్నీ వ్యావహారికం (ఇప్పుడీ పదాని కర్థం ఇంగ్లీషు) చేసిపారేయమని ఆయన ఎక్కడా చెప్పలేదు. అదే విధంగా తెలుగు వర్ణమాల (Alphabet) ని కుదించమనీ ఆయనెక్కడా చెప్పలేదు. వ్యావహారికం పేరుతో కులమాండలికాలూ, ప్రాంత మాండలికాలూ వాడమని కూడా ఆయన చెప్పలేదు. ఎలా మాట్లాడుతున్నామో ఆ ఉచ్చారణ విధానాన్నంతా యథాతథం గా లిపిబద్ధం చేసేయమనీ అయన అనలేదు. కానీ ఈ అన్నింటికీ పూనుకుంటున్నారు మన సమకాలీన వ్యావహారిక వాదులు. ఒక ఆలోచన మేధావుల సొత్తుగా ఉండేనాటికీ, అది జనంలోకి వెళ్ళేనాటికీ నడుమ ఏ విధంగా రూపుచెడి, గుర్తుపట్టరానంతగా మారిపోతుందో, దానికి ప్రతివారూ ఏ విధంగా తమ తమ సొంతవ్యాఖ్యానాలివ్వడం మొదలుపెడతారో బహుశా ఇదొక నిదర్శనం.

వ్యావహారికవాదం కేవలం తెలుగుభాషకి పరిమితం కాదు.

బయట గిడుగు రామమూర్తులు ప్రత్యేకంగా లేకపోయినా, తమిళం మినహా ఈనాడు దాదాపుగా అన్ని భారతీయ భాషల లిఖిత సాహిత్యాలలోనూ వ్యావహారికమే చాలావఱకూ వాడుతున్నారు, అవసరం కొద్దీ ! అయితే ఆయా రాష్ట్రాల వారిని మించిన తప్పుడు అభిప్రాయాలు కొన్ని తెలుగుగడ్డ మీద పాలోమని ప్రచారంలోకి వచ్చేశాయి గడిచిన వందేళ్ళల్లో ! వీటిని సరిదిద్దడానిక్కూడా ఏ ప్రయత్నమూ జఱక్కపోవడం విచారకరం.

1. కొందఱు వ్యావహారికవాదం పేరుతో ఎదిరివాదంలోని అసమంజస అంశాల్ని ఖండించడానికి పరిమితం కాకుండా వారిని వ్యక్తులుగా ద్వేషించారు. అంటే ఒక సైద్ధాంతిక సమస్యని కాస్తా మానసిక సమస్యగా మార్చుకున్నారన్న మాట.

తదుపరిదశలో వారిని ఒక వర్గంగా ద్వేషించడం జఱిగింది. అటుపిమ్మట వారందఱినీ ఒక సామాజికవర్గంగా ద్వేషించడం జఱిగింది (సదరు ద్వేష్యవర్గంలో అందఱూ గ్రాంథిక రచయితలు కాకపోయినా). తదనంతరం గ్రాంథిక శైలినీ, సాహిత్యాన్నీ ఏకమొత్తంగా ద్వేషించడం మొదలుపెట్టారు, ఆ సాహిత్యం గిడుగు రామమూర్తిగారి కంటేనూ, ఆయన వ్యావహారికవాదం కంటేనూ కొన్ని వందల సంవత్సరాల పూర్వం రచించబడినా కూడా !

కాలక్రమంలో ద్వేషం ఎగతాళిగా కూడా మారింది. ఉదాహరణకి – కొన్ని పాత చలనచిత్రాలలో ప్రతినాయక, విదూషక పాత్రల చేత అటూ ఇటూ కాని అకటా వికటపు గ్రాంథికంలో మాట్లాడించారు. అన్ని మాండలికాలకూ గ్రాంథికాన్ని పోలిన ఒక దేశవ్యాప్త ప్రాచీన వ్యావహారికమే మూలకందమనీ, ఒక కాలపు వ్యావహారికం ఇంకో కాలానికి గ్రాంథికంగా మారుతుందనీ, అందులో ఎగతాళేమీ లేదని చెప్పేవారూ, చెబితే వినేవారూ ఈ గడ్డమీద కఱువయ్యారు. అలా అలా నెమ్మదిగా వాడుక భాషపేరు చెప్పి అందఱినీ తెలుగుభాషకూ దానియొక్క సహజమైన తరతరాల ప్రాచీన వారసత్వానికీ విముఖులుగా మార్చారు. గ్రాంథిక వ్యావహారిక శైలిభేదాలు అన్నిభాషల్లోనూ మామూలేననీ, గ్రాంథికాలనేవి ఆయా జాతుల ప్రాచీన వారసత్వాలనీ, అవి కేవలం తెలుక్కి పరిమితం కావనే వాస్తవం పూర్తిగా మఱుగున పడిపోయింది. ఐతే అన్ని ఇతర భాషలవారూ తమ గ్రాంథికాన్నీ, తమ వ్యావహారికాన్ని కూడా తమ మాతృభాషగానే మనసారా ప్రేమిస్తున్నారు. సర్వసమగ్రంగా అభిమానిస్తున్నారు. నెత్తిన బెట్టుకుంటున్నారు. బ్రహ్మరథం పట్టుతున్నారు. కేవల గ్రాంథికాభిమానులు గానీ, కేవల వ్యావహారికాభిమానులు గానీ ఇతర జాతుల్లో కనిపించరు. దురదృష్టవశాత్తు అలాంటి వారంతా ఇక్కడే దర్శనమిస్తున్నారు.

2. వ్యావహారికానికి రకరకాలుగా – తమ అవగాహనకీ, పరిమితులకీ, అవసరాలకీ అనుగుణంగా – అపార్థాలూ, వక్ర భాష్యాలూ చెప్పసాగారు. వాటిల్లో కొన్నిటిని పైన పేర్కొనడం జఱిగింది. అన్నింటికంటే ముఖ్యమైన, భాషకి అత్యంత వినాశకరమైన వక్రభాష్యాలు రెండు. మొదటిది– సాహిత్యమంతా, అది ఏ రంగానికి చెందిన సాహిత్యమైనా కానివ్వండి – సామాన్యమానవుడికి అందుబాటైన భాషలోనే ఉండాలనేది. రెండోది– వ్యావహారికమంటే సామాన్య మానవుడికి అందుబాటైన భాష కనుక అతనికి ఇప్పటికే ఏయే పదాలు తెలుసునో ఆ పదాల్లోనే యావత్తు సాహిత్యమూ రచించాలి. కొత్త పదాలు అతనికి అర్థం కావు గనుక రచయితలు ఆ జోలికే పోకూడదు. అంటే తెలుగులో కొత్త పదాలనేవే ఉండకూడదు. వాటిని రూపొందించడానికి ఎవఱూ ప్రయత్నించకూడదు. అథవా ప్రయత్నించినా ఆ కొత్త పదాలన్నీ ఇప్పటికే బాగా తెలిసిన పాతపదాల కలయికతోనే ఏర్పడినవై ఉండాలి. ఈ రకంగా పాఠకుల పరిజ్ఞానానికీ, రచయితల సృజనాత్మక స్వేచ్ఛ (creative freedom) కీ తామే నిరంకుశంగా ఎల్లలు నిర్ణయించడం మొదలుపెట్టారు. ఇప్పుడు అమల్లో కొచ్చిన ఆంగ్ల మాధ్యమ విద్యావిధాన ప్రభావం ఫలితంగా ఎక్కువమందికి తెలుగు సాహిత్యంతో సంబంధాలు తెగిపోతున్నాయి. గనుక ఇప్పుడు వ్యావహారిక పదాలంటే అర్థం ఇంగ్లీషుపదాలే. అందుచేత ఆ పదాలకి తెలుగు సమార్థకాల్ని ఎవరైన సూచిస్తే, “అవి వ్యావహారికం కాదనీ, సామాన్య మానవుడికి అర్థం కా”వనీ వంక బెట్టి తిరస్కరించడం జఱుగుతోంది. పై అభిప్రాయాలలో చాలా తొఱ్ఱలున్నాయి. ఈ వాదాలు భాషకి చేసిన, చేస్తూ ఉన్న నష్టం చాలా గొప్పదీ, అనివర్తనీయమూను (irreversible).

(అ) వీరు చెప్పే సామాన్యమానవుడు ఎవఱో సరైన నిర్వచనం లేదు. సాధారణంగా ఒక రంగంలో నిష్ణాతుడైనవాడు ఇంకో రంగంలో బభ్రాజమానం కావచ్చు. ఏ రంగానికి చెందనివారు ఎవఱూ లేరు సమాజంలో! కాబట్టి అందఱూ తమ తమ రంగాలకు ప్రత్యేకమైన విశిష్ట పదజాలాన్ని వాడేవారే. ఆ రంగానికి చెందనివారిక్కూడా అర్థం కావాలని వ్రాసే వారెవఱూ ఉండరు. వైద్యుడు వైద్యపరిభాషలో పాఠ్యపుస్తకాలు వ్రాస్తాడు. ఎంజినీరు ఎంజినీరింగ్ పరిభాషలో పాఠ్యపుస్త కాలు వ్రాస్తాడు. ఆయా రంగాలలో కొత్త ఆవిష్కారాలు వెలుగులోకి వచ్చినప్పుడు, లేదా కొత్త పరిభావనలు ముందుకొచ్చినప్పుడు వాటిని వ్యక్తీకరించడానికి కొత్త పదాలు తప్పనిసరిగా కావాలి. ఒకవేళ ఆ కొత్త పదాలు ఒక విదేశీ భాషలో ఉన్న పక్షంలో వాటిని సరికొత్త తెలుగుపదజాలంతో అనువదించుకోవాల్సి వస్తుంది. వ్యావహారికానికి వీరు చెప్పే స్వకపోల కల్పిత అపార్థాల్ని నమ్ముకుంటే ఇదేదీ జఱగదు.

(ఆ) అందుబాటు భాష అంటే ఏమిటి ? మన పదపరిజ్ఞానం ఐదేళ్ళవయసప్పుడు ఉన్నట్లు పదేళ్ళ వయసప్పుడు లేదు. పదేళ్ళప్పుడు ఉన్నట్లు పాతికేళ్ళప్పుడు లేదు. అది వయసు గడిచేకొద్దీ పెఱుగుతూ పోతుంది. కాబట్టి అర్థం కావడం అనేది సార్వజనికమూ, సార్వకాలీనమూ కాదు. అది వయోవిశిష్టం (age-specific), వర్గ విశిష్టం (class-specific), ప్రస్తావనవిశిష్టం (topic-specific) ప్రకరణ విశిష్టం (context-specific). పాతికేళ్ళవాడి అందుబాటు భాష పదేళ్ళవాడికి అందుబాటు కాదు. అలాగే యాభయ్యేళ్ళవాడి అందుబాటుభాష పాతికేళ్ళవాడికి అందుబాటు కాదు. మనుషులు కాస్త ఎక్కువ తెలుసుకుందామనే చదువుతారు. మెఱుగైన కొత్త భాషా ప్రయోగాలు కూడా ఈ ఎక్కువ తెలుసుకోవడంలో భాగమే. అంతేతప్ప, విషయాన్నీ, దాన్ని వ్యక్తీకరించడానికి ఉపయోగించే భాషనీ వేఱు చేసి మాట్లాడడం సరైన జీవనవేదాంతం కాదు. కనుక విషయపరంగానూ, వ్యక్తీకరణల పరంగానూ రోజురోజుకూ ఎదగడమే మంచిమనుషుల లక్షణం. మంచిపాఠకుల లక్షణం. వారు అలా ఎదగడానికి చేయూత నివ్వడమే మంచి రచయితల లక్షణం.

మెఱుగైన కొత్తపదజాలం ఈ ఎదుగుదలకు విశేషంగా తోడ్పడుతుంది. ఎందుకంటే ఆయా భావాలకి గల పేర్లు స్థూలంగా తెలియడం వేఱు. ఆ భావాల్లోని సూక్ష్మ–సూక్ష్మ తారతమ్యాల్ని సైతం నిశితంగా విచక్షించి వ్యక్తీకరించడం వేఱు. అలా విశిష్టంగా వ్యక్తీకరించే నిమిత్తం విశిష్టమైన పదాలు తప్పని సరిగా కావాల్సిందే. వాటిక్కూడా మామూలు రోజువారీ పదజాలాన్నే వాడి తృప్తిపడమని ఇతరుల్ని నిర్బంధించే హక్కు ఎవఱికీ లేదు. ప్రపంచంలో 700 కోట్ల మంది మనుషులున్నా సరే, ఒకఱికి ఇంకొకఱు ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాదు. అలాగే పర్యాయపదాలే అయినప్పటికీ ఒక పదానికి ఇంకో పదం ఎన్నటికీ సంపూర్ణ ప్రత్యామ్నాయం కాదు. ఒక పదం బదులు ఇంకో పదంతో సరిపెట్టుకోవాల్సినది పరమ సామాన్యులు. విద్యావంతులు కాదు. కాబట్టి కొత్త వ్యక్తీకరణల కల్పన నిరంతరం అఖండ స్రోతస్సుగా కొనసాగుతూ పోవలసిందే.

(ఇ) తెలిసిన పదాల సహాయంతోనే విదేశీ పదాల్ని అనువదించాలని భావించడం మఱో పొఱపాటు. ఈ అభిప్రాయం మన వారికే తప్ప ఆ విదేశీ పదాల రూపకర్తలకు లేదని గమనించాలి. ప్రతికొత్త పరిభావనకూ ఒక కొత్త పదం అవసరం. తద్విపర్యాసంగా, వాడుకభాష పేరో, సామాన్యమానవుడి పేరో చెప్పి ప్రతి కొత్త భావాన్నీ పాతపదాలతోనే వ్యక్తీకరించాలని చూస్తే కొంతకాలానికి ప్రతిపదానికీ భాషలో డజనో, అఱడజనో అర్థాలు తయారై భాష మొత్తం దురవగాహంగానూ, దుర్భేద్యంగానూ మారిపోతుంది. చాలా అయోమయంగా ఉంటుంది. ఆ పదాల బదులు విదేశీ పదాల వాడకమే నయమనే పరిస్థితి కూడా తలెత్తుతుంది. కాబట్టి రచయితలూ, పదనిష్పాదకులూ తమ మాతృభాషా పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, కొత్త పదప్రయోగాల ద్వారా కొత్త పరిభావనల్ని పాఠకులకి పరిచయం చేయడం ఆవశ్యకం.

(ఈ) వ్యావహారికవాదం పేరుతో భాషాపండితుల్ని దూషించడం, ద్వేషించడం ఈ గత వందేళ్ళల్లో చాలా ఎక్కువైంది. భాష సరిగా రానివాళ్ళనీ, సరిగా నేర్చుకోనివాళ్ళనీ అనవసరంగా గ్లామరైజ్ చేస్తున్నారు. రొమాంటిసైజ్ చేస్తున్నారు. తెలిసినవాడూ, తెలిసింది చెప్పేవాడూ, సరైన వాడుకలు చేసేవాడూ, తప్పులు సవరించేవాడూ ఈ అసహజమైన వాతావరణంలో విషమయ్యారు. ప్రతి సబ్జెక్టుకూ పండితులున్నప్పుడు, ఆ సబ్జెక్టులకు సంబంధించి వారి మార్గదర్శనాన్ని నిరభ్యంతరంగా స్వీకరిస్తున్నప్పుడు, వాళ్ళెవ్వరినీ ద్వేషించనప్పుడు భాషాపండితుల్నే ఎందుకు ద్వేషిస్తున్నారు ? భాషనీ, దాని నియమాల్నీ, పనితీరునీ క్షుణ్ణంగా అర్థం చేసుకున్నవారినీ, పెద్దల మార్గంలో సుశిక్షితులైన వారిని ద్వేషించి భాషని ఎలా ఉద్ధరిస్తారు? ఎంజినీర్లని ద్వేషించి ఆనకట్టలెలా కడతారు ? ఏ జాతైనా, దేశమైనా తన భాషాపండితుల్ని గౌరవిస్తుంది. వారి రూపంలో తన సభ్యతనీ, సంస్కారాన్నీ భద్రపఱచుకొని భావితరాల కోసం కాపాడుకుంటుంది. ఇక్కడిలా వారిని అవమానించే కుసంస్కారం ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నట్లు వినలేదు.

(ఉ) వ్యావహారికం పేరుతో మనకి సమకాలీనంగా వ్రాతలో దర్శనమిచ్చే భాష ముప్పాతిక మువ్వీసం గ్రాంథికం నుంచి అరువు దెచ్చుకున్నది, లేదా కాపీ కొట్టినది మాత్రమే. గ్రాంథికంలోని శక్తిమంతమైన వ్యక్తీకరణల్ని వ్యావహారికంలోకి దిగుమతి చేసుకొని వ్యాప్తి చేయగా దాన్ని ఈరోజు మనం వాడుకభాష అంటున్నాం. అంటే గ్రాంథికాన్నే మనకర్థమైనంత మేఱకు వ్యావహారికమని పిలుస్తున్నాం. అలా వాడుకలోకి రాకుండా పుస్తకాలకే పరిమితమైన ఇంకెంతో శక్తిమంతమైన పదజాలం గ్రాంథికంలో ఉంది. ఆ మిగిలిన గ్రాంథికం కూడా ఇప్పటికీ ఎంతో ఉపయుక్తమే. అలాగే ఏ భావాన్ని కొత్తగా చెప్పాలన్నా, లేదా ఏ కొత్త భావాన్ని అనువదించాలన్నా మళ్ళీ గ్రాంథిక పదబంధాలూ, వాడుకలే మనకి శరణ్యమౌతున్న పరిస్థితి ఉంది. ఇలా అడుగడుగునా గ్రాంథికంపై ఇతోధికంగా ఆధారపడుతూ దాన్ని ద్వేషించడం సమంజసం కాదనే స్ఫురణ వ్యావహారికవాదులకి ఈనాటికీ లేదు.

(ఊ) కవులూ, రచయితలూ, శాస్త్రవేత్తలూ అన్నాక వారికి సృజన స్వేచ్ఛ (creative freedom) ఉంటుంది. ఉండాలి కూడా. వైవిధ్యం సృజన స్వేచ్ఛకున్న ప్రధానలక్షణం. ఎంతో కొంత నవనవోన్మేషతనీ, వైవిధ్యాన్ని చూపలేనిది సృజనే కాదు. తన రచన యొక్క విషయాన్నీ, రూపాన్నీ, శైలినీ నిర్ణయించుకునే హక్కు సృజనకారుడిదే. సృజనకారులు సాధారణంగా జనసామాన్యం కంటే ఎక్కువ తెలిసినవారూ, ఎక్కువ అనుభూతి చెందేవారూ, విషయాలకి ఎక్కువ స్పందించే వారూ అయ్యుంటారు. అలా ఎక్కువ తెలిసినవారి భావాల వ్యక్తీకరణకి ఎక్కువ సంఖ్యలో ఉన్న పదాలూ, ఎక్కువస్థాయిలో ఉన్న ప్రయోగాలూ అవసరమౌతాయి. పురోగత సంస్కృతుల్లో ఒక భావాన్ని అనేక కోణాల నుంచి రకరకాలుగా చెప్పడానికి అవకాశం ఉంటుంది. "గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి" అంటాడొకడు. "గుండె జాఱిపోయింది" అంటాడు ఇంకొకడు. "గుండె గొంతు లోకొచ్చింది" అంటాడు వేఱొకడు. "గుండెలో ఱాయి పడింది" అంటాడు మఱొకడు. సరే ! ఇవి వినగానే అర్థమయ్యే వ్యక్తీకరణలనుకోండి. కానీ కొన్నికొన్ని అలా వినగానే అర్థం కావు. ఎందుకంటే కవి పొందిన అనుభూతి అనిదంపూర్వమైనప్పుడూ, దాన్ని అంతకు ముందెవ్వఱూ వెలిబుచ్చనప్పుడు దాన్ని అనుభూతిలోకి తెచ్చుకుని ఆస్వాదించడానికి పాఠకుడికి కొంత సమయం పట్టుతుంది. దానికి కొంత మననమూ, శిక్షణా అవసరమవుతాయి. "ఎందే చిత్తము కందళించు రహిచే నేకాగ్రతన్ బొంది...." అని పోతనగారు వ్రాసినది గ్రాంథికం తెలిసినవారిక్కూడా మొదటి చూపులో అనుభూతిలోకి రాదు. ఆ పద్యాన్ని మళ్ళీ మళ్ళీ చదివి, మననం చేసుకొని, అలా మనసుకి కొంత సన్నద్ధతా, శిక్షణా కల్పించాక అప్పుడు కవి వివక్షితార్థం ఏంటో అవగతమౌతుంది. అదీ, సదరు చదువరి ఆ పుస్తకం యొక్క లక్షిత పాఠకవర్గానికి (target readership) చెందినవాడైతేనే! అసలు ఆ సబ్జెక్టే అవసరం లేదనే వారి కోసం వ్యావహారికంలో వ్రాసి ప్రయోజనమేంటి ? పద్యభావం అవగతమయ్యాక, ఆ వివక్షితార్థాన్ని మామూలు మాటల్లో చెప్పకుండా కవి మంచిపనే చేశాడనీ, ఆయన ఉద్దేశం వాడుకభాష ద్వారా వ్యంజనీయం కాదనీ గ్రహిస్తాం. తద్విరుద్ధంగా, వ్యావహారిక వాదం పేరిట సృజనస్వేచ్ఛని హరించి, అన్నీ దారినపోయే దానయ్యలక్కూడా అర్థం కావాలని ఒత్తిడిచేయడం మూలాన "ప్రత్యేక వ్యక్తీకరణలూ, విశిష్టపదప్రయోగాలూ చేసేవారంతా సామాన్యపాఠకుల పట్ల ద్రోహులూ, పాండిత్య ప్రదర్శనా లాలసులూ" అనే ఒక అన్యాయప్రచారమూ, దాన్తో పాటు అవహేళనా

ప్రబలాయి.

(ఋ) వీరిలోనే మతికొంతమంది ఇటీవల బయలుదేతి "తెలుగుభాష స్వాభావికంగా చాలా సరళమైనదనీ, కొత్త పదాల పేరుతో, లేదా ఆంగ్ల పదాల అనువాదాల పేరుతో భాషని సంక్లిష్టంగా, గందరగోళంగా అర్థం కాకుండా మార్చేస్తున్నా"రనీ విమర్శించడం మొదలు పెట్టారు. కొత్త తెలుగు పదాలు బాగాలేవని చెప్పడానికి వారెంచుకున్న 'శాస్త్రీయ' మార్గం వాటిని అవహేళన చేయడం. ఎవడైనా పరాయిభాష వారికి తెలుగు నేర్పడానికి ప్రయత్నించి చూడండి, ఈ భాష స్వతహాగా సరళం అవునో కాదో తెలిసిపోతుంది. వీరు సరళాంధ్రం అంటున్నది కూడా తమకి పుట్టుకతో వచ్చినది కాదనే సత్యాన్ని విస్మరిస్తారు. పుట్టి పెఱుగుతూ ఉన్న క్రమంలో కొద్దికొద్దిగా నేర్చుకుంటూ ఏళ్ళ తరబడి పెంచుకున్న పరిజ్ఞానమే అది. "ఆ కృషినే ఇప్పుడు కూడా కొనసాగించండి కొత్త పదాల విషయంలో" అని చెప్పినప్పుడు "ఎందుకు చేయాలి, అదీ తెలుగు కోసం ? " ఇదీ వారి మదిలో మెదిలే ప్రశ్న.

ఇటువంటి ఫిర్యాదులు చేసే చాలామందికి కొత్త ఇంగ్లీషు పదాలు నేర్చుకునే విషయంలో మటుకు ఏ ఫిర్యాదులూ లేవని గమనించాలి. వాటి విషయంలో ఎప్పటికప్పుడు 'అప్‌డేట్' అయిపోవాలని తాపత్రయపడడం మామూలు. పైపెచ్చు అర్థమయ్యే భాషలోనే అన్నీ ఉండాలని వాదించే వీరవ్యావహారికవాదులు నరమానవుడికి అర్థం కాని ఇనపగుగ్గిళ్ళ ఇంగ్లీషుశైలిలో వ్రాయడానికీ, మాట్లాడడానికి ప్రయత్నిస్తూండడం కూడా సర్వసాధారణం. అదేంటో గానీ, అన్ని చిక్కులూ తెలుగుతోనే వస్తాయి. తెలుగు పేరెత్తితేనే బుఱ్ఱ పనిచేయనంటూ మొఱాయిస్తుంది. తెలుగు అంటే చాలు, ఏదో తెలీని ఏవగింపు, కంటగింపు, తిరుగుబాటు భావన వారి హృదయాల్లో చెలరేగుతాయి. ఈ విధంగా వ్యావహారికవాదమనేది మన కాలానికొచ్చేసరికల్లా గుర్తుపట్టలేనంతగా రూపుమార్చుకుని ముసుగేసుకున్న మాతృభాషా ద్రోహంగా, ప్రచ్ఛన్న ఆంగ్ల వ్యామోహంగా, పక్కా అభివృద్ధినిరోధకంగా, ఆచరణలో యావద్భాషా విధ్వంస కార్యక్రమంగా, సకల వారసత్వానికీ పరశురామ ప్రీతిగా పరిణమించింది.

సమస్య ఏంటంటే, ఎవఱి వ్యక్తిగత కార్యావళులు (personal agendas) వారికున్నాయి. దురదృష్టవశాత్తు తెలుగు భాషాదేవి శరీరంలో ఒక కాలో, చెయ్యో, ముక్కో, మూతో ప్రేమించే వాళ్ళు మాత్రమే మనకు లభ్యమౌతున్నారు. యావత్తు తెలుగుభాషనీ సర్వసమగ్రంగా, ఏకమొత్తంగా ప్రేమించేవాళ్ళు కఱువుగా ఉన్నారు. తెలుగులోకి ఇంగ్లీషుని యథేచ్ఛగా దిగుమతి చెయ్యడాన్ని ఆమోదించాలనీ, అలా ఆమోదించనివారు ద్రోహులనీ, ఛాందసులనీ తిట్టే వ్యక్తి ఒకరు తగిలారు.

(తరువాయి వచ్చే సంచికలో...)

# కదలిక:

స.వెం.రమేశ్ నుండి....

చాన్నాళ్లయింది అమ్మనుడిలో నేను కనబడి. తెలుగుకోసం ఆరాటపడుతూ చేస్తున్న పోరాటాలను నలువైపుల నుండి చూసి నేను తెలుసుకొన్న నిక్కం ఏమిటంటే– ఆ ఆరాటాలూ పోరాటాలు అన్నీ కూడా తెలుగుకోసం కాదు అని, అవి తెలుగుముసుగు వేసుకొన్న పెరనుడి కోసమే అని. డు, ము, వు, లు, ని, ను, ల, తో, చే, కి, కు, లో, న, నుండి, గురించి, ఇంచు, చెయ్యి(చేయి) వంటి కొన్ని పదుల కూర్పులు మట్టుకే తెలుగుచప్పుళ్లు. మిగిలినదంతా ఆ పైవాడి నుడే. దానికోసమే ఈ పోరాటాలన్నీ. ఈ నిక్కం నాకు ఎరుకపడినాక–అంటే 'అమ్మనుడి' కూడా ఈ పెరనుడి ఊడిగం కోసమే అని తెలిసినాక, రాయడం మానుకొన్నాను. కానీ ఆగస్టు నెలలో వచ్చిన 'పదనిష్పాదనకళ' చదివినాక కడుపుమండి కనలును నిలుపుకోలేక రాస్తున్నాను.

అందులో ఉన్నవి తెలుగురాతలు అంతే, తెలుగు మాటలు కావు. వేలుపునుడిని బాగా ఎరిగినవాడికి కానీ అందులోని చాలా మాటలు తేటపడవు. ఆహూత, ప్రార్మగ్ర(దీనిని పలకడం కూడా నా చేతకాలేదు), జ్ఞత, తభావతులు, శాబ్దికులు, భావస్ఫోరకత, అంతర్నిహితం, ప్రజనన పాటవం, ఐకాంతిక సృష్టి, అభిదర్శనం, ఐకాంతిక స్వమూర్తులు, నిష్పాదన..... నాకు ఎరుకపడని మాటలు ఇలాంటివి బోలెడు ఉన్నాయి అందులో ఆంగ్లం మాటలూ పర్షో అరబిక్ మాటలూ రొచ్చే. ఆ ఆరొచ్చును ఇంట్లోకి రానీయకూడదు సరే, కానీ ఇంట్లోనే పేరుకుపోయున్న పీకలలోతు రొంపి మాటేమిటి? ఇంట్లో రొంపిలో పొర్లాడుతూ బయటనుండి రొచ్చు వచ్చేస్తుందని కలవరపాటా?

ఆనిమి మాటలు (సాంకేతిక పదజాలం) అందరికీ ఎరుకపడవలసిన పనిలేదు అని పేరున్న నుడి ఎసిదరి(శాస్త్రవేత్త) ఒకాయన గుచ్చిగుచ్చి చెప్పినారు. వారు 'అమ్మనుడి'కి తోడ్పాటరి కూడా. కాబట్టి పైమాటలు నాకు ఎరుకపడకపోయినా చీరిలేదు. అకశేరుకం, సకశేరుకం, తరంగదైర్ఘ్యం, కిరణజన్య సంయోగక్రియ, ఐకాంతిక దర్శనం, జాలవేదిక, భాషాదినోత్సవం, స్వాభిమాన దినోత్సవం, బోధనాభాష, మాతృభాష. దృక్పథం, మాతృభాషామాధ్యమ అంతర్జాల వేదిక, లాక్షణిక వర్గీకృత పాఠం, సైద్ధాంతిక స్పృహ..... ఇటువంటి వేనవేల ఆనిమిమాటలు తెలుగువేనా? ఈ తెలుగుకోసమేనా ఆరాటాలూ పోరాటాలూ? ఒకటవ తరగతి పొత్తంలో కూడా మూడువంతుల పెరమాటలను నింపేసి, వాటికోసమేనా తెలుగు ఇక్కువ (మాధ్యమ) బదులు? అట్లయితే ఆ పెరనుడి పేరుతోనే పోరు చేయవచ్చు కదా, తెలుగు పేరెందుకు నడుమన? ఇది తెలియనితనమా చేతకానితనమా కుట్రా...? ఏదయినా కావచ్చుకానీ, ఆపెరనుడి ఇనుపకాళ్ల కింద తెలుగు నలిగినుగ్గయిపోతున్నది మటుకు

నిక్కం. ఈ నలిపివేతలో 'అమ్మనుడి' కూడా పాలుపంచుకోవడం తెలుగుతల్లికి రంపపుకోతే.

'అమ్మనుడి' పాలుగోలుకు ఒక మచ్చును చూపుతూ ఈ మాటలను ముగిస్తాను. 'పదనిష్పాదనకళ'కు ముందుమాటగా 'అమ్మనుడి' కూర్పరి నాలుగు నుడుగులను నుడివినారు. వాటిని తిరిగి తెలుగులో రాస్తాను పోల్చుకొని చూడండి:

*"తెలుగులో మనం ఏదైనా రాద్దాం అని మొదలుపెట్టినపుడు, ఎదురయ్యే పెద్ద చిక్కు అప్పటికి కావాల్సిన మాటలు తట్టకపోవటం. తట్టినా అవి తెలుగు మాటలు కాకుండా, ఇంగ్లీష్వో, ఉర్దూవో, హిందీవో తడుతాయి. (ఉర్దూ మాటలూ హిందీ మాటలూ వేరువేరా? పర్సో అరబిక్ మాటలను ఉర్దూ అనీ సంసుక్రుతాన్ని హిందీ అనీ అంటున్నారా? సంసుక్రుతపుమాటల ఊసే లేదే? ) ఇందుకు వంచపు కతము, ఏదైనా మందలను విడమరచగలిగే, తెలుగులో ఆ మందలకు చెందిన మాటను మనంతట మనం పుట్టించకూడదు అని మనకు తెలియకుండానే మనం పెట్టుకున్న ఒక కట్టుబాటు. ఆ కట్టుబాటు ఎసిదమి అయినది/పనికిమాలినది, అక్కర లేని కట్టుబాటు. మనకు ఎరుక అయీ, అవతలివారికి చెప్పినపుడు వారికీ ఎరుకయితే ఆ చెప్పేనుడి తీరుగా పనిచేసినట్టు.*

*అందుకు మాటలు వాడుతున్నామా, చెయిగలు వాడుతున్నామా అన్నది అడక కాదు. అలానే మాటల్లో నుడికీ అలాంటి ఎల్లలు ఉండవు. నుడిగంటులలో ఉన్న మాటలే వాడాలి, నుడికట్టరులు ఒప్పుకున్నవే వాడాలి అని గిరిగీసి ఉన్నందువలనే వాడుకగానే మనం మన నుడిలోకి ఆంగ్లం మాటలను తెచ్చిపెట్టుకుంటున్నాము. ఆలా కాకుండా, తెలుగులో మనకు నచ్చిన మాటలను చేర్చుకొనే తడవు వచ్చిననాడు పెరనుడి మాటను ఉన్నదున్నట్లుగా అరువు తెచ్చుకోము. వాటికి తెలుగు నుడికారాలు అద్ది మన నుడిలోకి మన సొబగులతో తెచ్చిపెట్టుకుంటాం.*

*మరి ఇన్నేళ్లు లేని అలవాటును కొత్తగా ఎలా అలవరుచుకోవాలి? ఈ మందల గురించి తలపోసిన వీవెన్, చావా కిరణ్ ఇంకా ఇతర నేస్తాలు కలసి 2006లో తెలుగుపదం (telugupadam.org) వలగూడుని తెలుగు మాటలు చేర్చేందుకు అరుగుగా అవనించారు. ఆ అరుగులో చేర్చే మాటల గురించి పెనకువ కోసం తెలుగుపదం పెనకువరుగును ఏర్పరిచారు. అక్కడ పెనకువలు మొదలైన తొలినాళ్లలో పని చాలా చురుకుగా జరిగింది. ఆంగ్లంలో తరచూ వాడే ఎన్నో మాటలు తెలుగులో పుట్టించబడ్డాయి. కానీ ఒక కట్టుబాటూ కట్టడీ లేకుండా, ఏది సంస్కృతం మాటో, ఏమాట పుటక ఏదో తెలీకుండా పెనకువలు పక్కదారి పట్టాయి. అలాంటి పొద్దులో వాచస్పతిగారు అలాంటి పెనుకువలను ఎరుకిడిగా మరల్చేందుకు పలు కట్టురలు వ్రాసారు. ఆ కట్టురలు మెల్లిగా 2010-11 నాటికి చావా కిరణ్ చూచెన మేరకు పదనిష్పాదనకళ అన్న పొత్తంగా పొడగట్టసాగాయి.*

*తెలుగులో మాటలు వాడాలనుకునేవారు జోలి పట్టి పెనకువగుముల్లో తెలుగుమాటల కోసం అడుక్కోకుండా/తిరిపెమెత్తకుండా, వారంత వారే తమకు తామే తెలుగుమాటలు పుట్టించుకొనేలా ఎక్కొలుపుతాయి ఈ కట్టురలు.*

*పదేళ్లక్రితం వాచస్పతిగారి తలపోతలు తరిపోకడలో మారాయి. అంతకు మునుపు ఒక విడితైన నెలవికే అలవిక అన్న తలపునుండి, తెలుగులోని అన్ని తావుల నుడులూ దీటయినవే, అన్ని తెలుగుతావుల నుడికారాల మాటలతో తెలుగు నెరవడి అవుతుంది అన్న తలపులతో పాత కట్టురలకు మరింత మెరుగు అద్దారు.*

*ఆ మెరుగుపరిచిన కొత్త కట్టురలు మీకోసం ఈ నెల నుండి అమ్మనుడిలో వెలువడుతాయి. ఈ కట్టురలను చదివి, తెలుగుమాటల సాగులో మీరు కూడా సాగరులై మంచి రాబడిని పొందుతారని కోరుకొంటున్నాము..... -కూర్పరి*

**<u>సవరణ</u>**

**ప్రాఙ్మర్గ** అని ఉండవలసినది **ప్రార్మగ** అని అచ్చయింది. తప్పును తెలియజేసినందుకు మప్పిదాలు.... *సం॥*



"దేశభాషాభిమానము తోడిదే దేశాభిమానము. ఏ కులమువారైనా, ఏ మతమువారైనా ఏ దర్జావారైనా తెలుగు మాతృభాషగా గలవారందరూ ఒక్క సంఘమువారనిన్ని, సంఘములోనివారందరూ అభివృద్ధిపొందితేనే కాని, సంఘము అభివృద్ధిపొందదనిన్ని, ఎవరు వెనుకబడ్డా సంఘమునకు నష్టమే అనిన్ని, ఎవరు త్రికరణశుద్ధిగా భావిస్తారో వారే దేశాభిమానము గలవారని చెప్పవలెను"

– గిడుగు వేంకట రామమూర్తి

నవల

డి.పి. అనూరాధ
90100 16555



# జగమునేలిన తెలుగు

## గోదావరి నుంచి జావా దాకా... 10



*(జరిగిన కథ)*

***కాలాలకు అతీతంగా ప్రయాణం చేస్తుంటాడు సూర్యవర్మ. తెలుగుజాతి ఆనవాళ్లని ఆగ్నేయాసియాలోని మయన్మార్, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం, ఇండోనేషియా దేశాలలో కనుగొంటాడు. ఆ దేశాలలో నేటికీ చెక్కుచెదరకుండా ఉన్న ఘనమైన వారసత్వ సంపదను అందరికీ ఎలా తెలియజేయాలో తెలియక మధనపడుతుంటాడు. భాషావేత్తలని, ఆంత్రోపాలజిస్టులను కలుసుకుంటాడు. అగమ్యగోచరమైన అతడి ప్రయాణం ఏ తీరం చేరింది?***

**స.వెం** రమేశ్ ను కలిసిన తరవాత నా గమ్యం క్లిష్టంగా మారిందని అర్థం అయింది. క్రీస్తు పూర్వం తొలినాళ్ల నుంచీ ఎంతో ఘనకీర్తిని సాధించిన తెలుగుజాతి చరిత్రనంతా అలాగే విడిచిపెట్టకూడదని నిశ్చయించుకున్నా. ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నా. కానీ ఏం చేయాలో తెలియని స్థితి. నిరంతరమూ అదే ధ్యాసలో ఉండిపోయా. నిద్రాహారాలు మానేశా. స్నేహితులని కలుసుకోవడమూ మానేశాను. నా మీద నాకే స్పృహ లేకుండా ఉండిపోయా. గదిలో కూర్చుని కళ్లు మూసుకుని నా కలలోకి వెళ్లిపోతున్నా. ఒక్కలప్ప, మన్ జాతీయులు, 'ఓ కొడుకా మన నేల తెలంగాణ' జోల పాట నా చెవుల్లో మారుమోగుతోంది. హరిపుంజాయి రాజ్యంలో ప్రవల్లిక తో పాటు ఏనుగు అంబారీపై విహరిస్తున్నట్టుగా, ఆంగ్ కార్ వాట్ ఆలయంలో పీటర్తో తిరుగుతున్నట్టుగా ఉంది. భద్రేశ్వర స్వామి ఆలయంలో భద్రతో కలిసి ఆచార్యుడిని కలుసుకున్నట్టుగా అన్పిస్తోంది. ఇండోనేషియాలో గలగల ప్రవాహం లాంటి వెన్నెల మాటలు చెవుల్లో మార్మోగుతున్నాయి.

ఎవరు వీళ్లందరూ... నాకేమవుతారు... ఆయా దేశాల్లో తెలుగు జాతి చరిత్రను తెలియజేసేందుకే నన్ను కలిశారా? అందుకే నా చేత అన్నిరకాల ప్రమాణాలు చేయించుకున్నారా? నేనిప్పుడు ఏం చేస్తున్నా? వాళ్ల కిచ్చిన మాటలను ఎంత వరకు నిలుపుకుంటున్నా? అస్సహాయుడిగా ఓ గదిలో కూర్చుండిపోయాను. నా కల మర్మం ఏమిటి? దాని కోసం నేనేం చేయాలి? క్రీస్తు శకం తొలినాళ్లలోనే మన తెలుగు జాతీయులు ఆగ్నేయాసియాలో మన కీర్తిని రెపరెపలాడించారు.. అనుకూలమైన ప్రతి చోటా రాజ్యాలను స్థాపించారు. వారి విజయగాథలను నేటి తెలుగు భూభాగానికి చేరవేయాల్సిన బాధ్యత నామీద ఉంది. కానీ దీని కోసం ఏం చేయాలి? అయినా నా మాటల్ని ఎవరు నమ్ముతారు?

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం భారతదేశానికి రావడానికి 14వ శతాబ్ది వరకూ వేచి చూడాల్సి వచ్చింది. కానీ మన తాత ముత్తాతలు క్రీస్తు శకం తొలినాళ్లలోనే హిందూ మహాసముద్రాన్ని చాకచక్యంగా మచ్చిక చేసుకున్నారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ సుదూర తీరాలకు వెళ్లారు. రాజ్యాలు స్థాపించారు. తమ ఆనవాళ్లని విడిచిపెట్టారు. వాటిని మనం గుర్తించడంలో విఫలం అయ్యాం. మన జాతికి అంత తెగువా అన్న నిర్లక్ష్యం.. నిర్లిప్తత. సాక్ష్యాధారాలతో నిరూపిస్తే వింటారుగా అనే ఆలోచన. పిచ్చిమాటలుగా కొట్టేసే ప్రమాదమూ లేకపోలేదు. ఈ పరిపరి ఆలోచనలకు పిచ్చెక్కిపోతోంది. హాయిగా సాగుతోన్న నా జీవితాన్ని చెల్లాచెదురు చేసిన వ్యక్తి 'మగాడు'. నాగార్జునకొండలో నా ఎడమ జబ్బకు పచ్చబొట్టు వేసిన ఆ కోయదొరను ఈసారి వదలకూడదు. ఆయనెక్కడున్నా సరే వెతికి పట్టుకోవాలి. ఓ ఆలోచన తట్టింది.

హాల్లోకి వెళ్లి.. 'అమ్మా, నాన్నా నేను రేపు ఉదయం నాగార్జునకొండకు వెళుతున్నా' అని చెప్పేసి వాళ్ల స్పందన తెలుసుకోకుండానే వెనక్కి తిరిగి వచ్చేశా నా గదిలోకి.

మరుసటి ఉదయం శుభ్రంగా తయారై బయటకు వచ్చేసరికి



పెద్దవాళ్లిద్దరూ ఆశ్చర్యపోయారు. వాళ్ల కళ్లల్లో మెరుపును గమనించాను. అయినా ఏమీ తెలియనట్టుగా వీడ్కోలు చెప్పేశాను. కారులో బయల్దేరా ఒంటరిగా.. ఇది వరకు ఇదే కారులో మిత్రులందరినీ తీసుకుని వెళ్లా. కానీ ఇప్పుడు ఒక్కడినే.

ముందుగా అనుపు దగ్గరికి వెళ్లాను.. రంగభూమి కలియ తిరిగాను. గోళాకారంలో ఉన్న స్టేడియం లాంటిదది. దిగువన మైదానంలో మల్ల యుద్ధాలు, కోడి పందాలు జరుగుతుంటే కూర్చుని చూసేలా నాలుగు వైపులా రాతి బల్లలను ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది కూర్చోవచ్చు. పక్కనే ఉన్న పురావస్తు శాఖ పేరుపలక (బోర్డు)పై రంగభూమి, రెండో శతాబ్దం అని రాసి ఉంది. రోమ్ లోని కొలోజియమ్ గుర్తుకువచ్చింది. కొలోజియమ్ ని ఒకటో శతాబ్దిలో నిర్మించారని గూగుల్ చెబుతోంది. అంటే రోమ్ లో కట్టిన వందేళ్ల తరవాత మన దగ్గర రంగభూమి నిర్మించారు. రోమన్ ప్రభావంతో కట్టారా లేక మన వాళ్ల సొంత ఆలోచనా??

అనుపు దగ్గరే ఉన్న మరో పురావస్తు అవశేషం అలనాటి నాగార్జున విశ్వవిద్యాలయం! దేశవిదేశాల నుంచి ఎందరో విద్యార్థులు ఇక్కడికి వచ్చి బౌద్ధం, తర్కశాస్త్రం, ఖగోళం లాంటి అనేక అంశాలపై అధ్యయనం చేసేవారట. దేశంలో అతి ప్రాచీన విశ్వవిద్యాలయంగా నలందాని పేర్కొంటారు కానీ నాగార్జున విశ్వవిద్యాలయం రెండో శతాబ్దికే చెందింది. నలంద అయిదో శతాబ్ది నాటిది. ఎందుకో స్వాతంత్ర్యానంతరం తెలుగుజాతిని చిన్నచూపు చూసినట్టుంది. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణం వల్ల నాగార్జున కొండలోని పురావస్తు విశేషాలకు విఘాతం ఏర్పడింది. వాటిని యథాతథంగా వెలికి తీసి అనుపు దగ్గర కొన్ని, నాగార్జున కొండ దగ్గర కొన్ని పురావస్తు విశేషాలను పునరుద్ధరించారు.

నేడు నాగార్జున కొండ అనేది ఓ కృత్రిమ దీవి, కృష్ణానదిలో నిర్మించారు. అక్కడి మరో విశేషం మ్యూజియం. ఆ దీవికి చేరుకోవాలంటే ఓ అరగంటపాటు బోటులో ప్రయాణించాల్సిందే. టికెట్ తీసుకుని బోట్లో కూర్చున్నాను. చిన్నా పెద్దా కలిపి ఓ యాభై మంది ప్రయాణికులు ఉన్నారు. పిల్లల కేరింతలతో సందడిగా ఉంది. ఆ నీటి ప్రవాహాన్ని చూస్తూ అలాగే ఉండిపోయాను. రెండు వేల ఏళ్లనాడు ఎక్కడెక్కడి దేశాల నుంచి ఎందరో భిక్కువులు బుద్ధం శరణం గచ్ఛామి అంటూ తిరుగాడిన ఈ కనుమల్లో నేనూ ప్రయాణించడం చెప్పలేనంత ఆనందాన్ని కలిగిస్తోంది. ఇంతకు ముందు ప్రయాణంలో లేని తన్మయం ఇది.

మా ఎదురుగా మరో మోటారు బోటు వస్తోంది. దీవి నుంచి సందర్శకులను వెనక్కి తీసుకువస్తోంది. ఆ బోటులో ఉన్న వారంతా తెల్లని దుస్తులు ధరించి భిన్నంగా కన్పించడంతో వాళ్లను నిశితంగా గమనించడం మొదలుపెట్టాను. మగవారందరూ లుంగీ, షర్ట్ ధరిస్తే, ఆడవాళ్లందరూ లంగా, షర్టూ వేసుకున్నారు. యువత నుంచి వృద్ధుల వరకూ అన్ని వయసుల వారూ ఉన్నారు. వారిని చూస్తుంటే విదేశీయులగానే అన్పిస్తున్నారు. ఒక్కొక్కరినీ చూస్తున్న నాకు ఓ యువతిని చూడగానే గుండె ఆగినంత పనైంది. తను ప్రవల్లిక. నా కలలో హరిపుంజాయి రాజ్యంలో ఏడో శతాబ్దిలో నన్ను ఆటపట్టించిన ప్రవల్లిక.. మళ్లీ ఇలా కన్పిస్తుందని ఊహించలేదు. తనను జీవితంలో చూస్తాననీ అనుకోలేదు. అప్పుడు రాకుమారిలా ఉంది, ఇప్పుడు సామాన్యురాలిగా కన్పిస్తోంది.

ఆ పడవ మా దగ్గరగా వచ్చినట్టే వచ్చి మమ్మల్ని దాటుకుని ముందుకు వెళ్లిపోతోంది. ప్రవల్లికను చూసిన సంభ్రమాశ్చరాల్లో ఉన్న నేను ఆ విషయాన్ని పట్టించుకోలేదు. పడవ నా కళ్ల నుంచి దూరమవుతుంటే దూకేద్దామనే అనుకున్నా. కానీ ఆగిపోయా.

'ప్రవల్లికా, ప్రవల్లికా ..' గట్టిగా అరిచా.

ఆమెలో ఎలాంటి స్పందనా లేదు. ఆమే కాదు ఆ పడవలోని వాళ్లెవర్వూ నా మాటల్ని పట్టించుకున్నట్టు అన్పించలేదు. దు:ఖం తన్నుకువస్తోంది. గుండె బయటికి వచ్చి కొట్టుకుంటోన్న భావం. నిస్సహాయుడిగా ఉండిపోయా. నా పడవలోని వాళ్లందరూ నన్ను విచిత్రంగా చూస్తున్నట్టు గమనించి స్పృహలోకి వచ్చాను, నిమ్మలంగా కూర్చుండిపోయాను. సుదూరంలో లంగరు వేసిన కొన్ని లాంచీలు కన్పించాయి. మా పడవ మోటారును ఆపారు. మరి కొన్ని నిమిషాల్లో కిందకి దిగుతానని సమాధానపరచుకున్నా.

లాంచీని ఆపగానే అందరి కంటే ముందుగా ఎంతో ఆత్రంగా దిగి ఇందాక వెనక్కి వెళ్లిన పడవలో ఉన్న వాళ్లెవరని ఒడ్డునున్న వారిని అడిగాను. తెలియదనే సమాధానం. మెట్లెక్కుతూ పైకి వెళ్తుంటే టికెట్ కేంద్రం కన్పించింది. నేరుగా ఆ కౌంటర్ దగ్గరికి వెళ్లి వివరాలు అడిగా. ఆ లాంచీ బృందం వారందరూ శ్రీలంకకు చెందిన వారని, గత మూడు రోజులుగా నాగార్జునకొండలోని సింహళ విహారంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వెళుతున్నారని చెప్పారు. వెంటనే టికెట్ కొనుక్కుని వెనక్కి వచ్చేద్దామని అనుకున్నా. కానీ మరో గంటకు మాత్రమే లాంచీ ఉందని నిర్వాహకులు చెప్పడంతో అక్కడే కూర్చుండిపోయాను. దూరంగా విస్తారమైన కృష్ణా నదీజలాలు. నాకూ ప్రవల్లికకూ మధ్య అంతులేని అగాథం. తొందరగా వెళ్లి ఆమెను కలుసుకోవాలి.

ఓ గంట వరకూ నిరీక్షణ. ఆ తరవాత ముప్పావుగంట లాంచీ ప్రయాణం. సాగర్ కి చేరుకునే సరికి ఎంత లేదన్నా రెండు గంటల పడుతుంది. అంతసేపు వాళ్లుంటారా? వెళ్లిపోతారా? నా అనుమానమే నిజమైంది. ప్రవల్లిక నా నుంచి దూరంగా వెళ్లిపోయింది. సాగర్ నుంచి అనుపు దాకా కారులో తిరిగి చూశా. ఎక్కడా శ్రీలంక బృందం జాడలేదు. అంతులేని నిరాశతో ఇంటికి వచ్చేశా.

ప్రవల్లిక రూపమే మనసునిండా. 'సూర్యా' అంటూ పిలుస్తున్నట్టుగా ఉంది. కలంతా వాస్తవంగా కళ్లముందు మెదలుతోంది. జీవితంలో తొలిసారిగా నా మనసు దోచుకున్న

మగువ. అందుకే ధైర్యంగా ఐలవ్యూ చెప్పా. నా ప్రేమను పరీక్షించడానికి పందెం కట్టింది. ఆ తెల్లకలువను కోయబోతూ బురదలోకి కూరుకుపోయాను. కాలచక్రం ప్రకారం అదంతా జరిగింది ఏడో శతాబ్దం. ఆ తరవాత మరే దేశంలోనూ ప్రవల్లిక కన్పించలేదు. అమితాశ్చర్యకరంగా నేడు శ్రీలంక బృందంలో తను కన్పించింది. తను అసలు ప్రవల్లికేనా? ఆమెకు నేను గుర్తుంటానా? అసలు నా కలలో కన్పించిన సంగతి ఆమెకు తెలుసా? అన్నీ ప్రశ్నలే. ఏం చేయాలో తెలియని సందిగ్ధత. కలలో జరిగింది నా చేతులలో లేదు కానీ కళ్లెదురుగా తన కన్పించింది. మనసారా ప్రయత్నిస్తే నా ప్రేమను దక్కించుకోవచ్చు. అందుకే ఆలస్యం చేయకూడదని అనుకున్నా. శ్రీలంకకు వెంటనే బయల్దేరా.

హిందూ మహాసముద్రంలో కన్నీటి చుక్కలా ఉండే అందమైన దేశమే శ్రీలంక. ఆ నేలంతా బౌద్ధానికి ప్రసిద్ధి. అక్కడ ఎన్నో బౌద్ధ ఆలయాలు, విహారాలు. అనురాధపుర, క్యాండీ, దంబుల్లా, పొలన్నురువ... ఇలా ఎన్నో! ఎంతో ఉద్వేగంతో రాజధాని కొలంబోలో అడుగుపెట్టాను. భారతీయులకు 'వీసా ఆన్ అరైవల్' ఉంది. విమానాశ్రయం నుంచే ఓ టాక్సీని మాట్లాడుకుని అతి పెద్ద బౌద్ధ క్షేత్రం క్యాండీకి బయల్దేరాను.

కొలంబో ప్రధాన దారులన్నీ తీర్చిదిద్దినట్టు ఉన్నాయి. ఇక్కడ ప్రతి పావు కిలోమీటరుకు ట్రాఫిక్ సిగ్నల్స్..జీబ్రా క్రాసింగ్ దగ్గరే ప్రజలు రోడ్డును దాటుతున్నారు అదీ సిగ్నల్ పడినప్పుడే. చిన్నదేశమైనా వారి క్రమశిక్షణ బాగుంది. రోడ్డుపై అనేక కంపెనీల కార్లు తిరుగుతున్నాయి. టూవీలర్లు తక్కువే. క్రమంగా హైవే మీదకి వచ్చాం. ప్రయాణ బడలికకు నిద్రపట్టేసింది.

డ్రైవర్ మాటలకు మెలకువ వచ్చి చూస్తే .. క్యాండీ వచ్చేసింది. ఎక్కడికి తీసుకువెళ్లాలని ఇంగ్లిష్లో అడుగుతున్నాడు.

బ్రిటీష్ పాలనలో ఉండటం, టూరిస్టు ప్రధానమైన దేశం కాబట్టి శ్రీలంకలో సింహళం, తమిళంతో పాటు ఇంగ్లిష్ కూడా ఓ మోస్తరుగా మాట్లాడతారని తనే చెప్పాడు. శ్రీదలదమాలిగవ ఆలయ సమీపంలో ఏదైనా మాంచి హోటల్ కి తీసుకువెళ్లమని చెప్పాను. దాదాపు మూడున్నర గంటలు ప్రయాణించాం. సాయంత్రం అయింది. క్యాండీ అంతా కొండలపైన నిర్మితమైన నగరం. కొండల మధ్య ఉన్న సువిశాల మైదానంలో శ్రీదలద మాలిగవ ఆలయం ఉంది. ఆ ఆలయానికి ఎదురుగా ఉన్న 'క్వీన్స్' హోటలికి డ్రైవర్ తీసుకువచ్చాడు. కొలోనియల్ ఆర్కిటెక్చర్లో చాలా అందంగా నిర్మించారు. అక్కడి వాతావరణమూ నచ్చి వెంటనే చేరిపోయా. ఆ రాత్రి ఎక్కడికీ వెళ్లవలసింది లేదనీ, ఉదయం అవసరమైనప్పుడు కాల్ చేస్తానని డ్రైవర్ కి చెప్పి పంపించేశాను.

గదిలో కాస్త ఫ్రెష్ అయి కింద ఉన్న రెస్టారెంట్కి వచ్చాను. మెనూ తెచ్చిచ్చాడు సర్వర్. అన్నంతో పాటు ఆపం, పరిప్పు(మన పప్పు లాంటిది) ఆర్డర్ చేశాను. యోగార్ట్ ఉందికానీ పెరుగు మాత్రం లేదన్నారు. సలాడ్స్ మామూలే. ఈ క్వీన్స్ హోటల్ కి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉంది. ఇది త్రీ స్టార్ హోటల్. ఒకప్పుడు బ్రిటీష్ గవర్నర్ వసతి గృహంగా ఉండేది. మెనూపై ఆ హోటల్ చరిత్రంతా చదువుతుంటే భలే ఆసక్తిగా అన్పించింది. అక్కడికి వచ్చే ప్రతి టూరిస్టుకు తమ చరిత్రను తెలియజేయాలనే ఆలోచన చేసిన



నిర్వాహకులను అభినందించవలసిందే. ఆర్డర్ చేసిన వంటకాలన్నిటినీ వేడివేడిగా తీసుకువచ్చి నా ముందు పెట్టాడు వెయిటర్. అన్నం దంపుడు బియ్యంలా మందంగా ఉంది. వంటకాలన్నీ బాగున్నాయి. కానీ కాస్త ఘాటుగా అన్పించాయి. ఒక్కో రుచి చూస్తూ తీరిగ్గా తింటున్న నాకు గోడ మీద ఫ్రేములు కట్టించి ఉన్న రెండు ఫొటోలు ఆకర్షించాయి. ఓ ఫొటోలో ఉన్న స్త్రీమూర్తి మెడలోని పెద్ద తాళిబొట్లను చూస్తూ ఒక్కసారిగా లేచా. తిరుపతి పద్మావతీ అమ్మవారి మెడలో కూడా ఇలాంటి తాళిబొట్టును చూసిన గుర్తు. ఆవిడ తెలుగు వారా అన్న సందేహంతో ఫొటో దగ్గరగా వెళ్లా. ఆ ఫొటో కింద ఉన్న పేరు నా అనుమానం నిజమే అని తేల్చేసింది. ఆమె పేరు వెంకట రంగమ్మ, క్యాండీ ఆఖరు రాణిట. పక్కన ఆమె భర్త విక్రమ రాజ సింగ, క్యాండీ ఆఖరు రాజు. వెంకట సుబ్బమ్మ, రంగమ్మ, నర్సమ్మ అనే పేర్లు మన నానమ్మలకి, అమ్మమ్మలకి ఉంటాయి. శ్రీలంక అనగానే తమిళులు గుర్తుకువస్తారు. కానీ శ్రీలంకను పరిపాలించిన ఆఖరు రాణిది తెలుగు వారి పేరులా ఉంది. వీళ్ల గురించి పూర్తి వివరాలు ఎక్కడ తెలుస్తాయని ఆ హోటల్ మేనేజర్ నే అడిగాను. క్యాండీ ఆలయంలో పెద్ద లైబ్రరీ ఉందనీ, ఆలయం వెనక వైపున రాజప్రాసాదం ఉంది, దాన్ని నేడు మ్యూజియంగా మార్చారని వివరించాడు. నింపాదిగా భోజనం చేసి గదికి వచ్చాను కానీ ఉదయం ఎప్పుడవుతుందా అనే ఆలోచనలో నిద్ర పట్టిందో లేదో తెలియదు.

శ్రీలంక ఫేవరెట్ ఫుడ్ ఇడియప్పం(బియ్యం పిండితో చేసే సేమియా లాంటిది)ను సాంబారుతో కలిపి తిని ఓ మోస్తరు బ్రేక్ ఫాస్ట్ ముగించేసి ఆలయంలోకి అడుగుపెట్టాను. ఆలయం ఎంత పెద్దగా ఉందో దానికంటే రెండింతలు పెద్దగా ఉంది పక్కనే ఉన్న క్యాండీ సరస్సు. సువిశాలమైన ఆలయ ప్రాంగణం అది.. అష్టభుజి ఆకారంలో నిర్మించారు. శంఖం ఆకారంలో ఉన్న భుజాలకు మాత్రం ఇటుకరంగు, మిగతా అంతా తెల్లని పెయింటు వేసి ఎంతో అందంగా తీర్చిదిద్దిన ఆలయానికి చేరుకోవాలంటే ప్రధాన ద్వారం నుంచి అరకిలోమీటరు నడవాలి. ఎందరో భక్తులు ఎర్రని, తెల్లని తామరలున్న సజ్జలతో గుంపులు గుంపులుగా వస్తున్నారు. అక్కడంతా ఉత్సవ వాతావరణం.

బౌద్ధ మతస్థులు ఎంతో పవిత్రమైందిగా ఈ ఆలయాన్ని భావిస్తారు. బుద్ధుడి దంతం ఇక్కడ భద్రపరచి ఉండడమే దీనికి కారణం. అందుకే శ్రీదలద మాలిగవ అంటే పవిత్రమైన దంతం ఉన్న ఆలయంగా పేరు స్థిరపడింది. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గా ఈ ఆలయాన్ని గుర్తించింది. శ్రీలంకలో అత్యధిక రెవెన్యూ

ఆర్జిస్తున్న ఆలయం కూడా ఇదే. ఎంట్రన్స్ టికెట్లో ఆలయ వివరాలతో పాటు లే అవుట్ అంతా ముద్రించారు. ఈ మ్యాప్ ఆధారంగా ఎక్కడెక్కడ ఏం ఉన్నాయో పేర్కొన్నారు. నేను ఆలయంలోకి ప్రవేశించ కుండా, రాణి వెంకట రంగమ్మ ఆనవాళ్లని తెలుసుకుందామనే కుతూహలంతో ఆలయానికి వెనుక వైపున ఉన్న 'పత్తిరిప్పువ' అనే భవనానికి వచ్చాను. అక్కడ మొదటి అంతస్థులో రాజు కూర్చుని ఆలయ ఉత్సవాలను వీక్షించేవారట. బ్రిటీష్ కాలంలో ఇక్కడ లైబ్రరీని ఏర్పాటుచేశారు. అది ఈనాటికీ అలాగే నిర్వహిస్తున్నారు. అక్కడి లైబ్రేరియన్ ని కలుసుకుని నన్ను నేను పరిచయం చేసుకుని రాజు, రాణికి సంబంధించిన చారిత్రక పుస్తకాలు కావాలని కోరాను. 'హిస్టరీ ఆఫ్ క్యాండీ' పేరున కొన్ని పుస్తకాలు ఆయన అందించారు. అక్కడే కూర్చుని చదవడం ప్రారంభించా. క్యాండీని పరిపాలించిన ఆఖరు ప్రభువుల్ని అక్కడ 'వడగర్లు' అని పిలిచేవారట. అంటే ఉత్తరం నుంచి వచ్చిన వాళ్లని అర్థం. వారు మధురై నాయక రాజవంశీయులు. వారి మాతృభాష తెలుగు. ఈ వాక్యాలు చదువుతుంటే గుండె సంబరంతో ఉప్పొంగినట్టుగా అన్పించింది. దాదాపు 200 ఏళ్ల పాటు వీరు క్యాండీని పరిపాలించారు. వెంకట రంగమ్మకి సావిత్రమ్మ అని మరో పేరూ ఉందట. అలాగే సింహాసనం అధిష్టించక ముందు విక్రమ రాజసింగ మహారాజు పేరు కన్నుస్వామి. క్యాండీని పరిపాలించిన సింహళ రాజులు తంజావూరు, మధురై రాకుమారిలను వివాహం చేసుకునే ఆచారాన్ని పాటించేవారట. అంతేకాదు పోర్చుగీసువారితో యుద్ధాల సమయంలో కూడా వడగర్ల సహాయం తీసుకునేవారు. సింహళ రాజు నరేంద్ర సింగ పిల్లలు లేకుండానే మరణించాడు. నరేంద్ర సింగ మధురై రాణి తమ్ముడు విజయ రాజ సింగ, చక్రవర్తిగా రాజ్యాన్ని చేబట్టాడు. అలా క్యాండీ 1739లో మధురై నాయక రాజుల పరిపాలనలోకి వచ్చింది. విజయరాజ సింగ హిందూ మతస్థుడైనప్పటికీ బౌద్ధ మత వ్యాప్తికి ఎంతో కృషి చేశాడు. ఎన్నో బౌద్ధ గుహాలయాలను నిర్మించాడు. ఆయన తరవాత అధికారంలోకి వచ్చిన కీర్తిశ్రీ రాజసింగ క్యాండీలోని రాజమహావిహారాన్ని నిర్మించాడు. దలదమాలిగవలో ప్రస్తుతం ఉన్న గర్భగుడిని నిర్మించింది కూడా కీర్తిశ్రీనే. తన 35 ఏళ్ల పాలనలో కీర్తిశ్రీ డచ్ కోటల మీద దండయాత్ర చేసి క్యాండీ రాజ్యాన్ని ఎంతో పటిష్టం చేశాడు. విదేశీ శత్రువులకు సింహ స్వప్నంగా నిలిచాడు. గుర్రపు స్వారీ చేస్తూ కింద పడి గాయపడిన కీర్తిశ్రీ 1782లో మరణించాడు. 1815 వరకు కూడా మరో ఇద్దరు నాయక వంశస్థులు క్యాండీని పరిపాలించారు. ఆఖరుకి 1815లో ఈ కోటను 'క్యాండీ కన్వెన్షన్' ప్రకారం బ్రిటీషర్లు స్వాధీనం చేసుకున్నారు. క్యాండీ ఆఖరు రాజు విక్రమ రాజ సింగను, రాణి వెంకట రంగమ్మను కొంత కాలం కొలంబోలో బందీలుగా ఉంచి, ఆ తరవాత నేటి తమిళనాడులోని రాయ్ వెల్లూరుకు తరలించారు. మార్గమధ్యంలోనే రాణి ప్రాణాలు కోల్పోయింది. రాజు రాయ వెల్లూర్ కోటలో బందీగా ఉంటూ అక్కడే ప్రాణాలు విడిచాడు. వారి సమాధులు నేటికీ అక్కడ ఉన్నాయి. ఈ కథంతా చదివేసరికి గుండె బరువెక్కింది. ఎంతో గొప్పగా బతికిన మన తెలుగు రాజ వంశీయులు ఆఖరుకు బందీలుగా తమ జీవితాలను ముగించారు. ఈ కథంతా మనకు ఎందుకు తెలియదు. ఏ పుస్తకంలోనూ ఎందుకు రాయలేదు. **ట్యాంక్ బండ్ మీద ఉన్న శిల్పాల్లో కీర్తిశ్రీ శిల్పం ఎందుకు లేదు. నేడు రాజకీయ పరంగా గిరిగీసుకున్న సరిహద్దుల్లో లేని తెలుగు వారు మన వాళ్లు కాకుండా పోతారా? వారి ఘనకీర్తిని మనం గాలికి వదిలేయాలా? మయన్మార్, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం, ఇండోనేషియాలతో పాటు శ్రీలంకలో కూడా మన తెలుగు జాతి జెండాలు రెపరెపలాడాయి. ఏదో పరాయి దేశంలో ఏదో ఊర్లో ఎక్కడో ఉన్నాను అని ఆ క్షణం ముందు వరకూ ఉన్న ఫీలింగ్ పూర్తిగా తొలగిపోయి ఇది మా తాత ఊరు, ఆయన కట్టించిన కోట.. ఆలయం అనే భావం కలిగి ఉత్సాహం ఉరకలెత్తింది.** అక్కడి వివరాలన్నీ సెల్ ఫోన్లో ఫొటోలుగా తీసుకుని బయల్దేరా.

నా ఎదురుగా వచ్చాడు ఓ ఆజానుబాహుడైన వ్యక్తి. ఇద్దరి చూపులు కలవడంతో ఒకరికొకరం నవ్వుతూ పలకరించుకున్నాం.

'సూర్యవర్మ.. భారతదేశం'

'అనురా, శ్రీలంక. టూరిస్టా?' ప్రశ్నించాడు తను.

'శ్రీలంకలోని బౌద్ధ నగరాలను చూడ్డానికి వచ్చా'

'ఇండియాలో మీది ఏ ప్రాంతం' అని అడిగాడు.

'హైదరాబాద్ అని ఓ క్షణం ఆగి, అమరావతి' అన్నాను.

'ఓ అమరావతా, మా పూర్వీకులకు ఎంతో పవిత్రమైన స్థలం అది. అక్కడ దలైలామా నిర్వహించిన కాలచక్ర పూజలకి మా వాళ్లందరూ వెళ్లారు'

'మీరు ఇండియా రాలేదా' అడిగాను.

'ఇంకా అంతటి అదృష్టం నాకు కలగలేదు. అమరావతి, నాగార్జునకొండకి తప్పకుండా వెళ్లాలి. వాస్తవానికి నా పేరు కూడా మీ ప్రాంతానికి సంబంధించిందే. శ్రీలంకలో తొలి రాజ్యాన్ని స్థాపించిన వాడు విజయుడు. అతడు నిర్మించిందే అనురాధపుర. శ్రీలంక ప్రాచీన రాజధాని నగరం అది. ఆ విజయుడు కళింగానికి అంటే నేటి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడని పేర్కొంటారు. ఆ తొలి రాజధాని గుర్తుగా మా దేశంలో ఆడపిల్లలకు అనురాధ అనీ, మగపిల్లలకు అనురా అనీ పేర్లు పెట్టుకోవడం ఆనవాయితీ. అలా నా పేరుకి మూలం మీ ప్రాంతమే. ప్రస్తుతం క్యాండీ ఆలయంలో మీడియా రిలేషన్స్ ఆఫీసరుగా చేస్తున్నాను.'

అతడు చెబుతున్నదంతా వింటుంటే నాకెంతో సంతోషమైంది.

'చిన్నప్పుడు జాతరలో తప్పిపోయిన అన్నయ్యను కలుసుకున్నంత ఆనందంగా ఉంది' అంటూ అనురాను గట్టిగా హత్తుకున్నాను. తనలో కూడా అదే భావం కలిగినట్టుంది అంతే సంబరపడ్డాడు.

'సూర్యా, నీకు ఆశ్చర్యం కలిగించే ఇంకో విషయం చూపిస్తాను, మనం ఆలయంలోకి వెళదాం రా' అంటూ ముందుకు వెళుతోన్న అతడిని అనుసరించా.

ఇద్దరం మెట్లుదిగి కిందకి వచ్చేశాం. ఎక్కడ చూసినా భక్తులే. పిల్లలూ పెద్దలూ అందరూ ఉన్నారు. అక్కడి నుంచి ఓ పది నిముషాలు నడిస్తే కానీ ప్రధాన ద్వారం చేరుకోలేకపోయాం. అంటే ఎంత పెద్ద ఆలయమో గ్రహించవచ్చు.

(తరువాయి వచ్చే సంచికలో...)

ధారావాహిక

డా॥ ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడల్లో ఆనవాళ్లు-1

# నా కోహినూరు - కోళ్లూరు యాత్ర

**కృష్ణా**తీరంలో, గుంటూరు జిల్లాలోని ఒక ఊళ్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కోహినూర్ వజ్రం దొరికిందని, ఆవూరు కొల్లూరని ప్రచారమైంది. అందరూ తెనాలి తాలూకాలోని కొల్లూరని అనుకొంటారు. కానీ, గుంటూరు జిల్లా, బెల్లంకొండ మండలంలోని కోళ్లూరులో కోహినూర్ వజ్రం దొరికింది. వజ్రాలను మెరుగు పెట్టడంలో దిట్ట అయిన ఒక ఫ్రెంచి వజ్రాలవ్యాపారి ఔరంగజేబు హయాంలో కోళ్లూరును దర్శించి, అక్కడి వజ్రపు గనుల్లో వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తన ప్రయాణ నివేదికలో పొందుపరిచాడు. పులిచింతల ప్రాజెక్టు నీటి ముంపు గ్రామమైన ఈ కోళ్లూరును, కోళ్లూరుపేట అని కూడా అంటారు.

**నేను,** 2015 అక్టోబరు నెలలో ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో 'చేజారిన తెలుగు వెలుగు - కోహినూర్ వజ్రం' అన్న వ్యాసం రాశాను. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న జర్మన్ జిడిఆర్ రేడియో వాళ్లు (ఒక జర్మన్ దేశస్తుడు, ఇంకొకరు తెలుగు కెమేరామెన్) ఇద్దరు నన్ను సంప్రదించి, కోళ్లూరు వెళ్లి అక్కడ నా ఇంటర్వ్యూ తీసుకుంటామన్నారు.

విజయవాడలో, ఉదయం 5 గం.లకు బయలుదేరాము. బెల్లంకొండ డిఎస్పీ గారి అనుమతితో ఆవూరుకు ఇన్నోవాలో వస్తుండగా నాగిరెడ్డిపల్లెలో 16వ శతాబ్ది శిథిల శివాలయం నా కంటపడింది. ఒక్క నిముషం ఆగి, పొలాల్లో దిక్కూమొక్కూ లేకుండా, గడ్డీగాదంతో కమ్ముకు పోయిన శిథిలాలు నన్ను వదిలిపెట్టడం లేదు. చుట్టూ చూచి, మళ్లీ రావాల్సిందేనని తీర్మానించు కొని కారెక్కాను. ఎందుకంటే చాలాదూరం పోవాలి. నాలుగైదు కిలోమీటర్లు పోగానే, మన్నేసుల్తాన్ (రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుని బిరుదు) పాలెం దోవలో ఒక పాడుబడిన భైరవాలయం, ఆంజనేయ



మండపం కనిపించాయి. జర్మన్ దేశస్తున్ని ప్రాధేయపడుతున్నట్లుగా చూశాను. పురాతన కట్టడాలపట్ల నా ఆసక్తిని గమనించిన తరువాత అతడు సరేనని తలూపాడు. కారు దిగి పొలాల్లోకి వెళ్లి ఆ గుడిని సమీపించాను. రాతి పలకల్ని గోడలుగా నిలబెట్టి, గర్భాలయంలో వీరభద్రుణ్ణి ప్రతిష్ఠించు కొన్నారు. విజయనగర కాలం నాటి నిలువెత్తు వీరభద్రుడు, కాళ్లు, చేతులు భిన్నమైనా చక్కని పనితనం ఆకట్టుకొంది. ఈ విగ్రహాన్ని గుంటూరు మ్యూజియానికి తరలిస్తే బాగుంటుందే మోననుకొని, నాకు నేను సమాధాన పరచుకొనేలోపు కంది చేలల్లోంచి కందిరీగల గుంపు నన్ను చుట్టుముట్టాయి. జేబు రుమాలు ముఖానికి అడ్డం పెట్టుకొని, పరిగెత్తుకొంటూ కారెక్కాను. ప్రయాణం చేస్తున్నా కూడా నాగిరెడ్డిపల్లి శిథిల శివాలయం, మన్నేసుల్తాన్ పాలెం వీరభద్రుని భిన్నమైన విగ్రహం 'ఆలనాపాలనాలేని మమ్మల్ని అలా వదిలివేయటమేనా?' అని ప్రశ్నిస్తూనే ఉన్నాయి.

నీటిముంపు ప్రాంతం కావటాన రోడ్డు గతుకులుబడి, కారు మెల్లమెల్లగా పోతుంది. తిన్నగా బోదనం వెళ్లాం. ఊరు ఖాళీ అయింది. మొండిఇళ్లు, పెరిగిన సర్కారు కంపల మధ్య ఒకరిద్దరు కని పించారు. ఒకటి రెండు ఇళ్లు(మిద్దెలు) అలానే ఉన్నాయి. వాళ్లు రైతులు. ఇంకా ఒకటో రెండూ పశువులతో పక్కనున్న బోరుతో, నీళ్లు తగ్గినాక పంటలు వేసు కుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. నేను కారుదిగి, వాళ్లనడిగాను ఇక్కడేమున్నా పాతగుళ్లు, శిల్పాలున్నాయా అని. కృష్ణానది ఒడ్డున గుడి ఉంది గానీ, విగ్రహాల్ని బెల్లంకొండ దగ్గర కట్టుకున్న కొత్త ఊళ్లో, కొత్తగుళ్లో పెట్టు కొన్నామన్నారు. కనీసం గుడి అన్నా చూద్దామని నేనొక్కడ్నే ముళ్ల కంచెల మధ్యలోనుంచి వెళ్లి గుడికి చేరు కొన్నాను. మామూలు పెద్ద సైజు నాప రాళ్లతో కట్టినగుడి. శిథిల నైరాశ్యం తప్ప ఏమీ కనిపించలేదు. ఆ గుడి దాటితే నది. రోజూ చేపలు పట్టేవాళ్లో ఏమో, చిన్నపాటి వెదురుబుట్ట వలలు నాలుగైదు పడి ఉన్నాయి. తిరిగొస్తుంటే, కోడిజాబు లాంటి పోలేరమ్మ గుడి, ప్రేమతో పెనవేసుకొన్న రావి, వేపచెట్లు, చుట్టూ రచ్చబండలాంటి అరుగు, దానిముందు నల్లరాతి ఉమ్మడి రోలు, పగిలిన పెద్ద పెద్ద నీటి బుంగలు, జనం లేకపోయినా వాళ్ల బతుకుతెరువును ఏకరువు పెడుతున్నాయి. ఊళ్లోంచి బయటికొస్తుంటే చక్కటి కొయ్యశిల్పానికి అద్దంపడుతున్న సింహద్వారం, ముందు వరండాలో అందంగా చెక్కిన కొయ్య స్థంభాలు, కొయ్యకప్పు నాటి గ్రామీణ వడ్రంగుల పనితనాన్ని ప్రదర్శిస్తు న్నాయి. చాలాదూరం పోవాలి. నేను మార్గదర్శిని గాబట్టి, ఏమీ అనటం లేదుగానీ, కార్లో ఉన్న జర్మన్ ముఖంలో కొంచెం అసహనం తొంగి చూచింది. కోళ్లూరు చేరిందాకా కారు దిగేది లేదను కొని, కూర్చొని, బెజవాడ గేట్‌వే హోటల్లో అంతకు ముందు రాత్రి బందోబస్తుగా పొట్లాంకట్టుకొని తెచ్చిన శాండ్‌విచ్‌లు తింటూ ప్రకృతి ఆహ్లాదాన్ని నంజుకొంటూ, చిట్యాల అనే గ్రామం బోర్డు చూశాను. చిట్యాల అంటే ఇక్కడ చిట్టెం + అల = ఇనుప చిట్టెలను తయారుచేసే ఊరు. అల అంటే గ్రామం అని అర్థం. అలగా జనం అనేమాట 'అల' నుంచి వచ్చిందే. మునగాల, కనగాల, పేరాల, చీరాల ఇవన్నీ అలా ఏర్పడినవే. చిట్యాల చిన్నఊరు. ఇదీ నీటిముంపు ఊరేగాబట్టి ఇళ్లన్నీ పాతబడినా, ఎత్తయిన కప్పులు, ముందుఅరుగులు, వరండాలో కొయ్య స్థంభాలు, ఇంటి పక్కన పశువులు, చెట్టు కింద చుట్టలుతాగే పెద్దమనుషులు, ఆడుకొంటున్న చిన్నపిల్లలూ ఇంకా 'పల్లెపట్టు'ను వదిలిపెట్టని దృశ్యమాలిక కళ్లముందు జారిపోతోంది.

కొంచెం ముందుకెళ్లగానే రోడ్డుకు దూరంగా కొండమీద గుడి, ఎక్కటానికి

మెట్లూ, ఘాట్ రోడ్డూ కనిపించాయి. రోడ్డు పక్కనే ఉన్న నాలుగు కాళ్ల (స్థంభాల) మండపంలో కూర్చొని చుట్టూ చూస్తే, ఎడమవైపు పొలాల్లో శిధిల దేవాలయం, కుడివైపున అనేక శిధిల ఆలయాలు, పడిపోయిన గోడలు, కప్పుల్లేని మండ పాలు, దూరంగా కోటగోడలు, పాడుబడిన ఇళ్లు, రమ్మని పిలుస్తున్నాయి. ఎడమవైపు పొలాల్లో ఉన్న శిధిలాలయం చుట్టూ తిరిగాను. శివాలయం, దాని చుట్టూ పడిపోయిన కప్పురాళ్లు, నాగ దేవతలు, వీరశిలలు, మహిషాసురమర్దని శిల్పం ఎడా పెడా పడిపోయి, పలు రకాల ప్రశ్నలు సంధిస్తున్నాయి. కంది కాయలు కోస్తున్న రైతు చెప్పాడు ఇది కేతవరం అని. అప్పుడు గుర్తొచ్చింది. శ్రీకృష్ణదేవరాయులు తన శాసనాల్లో తాను సాధించిన కోటల్లో ఉదయగిరి, అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, తంగెడ, కేతవరం, కొండపల్లి ప్రస్తావన కళ్లముందు కదలాడింది. దూరం నుంచి కనబడుతున్న కేతవరం గోడలమీద సాహితీ సమరాంగణ సార్వభౌముడు, తెలుగు రాయడు శ్రీకృష్ణదేవరాయలు, జయించిన ఉత్సాహంతో ఠీవిగా నిడబడ్డాడా అనిపించింది. కోటను, అక్కడి నరసింహస్వామి ఆలయాన్ని, శాసనాల్ని తడిమి తడిమి చూడాలనిపించినా, మా కోళ్లూరు ప్రయాణం కుంటుపడుతుందేమోనని మన స్సును బిగబట్టి, సమాధానపరచి, కోళ్లూరు సమీ పిస్తున్నాం. ఊరిబయట సున్నపుబట్టీ మాకు స్వాగతం చెప్పింది. ఇష్టం లేకుండానే ఇళ్లు ఖాళీ చేసిన కోళ్లూరు వాసుల గుండెలు మాత్రం ఆఊరు మొండిగోడల్లో ఇరుక్కు పోయాయా అన్నట్లున్నాయి. పశువులు, రోళ్లు, రోకళ్లు, మంచాలు, బట్టలు, పెట్టెలు, పిల్లాజెల్లా, నగానట్రాతో వద్దనుకుంటూనే తలుపులు, కిటికీలను ఊడబీక్కొని, ఉన్న ఊరును వదిలి వెళ్తుంటే కన్నతల్లికి దూర మౌతున్నట్లు గానే, పోతూపోతూ వెనక్కి వెనక్కి నడుచు కుంటూ వెళ్లిన ప్రజలు గుర్తుకొచ్చి కళ్లు చెమ్మగిల్లాయి. కారు ముందుకు కదులు తూనే ఉంది. గుడ్లగూబలు దూరిన ఇళ్లలా, ఆ ఊరంతా శ్మశాన ప్రశాంతత ఆవరించింది. ఇంతలో రోడ్డు ప్రక్కన పడిపోయిన శివాలయ మండపస్థంభాలు, కప్పురాళ్లు మళ్లీ నన్ను కారుదించాయి. జర్మన్ దేశస్తుడు, కెమెరామెన్ కూడా దిగారు. చిందర వందరగా చెల్లాచెదురుగా పడి ఉన్న మండపంరాళ్లు ఏవో చెప్పాలను కొంటున్నాయి. దృష్టంతా గుడి శిఖరం



మీదున్ననేను కాలుజారి ఒకగుంటలో పడ్డాను. ఒకరాతికి చేతిని మోపుజేసుకొని పైకి లేవటానికి ప్రయత్ని స్తున్నాను. పాచిపట్టిన ఆరాతిమీద పట్టుదొరక్క పోయినా, చేయిని ఆనించిలేద్దా మనుకొన్న నావేళ్లు ఏవో అక్షరాల్ని మీటుతున్నాయి. గుంటలో ఉన్ననేను వెనక్కి తిరిగి చూస్తే అదొక శాసనం. నా శ్వాసనాళాలు ఒక్కసారి ఉరకలేశాయి. పరిశీలించి చూస్తే క్రీ.శ. 12వ శతాబ్దినాటి కోటరాజు శాసనం. భూమికి ఆరడుగుల లోతులో నున్న ఆశాసనం, శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతుంది. నేను నిస్సహాయుకుణ్ణి. పైకొచ్చి ఆలయాన్ని చూచి, నిట్టూర్చి, ఎవర్నీ ఏమీ అనలేక, మళ్లీ ముందుకెళితే అక్కడా ఒక శిధిలాయం, పళ్ళూడిన ముసలవ్వలా రాలిపోయిన రాళ్లతో బోసిపోయింది. మళ్లీ బాధేసింది. బాధకు, బాధేమిటో తెలిసింది. కారెక్కి వందగజాలుపోయాం. అక్కడొక చెట్టు, చెట్టుకాండానికి పసుపు కుంకుమలతో తీర్చిదిద్దిన అమ్మవారి బొమ్మ. చెట్టుకింద రచ్చబండ. అక్కడ హిందీ మాట్లాడుతూ వంట చేసుకొంటున్న నలుగురైదుగురు



యువకులు. కారుదిగం గానే ఒక చిన్న గుడిసె. అందులో ఇద్దరు నడివయసు దంపతులు. చిన్న టీ కొట్టు నడుపుతున్నారు. పక్కనే ప్రసన్నాంజనేయని గుడి. దూరంగా, నిజాం కాలంనాటి వాచ్‌టవర్.

ఇక ఊరుకోలేక, ఆ టీకొట్టు అతన్ని, ఇక్కడ వజ్రాలు దొరుకుతాయట గదా, రోజూ దొరుకుతాయా, ఎక్కణ్ణుంచి ఎవరొస్తుంటారు. కోహినూర్ వజ్రం దొరి కిందెక్కడ అని అనేక ప్రశ్నలేశాను. అతను సమాధానం చెప్పటం లేదు. మళ్ళీ అడి గాను. అవుడతడు, స్వామీ మీరేమీ పోలీసులు కాదుగదా అని బిత్తర చూపులో అడిగాడు. పశువులను తోలుకెళ్లే మరి కొందరు జమ కూడారు. నేను, నా సంచిలోంచి, గతంలో ఒక శిధిలాలయం ముందు నిలబడి ఉన్న నాఫొటోగల డెక్కన్‌క్రానికల్ పేపరు చూపించి, నా వివరాలు చెప్పాను. మరి ఆ తెల్లాయన ఎవరు? కెమెరా ఎందుకు? అని అడిగారు. కోహినూర్ వజ్రం దొరికిన కోళ్లూరు గురించి వాళ్లు నన్నూ, ఇక్కడ వజ్రాలు ఏరుకొనే వాళ్లని ఇంటర్వ్యూ చేస్తారని చెప్పాను. అయినా సరే, మాకెందుకు స్వామీ, పోలీసులతో గొడవ, మాకేం తెలవదన్నాడు. పశువుల కాపర్లు మాత్రం నమ్మకం కుదిరి, మాతో మాట్లాడారు. ఇంతలో కెమెరా రెడీ అయింది. జర్మనీ దేశస్తుడు, కోహినూర్ వజ్రం గురించి నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నాడు. వాళ్లు వింతగా చూస్తున్నారు. నేను చెప్పటం మొదలు పెట్టాను. ''కాకతీయుల కాలంలో, కోళ్లూరులో దొరికిన కోహినూర్ (అప్పటికింకా ఆపేరు లేదు) చేతులుమారి, మాళ్వా ప్రభువులకు చేరి, తరువాత క్రీ.శ. 1304లో ఆ వజ్రాన్ని అల్లాఉద్దీన్ ఖిల్జీ, ఆ తరువాత ఆగ్రాకు చేరిన ఆ వజ్రాన్ని మొగల్ పాలకుడు బాబరు చేజిక్కించుకోవటం, తరువాత షేర్షాసూరి చేతికి చేరి, ఆతరు వాత, అహమ్మద్ నగర్ పాలకుడు ఆ వజ్రాన్ని నిజాంషాకు బహూకరించాడు. అది, గోల్కొండ కొలువులో ఉన్న మీర్ జుమ్లా చేతికి రావటంతో, అతడు దాన్ని షాజహాన్‌కు బహూకరించాడు, అది,1739 లో పర్షియారాజు నాదిర్షాకు దక్కగా ఆయన దానికి కోహినూర్ అని పేరు పెట్టాడు.

1812లో రంజిత్ సింగ్‌కు ఆయన దగ్గర్నుంచి, ఈస్టిండియా కంపెనీకి చేతులు మారింది. ఆ కంపెనీ గవర్నర్ జనరల్ 1850 జూలై 3 వ తేదీన ఆ వజ్రాన్ని విక్టోరియా మహారాణికి బహూకరించగా, 1851 లో క్రిస్టల్‌పాలెస్‌లో భద్ర పరచబడింది. 1937లో దాన్ని కిరీటంలో పొదిగి బ్రిటీష్ రాణికి అలంకరించారు. ఆక్రమంలో ఇప్పటి బ్రిటీష్ రాణి ఎలిజబెత్ ఆ కిరీటాన్ని ధరిస్తూనే ఉన్నారు. కోళ్లూరులో దొరికిన కోహినూర్ వజ్రం, బ్రిటీష్ రాణి తలపై తెలుగు వెలుగుల్ని విరజిమ్ముతూనే ఉంది. ఈ వజ్రం వెనుక ఇంత కథ ఉంది” అని ముగించాను.

వీడియో షూటింగ్ అయిపోయింది. అక్కడున్నవాళ్లను అడిగాను, ఇంతకీ ఆ వజ్రం ఎక్కడ దొరికింది అని. ‘కరణం గారి చేలో’ అని ఒకతను చెప్పి, ఎటెళ్లాలో చూపించాడు. దాదాపు ఒక కిలోమీటరు వెళ్లేసరికి సర్కార్ ముళ్లకంపచెట్లు, నిమ్మ చెట్టులా బాగా పెరిగిన చోట ఆగి. మేము కారుదిగాం. మమ్మల్ని గమనించి ఒకరిద్దరు తట్ట, చిన్న డోకుడుపారలతో పరుగు లంఘించుకొన్నారు. మరికొంత మంది దూరంగా నిలబడి మమ్మల్ని చూస్తున్నారు. మేము చెట్లల్లోంచి ముందు కెళ్లాం. బాగాలోతుగా తవ్విన కాలువ, బాగా ఎత్తుగా పోసిన గులకరాళ్ల గుట్ట కని పించాయి. ఆ కాలువ ఒడ్డున అటూ ఇటూ ఇద్దరిద్దరు చొప్పున దాదాపు 200 మంది వజ్రాలవేటలో ఉన్నారు. ఒక జంట దగ్గర కెళ్లాను. ఎక్కడినుంచొచ్చారని అడిగాను. చిలకలూరిపేట నుంచి వచ్చామన్నారు. మీరు పోలీసులా అని అడిగారు. కాదు మేం ఫలానా అని చెప్పాం. న్యూస్‌పేపర్ లో నాఫోటో చూపించాను. నమ్మకం కుదిరింది. వాళ్లంతా, రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన వజ్రాల వ్యాపారులు కుదుర్చుకొన్న వాళ్లు. ఒక్కోసారి అరవైవేలు, ఒక్కోసారి అరవై రూపాయలు ఖరీదుచేసే వజ్రాలు, రాళ్లు దొరుకుతాయనీ, వచ్చిన వారికందరికీ కూలీలిస్తారనీ, వజ్రాలు దొరికితే అదనపు ఆదాయమనీ చెప్పారు. ఇంతలో ఒక కుర్రాడొచ్చి, సార్ ఇక్కడొక శిల్పముంది చూస్తారా అన్నాడు. వాళ్లకు వజ్రం దొరికినంత ఆనందం కలిగిందినాకు. చూస్తే అది క్రీ.శ. 16-17 శతాబ్దాలకు చెందినది. ఆనాటి స్థానిక పాలకుని దంపతుల శిల్పం. భూమిలో కూరుకుపోతే, అందరం పట్టి పైకి లేపాము.

పులిచింతల ప్రాజెక్టు ఎక్కడా అని అడిగితే తూర్పుగా పది కిలోమీటర్లు పోవాలి. దోవలేదు. క్రోసూరు నుంచి వెళ్లాలని చెప్పారు. చినుకులు పడేట్లుగా



ఉంది. మబ్బులెంక చూచిన కెమెరామెన్ తొందరిస్తే మళ్లీ రెండు బైట్‌లిచ్చి జర్మన్ రేడియోకు నా ఇంటర్వ్యూ పూర్తి చేశాను. కారెక్కి వెనక్కి మళ్లీ వస్తూ ఉంటే, పాడుబడిన ఇళ్లు, శిధిలమైనగుళ్లు బాధ పడుతున్నట్లుగా అనిపించింది. ముందుకు సాగాం. కేతవరం కోట చూడాలన్న తపన, అక్కడి గుళ్లు, శాసనాలు, శిల్పాలు, శిధిలాలు చూడకుండా ఎలా అను కొంటుంటే, తెలంగాణా జాగృతి (చరిత్ర పరిశోధకులు) శ్రీ రామోజు హర గోపాల్ అంతకుముందే వాట్సాప్ ద్వారా పంపిన, కృష్ణా తీరంలోని రాతికి చెక్కిన శాసనాలు, నరసింహస్వామి శిల్పం, పైన మెట్లదగ్గరి గణేశ విగ్రహం నన్ను కదలకుండా చేశాయి. సమయం సాయంత్రం నాలుగు దాటింది. బెల్లంకొండ పోలీసులు, పొద్దుగూకక ముందే తిరిగి రావాలని చెప్పారు. దూరం నుంచే కేతవరం కోటను, కొండపై నరసింహస్వామి ఆలయాన్ని చూస్తూ అల్పాహారం తీసుకొని, శ్రీకృష్ణదేవరాయలు వశపరచు కొన్న కేతవరం కోటను చూడ కుండానే



గంపెడు బాధతో బయలుదేరి రాత్రి ఎనిమిది గంటలకు విజయవాడ చేరుకొన్నాం. ఆ రాత్రంతా శిధిలాలయాలు, శిల్పాలే కళ్లముందు కదలాడుతూ నిద్రలేకుండా చేశాయి.

(తరువాయి వచ్చే సంచికలో...)



“మరణించిన వాళ్లందరినీ మనం ‘కీర్తిశేషుల’నే పేర్కొంటాంగానీ, నిజంగా చాలా కొద్దిమందే చనిపోయాక కీర్తిని వదిలిపెట్టి పోతారు. కొందరి విషయాల్లో ఆ కీర్తి కొన్నాళ్ల పాటే ఉంటుంది. శాశ్వ తంగా కీర్తి శేషించినవారు చరితార్థులు. తాపీ ధర్మారావు అనేక విధాల చరి తార్థులు... (తాతాజీని) పుస్తకం లాగా చదువుకొన్నాను. చలోక్తులకు ఆయన నిధి. ఎదుటివారి మీద తాను జోకు వేసినా, తనమీద ఎదుటివారు జోకు వేసినా నిండుగా నవ్వుకోగలరు. మన తెలుగు సినిమాలలో వ్యావహారిక భాష ఆయన పెట్టిన భిక్ష. నిత్య జీవితంలో షష్టిపూర్తి చేసికొనడం ఘనకార్యంగా భావిస్తే సాహిత్య జీవితంలో షష్టిపూర్తి చేసుకున్న మహనీయుడాయన”.

**- ఆరుద్ర (వనిత మాసపత్రిక)**

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# 'నీకోసం, నీ మంచికోసం-సదా నీ అభిమానిగా ఉండిపోతాను'

## ("దేలెం ఒసం సకుని అసంగ్- దోహ్వనం సాయ తాయ" సవర పాట.)

ఏడువారాల నగలు × అడవిపూల చెండ్లు / సంతోష చంద్రశాలలు × వెన్నెల బయళ్ళు.
సవర బిస్మిల్లాఖాన్ 'సన్నాయి' / 'గన్నికలు వలిచే', 'ఇడిసింగ్'లు వేసే పికాసోలు .
భూమి, అడవి, విద్యుత్తో/ విల్లమ్ములు సంధిస్తూ ఉద్యమిస్తున్న గిరిజనులు..

(గత సంచిక తరువాయి...)

### చట్టాల మడిబట్టలు- రిజర్వేషన్లకు తగ్గచదువులు

గిరిజన ప్రాంతాలకు రక్షణలు ఇస్తూ, తెల్లవాళ్ళు 'చట్టాల మడిబట్ట' కట్టటం మొదలు పెట్టారు.. ఒకప్పుడు గణరాజ్యాలుగా ఉన్న ఈ ప్రాంతాలను scheduled area లు అన్నారు. వలసలు పెరిగి పర్యావరణం దెబ్బతినకుండా మనం 1/70 వంటి కఠినమైన నిబంధనలు, అటవీ సంరక్షణ చట్టాలు, ఇప్పుడు అడవిలో గిరిజనులపాత్ర బలపరున్నా, వారి ఉమ్మడివనరు అయిన అడవికి, అక్కడి దేవతలకు, వ్యక్తిగత వాడుకలకు, సంప్రదాయ జ్ఞానానికి గుర్తింపునిస్తూ చట్టాలు తెచ్చారు. అయితే వలసలు ఆగలేదు. సాగుకనువైన భూములన్నీ దిగువవారి పరమైనాయి. అంతేకాదు వాళ్ళకు అడవిలో హక్కులు గుర్తించటానికి కూడా, మనం సిద్ధంగా లేము. అడవి హక్కుల పట్టాదారు పాస్ పుస్తకంమీద 'చేవడి బస'(కల్లుబస) 'మగనాలి మెట్ట' వగైరా పదాలు అచ్చువేసినా, వాటి మీద హక్కుల సంగతి ఏమిటి అనే ఆసక్తి కూడా వారిలో కలగటం లేదు. ఏదో పోడు భూములకు పట్టాలి వ్వండి. ఉద్యోగాలు పడేయండి అని పాకులాడుతున్నారు. తమరాజ్యంలో, దిగువన యస్.సి,బి.సి.ల లాగా రిజర్వేషన్ల కోసం దేబిరిస్తున్నారు. దిగువనకూడా బీల, తంపరల కోసం చేసిన పోరాటం, అటువంటి వనరులను గుర్తించి కాపాడుకునే కార్యక్రమంగా విస్తరించలేదు. చదువుకుని కూడా, చట్టాలను ఉపయోగించుకుని, అమలులో పాల్గొని, జరుగుతున్న మోసాలు తగ్గించి, న్యాయం సాధించేది తెలుసుకోక, జల్, జంగల్, జమీన్‌లను పూజించి, కాపాడుకునే ధైర్యాన్ని, ధర్మాన్ని గిరిజనులు పోగొట్టుకుంటున్నారు. వేదికల మీద మాత్రం 'మా ఊళ్ళో మారాజ్యం' అనిచిందులు తొక్కుతుంటారు.

'గిరిజనులలో ఎవరికీ ప్రభుత్వ శాసనం ప్రకారం, ఏ పొలం ఎవరికి చెందినదో




తెలియదు. వీళ్ళు ఆ పొలాలలో వ్యవసాయం చేస్తా, బాగా పండనప్పుడు, దాన్ని తాకట్టుపెట్టి అప్పులు చేస్తా వచ్చారు' 'అయితే భూ యాజమాన్యాన్ని తప్పకుండా రిజిస్టర్ చేయాలన్న పద్ధతిలో పరిపాలన, బ్యురోక్రాటిక్ భావనలు వచ్చాక భూమి ఒక అమ్మకపు సరుకుగా మారింది. పట్టా, దస్తావేజులు జారీ చేయటం ద్వారా ప్రభుత్వం ఈ హక్కులను చెలాయిస్తుంది' అని పేర్కొంటూ ., ఈ జ్ఞానం తెలియచెప్పని (ప్రభుత్వం చెప్పించే) 'చదువు గురించి నొక్కి చెప్పటం, భూసంస్కరణలు, సాగునీటి ప్రాజెక్ట్‌లు ఇంకా వనరుల పరమైన లాభాలనుండి దృష్టిని మళ్ళించటం'గా (97) మైకేల్ యార్క్, 'వెలిత పాట'లో ఈ చదువులలో మోసాన్ని బయట పెడతాడు.

1950 లలో నిజాం ప్రభుత్వ సలహా దారుగా హైమెండార్ఫ్ పెట్టించిన ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలలో తయారై, ఆ ఉద్యోగులు, అధికారుల పరిచయాలతో ఆస్తులుగడించే వారి స్వార్థాన్ని ఉదహరిస్తూనే, తెల్లవాళ్ళు పోయి నల్లవాళ్ళు వచ్చినట్లు 'గిరిజనేతర ఉద్యోగుల పెత్తనాన్ని అంతంచేసి, 'అభ్యుదయ వాదులైన' గోండులను గ్రామాధికారులుగా ప్రవేశపెట్టటంకూడా అంతే ముఖ్యమైన లక్ష్యం' (101) అంటూ మళ్ళీ గిరిజనులలో ఉద్యోగులు మాత్రమే బాగుపడే ఏర్పాట్లకు సలహా ఇస్తాడు. జ్ఞానంతో, మెలకువతో, అధికారులతో వ్యవహారం నెట్టుకొచ్చే తెలివిడి నేర్చుకునే బదులు, ఉద్యోగులను అవతార పురుషులుగా 'రోల్ మోడల్' గా కీర్తించటం, మీ 'హయాం'లో అంటూ ఉబ్బించి, రచనలను పొగిడి పనులు చేయించుకోటం అలవాటు చేసుకున్నారు. ఈ పోకడలు, నిజజీవితంలో చేయి జాపుతూ, పేరుకోసం నానాగడ్డి కరుస్తూ, కవిత్వంలో గర్జించే కాగితం పులులను తయారు చేస్తున్నాయి. ఈ పరిణామాలను గిరిజనులను బానిసలుగా మారుస్తున్న తీరును 'తనకు తాను పరాయిగా మారే ఆదివాసీ జీవితం' పలుమార్పులకు లోనైంది. ఆదివాసీలు ఇప్పుడు వాటిముందు దరఖాస్తుదారులుగా క్యూలో నిలబడి ఉన్న సందర్భమొకటి కొత్తగా ఆవిష్కృత మయ్యింది. ఆదివాసీ చట్టాలు, వాటి అమలులో వస్తున్న ఇబ్బందులు ఆదివాసీ సమాజం ముందు కొత్త దృశ్యాలను ఆవిష్కరిస్తున్నాయి'.(బహుళ. పర్స్పెక్టివ్స్ ప్రచురణ 2017) అని వర్ధమాన గిరిజన రచయిత మల్లిపురం జగదీశ్ కళ్ళకు కడతాడు.

### ఉద్యమ,ప్రచార,సంప్రదాయ సాహిత్యాలు

ఇటువంటి పరిస్థితులలో సాహిత్యం, సంఘాలు తప్పుకు తిరగటాన్ని కొడవటిగంటి




గమనించి హెచ్చరించారు.'అభ్యుదయ వాదం అవలంబించిన వారిలో కూడా అనేకులు, మార్పులు తెచ్చే బాధ్యత ఇంచుమించుగా అతిథులకు-అభ్యుదయ దృక్పథంగల రాజకీయపక్షాలకు వదిలేసి, జనాన్నివర్గరహిత సమాజంకేసి సుముఖులను చేయటానికి, సమాజాన్ని విమర్శించటానికి ఎక్కువగా పాటు పడ్డారు' (ప్రజాసాహితి.కొ.కు.ప్రత్యేక సంచిక 88) 'విప్లవాల సంగతి అటుంచి చిన్న సంస్కరణలను కూడా సాహిత్యం చెయ్యలేదు. జీవితం దిగబెరుకుతున్నప్పుడు,సాహిత్యం ఎగబెరకదు' అంటూ విచార పడతాడు.

'అడవిలో వెన్నెల' ఆదిలాబాద్ గిరిజన పోరాటకథలు'(1985) రాసిన ఉద్యమ నాయకులు కరణం, ఫారెస్ట్ గార్డు, కాంట్రాక్టర్లు ఎలా మోసగిస్తున్నది పూస గుచ్చినట్లు ఆ డిపార్ట్మెంట్ పరిభాషలో వివరిస్తారు. సంగం పెడదాం తుపాకీ పడదాం, బుద్ధి చెపుదాం అని ముగిస్తారు.

ఉద్యమాలకు దారితీసిన 'శ్రీకాకుళం కథలు', 'అడవిలో వెన్నెల' కథలలాకాక భీభత్సంగా ముగుస్తాయి. ఇటువంటి సాహిత్యానికి ఒరవడి దిద్దిన 'యజ్ఞం' కథలో, ఊరికి రోడ్డు, కరెంటు, స్కూలు తెచ్చిన పంచాయతి ప్రెసిడెంట్ శ్రీరాములు నాయుడు, బడిలో హరిజనుడు అప్పల నాయుడు పిల్లలను ఎందుకు చేర్చలేదు. ఆ బడిలో రుణ విముక్తి చట్టాలు, భూమి లెక్కలు ఎందుకు చెప్పలేదు అని కరణం బిడ్డ, లెక్కల మాస్టారు అయిన రచయిత, లేదా విమర్శకులు గాని ప్రశ్నిస్తే బాగుండేది. రైతు కూలి పోరాటాలతోనే విప్లవం వస్తుందని నమ్మిన/చెప్పిన వాళ్ళు, ఉద్యోగసంఘాల నాయకులైె, తమవర్గం ఇంక్రిమెంట్లు, జీతాల పెంపు, బదిలీలు, ప్రమోషన్లకోసం, పిల్లల చదువుల కోసం పాటు పడ్డారు. జనానికి కావలసిన భూమి,అడవి, కూలి లెక్కలు పట్టించుకోకుండా, సాహిత్యం మాత్రం అంటగడుతున్నారు. ఉద్యమాలవల్ల ధైర్యం వచ్చింది. ఉద్యమసాహిత్యం వల్ల చైతన్యం పెరిగింది అనివారంటారు కాని గిరిజనులు ఎన్నో తరాలుగా ఉద్యమాలు చేస్తున్నారు. 'పంచపాండవుల పంట-దుర్యోధనుడి వంట': 'తూరుపుకుంచముతో తూరగొలిచిన బేరగాడు-పడమరకుంచముతో పారగొలిచిన బేరగాడు" : 'కోడోడి పంట-కోమటి సంచి 'అని కథలు, గాథలు చెప్పుకునే వారికి, రకరకాలుగా తమను దోచుకోవటం తెలును. ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని దోచుకునే పద్ధతులను తెలుసుకుని, అక్కడే, అప్పుడే అడ్డుకునే జ్ఞానం వారికీ కావాలి. జ్ఞానం లేని చైతన్యం గుడ్డిది, చైతన్యం లేని జ్ఞానం కుంటిది.

'ఉద్యమసాహిత్యం' ఆవేశ పరులను ఎగదొయ్యటంతో పాటు, గిరిజనుల ప్రతిభను ఎలాకుంగదీసిందో తెలుసుకుంటే దాని ప్రభావంనుండి సమష్టి సృజనాత్మకతను కాపాడుకోవచ్చు.. 'శ్రీకాకుళ ఉద్యమ




సాహిత్యం'పై పరిశోధనలో 'ఈ ఉద్యమ కార్యకర్తలు గిరిజనుల సాంస్కృతిక జీవితం గూర్చి తెలుసుకోక పోవటంతో, వారిని కదిలించగల మౌఖిక సాహితీ ప్రక్రియలు తెలియకుండా పోయింది. గిరిజనులు ఆశువుగా పాడుకునే పాటల స్థానంలో కవుల లిఖిత శైలి, వారికీ పరిచయం లేని బాణీలు, వారిది కాని భాష ఉద్యమవస్తువుతో పాటలు రాయటానికి గిరిజన రైతాంగాన్ని పురికొల్పలేదు... కార్యకర్తల ప్రచారలక్ష్యం నెరవేరినా. ప్రజలు తమ అనుభవాలను కవితా బద్ధం చేయటానికి, వారు కార్యకర్తలు వినిపించిన పాటలను ఆదర్శంగా భావించటంతో, ఆ స్థాయిలో రాసినవే పాటలనీ, తాము ఆ స్థాయిలో రాయలేమని భావించటంతో కూడా, వారు తమ అనుభవాలకు పాట రూపాన్నివ్వలేక పోయారు. ఈ పాటలు వారి స్వేచ్ఛా వ్యక్తీకరణకు ఆటంకాలయినాయి. ఇలా లిఖిత శైలి రచనలు ఆదర్శం కావటం,..ఈ దశలో విస్తృతంగా పాటలు రాకపోవటానికి కారణం (కే.ముత్యం.1992 ఇటువంటి ధోరణినే 'పాలకవర్గాలు ఈ నాటికీ తెలుగు సాహిత్యాన్ని జానపద సాహిత్యం అనే ముద్దుపేరో వెురటు పేరో పెట్టి విస్మరిస్తున్నారు'' (సాహిత్యంలో వస్తు శిల్పాలు. 109) అని దుయ్యబడతారు. అంతేకాదు 'కవి, కవిత్వం, శ్రోతలు సమాజం అనే నాలుగు ముఖ్యంశాల్లో, శ్రోతలు, సమాజంపోయి కవి, కవిత్వం మిగిలాయి' అంటూ రచనలు క్షీణదశకు చేరుకుంటున్న పరిణామాన్ని హెచ్చరిస్తాడు. ఎవరి మీద ఈ రచనలు కవితలు చేస్తున్నారో, వాళ్ళు ఈ రచనలు చదవలేరు. తమ ఆశయాలు రచనలు ప్రజా సామాన్యంలోకి పోవాలంటే రచయితలు జానపద కళాకారులతో కలిసి పనిచేయాలి. ఒకప్పుడు ఈ కళాకారులే, శిష్టుల రచనలను ప్రజలలోకి, ప్రజల పలుకుబడులను శిష్టులకు చేరవేసే వారు. అయితే ఒకవక్క 'మానవ దు:ఖానికి మూలమైన ఆస్తిహక్కును రద్దుచేసే క్రమంలో ... సామ్రాజ్యవాద ద్వేషాన్ని రగిల్చి, ప్రేమ, స్నేహ భావాలు చిగుర్చే' కథలెన్నో రాయాలనుకుని ఆశించేవారు (ప్రత్యామ్నాయం' కథలులో ముందుమాట 1998) ఆస్తులు, ఉద్యోగాలు వదులుకోలేకపోవచ్చు. పాలకవర్గం కొత్త కొత్త పరిభాషను చలామణిలోకి తెచ్చి మోసగించే తీరును విప్పి చెప్పాలి. రచనలను ప్రజాపరం చేయటంలోనన్నా సంప్రదాయం మీద పట్టున్న కళాకారులతో కలిసి పోవాలి.

ప్రజలనోళ్ళలో నలిగిన కథలకు పాటలకు ఎన్నో వన్నెలు చిన్నెలు వస్తాయి. అచ్చులో వలె బిగుసుకు పోవు. సెలయేరులా ప్రవహిస్తుంటాయి.

### అరిగిపోయిన వస్తువు
### కొత్త వ్యూహాలతో ఉద్యమాలు

'ప్రత్యామ్నాయం'లో మెప్పు పొందిన 'యానగాలి' కథలో జీడి కార్మికులు, తమ గ్రామానికి ఏవో పథకాలు మంజూరు చేయటానికి కలెక్టరు వస్తున్నాడని తెలిసి, సహాయ నిరాకరణ చేద్దామనుకుంటారు. యం.డి.వో కలిగించుకుని అరెస్టైన వాళ్ళ నాయకులను విడిపించి కలెక్టరుతో చర్చలకు ఒప్పిస్తుంది. యమ్డివో ప్రభావం పెరుగుతున్నందుకు మండిపడే నాయకులు ఆమెను బదిలీ చేయిస్తారు. నక్సలైట్లు సినిమా హాలు పేలుస్తారు. కానీ ఈ కథ వచ్చిన రెండేళ్ళ కంటే ముందు, శ్రీకాకుళం జిల్లాలో ఆర్డివోగా, పీవో గా పనిచేసిన, శ్రీ డి.రామ కృష్ణ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ గా వచ్చారు. అక్కడ గిరిజనుల భూపోరాటం రాజుకుంటుంది. కలెక్టరు పోలవరం మండలంలో మనగోపల గ్రామానికి వెళ్లారు. ఆయన స్కీములు గూర్చి చెప్పింది విని, మా భూముల సంగతి ఏమిటి అని గిరిజనులు అడిగారు. ఏంచేద్దాం? అని ఆయన ఎదురు ప్రశ్న వేసాడు. భూమి హక్కుల మీద మాకు అనుమానాలున్నాయి. రికార్డ్సు కాపీ చేసుకుంటాం, యమ్మార్వోకు చెప్పండి. రాసుకోండి అని ఆదేశించాడు. ఊళ్లో 400 ఎకరాల్లో 50 ఎకరాలకే రైతులకు పట్టాలున్నాయని తెలుసుకున్నారు. మిగతా పొలాలు తమకు పంచమంటూ స్కీములు వద్దు-భూములు కావాలి అంటూ ఉద్యమం ప్రారంభించారు. మరో కథ 'కౌలతలు'లో దాల ప్పుడికి పట్టా ఇచ్చారు. చేసుకుంటు న్నాడు. ఆ భూమి మీద కన్నేసినవాడు, హైకోర్టు పోయి స్టే తెచ్చాడు అంటాడు రచయిత. మరేం చేస్తాం అంటాడు కలెక్టరు. స్టే అంటే యధా తధ పరిస్థితి. పొలంలో దున్నే వాడే ఉన్నాడు కాబట్టి ఇటువంటి స్టే నిరుపయోగం అని పశ్చిమగోదావరి జిల్లెళ్లగూడెంలో అప్పగించిన భూమి వదిలేది లేదు అని కలెక్టరుకు తెగేసి చెప్పారు. అలాగే భూపోరాటంలో పాల్గొంటున్న తమవాళ్ళను పోలీసులు తీసుకుపోతే గిరిజనులు పశ్చిమ గోదావరి, ఖమ్మంలలో అధికారులను నిర్బంధించి; DGP గా ఉన్న శ్రీకాకుళం బిడ్డ హె.జె. దొర సాక్షిగా విడిపించుకుంటూ 'ప్రత్యామ్నాయ' వ్యూహాలు పన్నుతుంటే; మండలాధ్యక్షుడిని కిడ్నాప్ చేసి నక్సలైట్లను విడిచి పెట్టమనే పాత ఎత్తుగడలనే జీవన స్రవంతి 'కథ'లో అరగరాస్తాడు. మల్లిపురం జగదీశ్ 'సింజిడి' కథలో (వేగావతి కథలు) గిరిజనుల భూములు కొనరాదు. కాని 99 ఏళ్ళు కౌలు రాయించుకుంటున్నారు అంటాడు. కౌలు కూడా చట్టవిరుద్ధమే.' గోరపిట్ట కథలో గిరిజనులకు వివాహ చట్టం వర్తించదు. కాబట్టి కోర్టు విడాకులు ఇవ్వలేవు. అంటాడు. మరో పాత్ర కోర్టుఎందుకు? కులం పద్ధతి ప్రకారం పోదాం అని మంచి సలహా ఇస్తుంది. అయితే గిరిజనులు కూడా మొండితనానికి, మోసానికి అలవాటు పడ్డారు. ఒక గిరిజనమహిళ మగనాలి పోతుంది. ఈ రెండో మొగుడు పిల్లలను కన్నాడు. కాని చూడడు. పెద్దలు చెప్పినా వినడు. ఆమె భరణంకోసం కోర్టుకెక్కింది. ఆమెకు ముందు మొగుడితో వివాహం, విడిపోవటం చట్టబద్ధంగా జరగలేదని, మొగుడు ప్లీడర్ ను పెట్టుకుని వాదిస్తాడు. గిరిజన సంప్రదాయాలను పేర్కొంటూ భరణం ఇవ్వవలసిందే నని రంపచోడవరం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ తీర్పు చెపుతాడు. కాబట్టి చట్టం, వ్యవహారం తో ముడిపడిన వస్తువు తీసుకున్నప్పుడు అందుకు సంబంధించిన జ్ఞానం ఉండాలి.




ఆదిలాబాద్ అడవులనుండి రాస్తున్న గిరిజనాభివృద్ధి సంస్థ ఉపాధ్యాయుడు వసంతరావు దేశపాండే, కలెక్టరు భూములు సర్వే చేయిస్తున్నాడని, ఉమ్మడి అటవీ యాజమాన్యం పథకంకింద అడవిని గిరిజనులు పెంచుతున్నారని, నగరంనుండి వచ్చిన వైద్యవిద్యార్థులు గిరిజనులకు పిటిషన్లు రాసి సాయపడుతున్నారని 'విపుల' 'చతుర' లలో 'ఊరు', 'ఫాస్ట్ ఫార్వర్డ్' నవలలు రాసాడు. అంతకు ముందు 'అడవిలో వెన్నెల'లో కథలనే 'అడవి' నవలగా రాసి ఆయన వెలుగులోకి వచ్చాడు. ఈయన తరువాతి నవలలు, ITDA ల ప్రచారానికి బాగా పనికొస్తాయి. 'అడవి'లో సమస్యలు పటాపంచలైనాయి అనే భ్రమను కలిగిస్తాడు. ఈ నవలల సంకలనానికి 'కొమరం భీం ఫేం' అల్లం రాజయ్య ముందు మాట రాసారు. ఇవి ఇతర భాషలలోకి అనువాద మయ్యాయిటగాని, ఆ కలెక్టర్, భూముల పంపకం విధి విధానాల మీద, ఆంగ్లంలో రాసుకున్న రిపోర్టును తనుగాని, 'ఉద్యమాలనుండి నుండి ఉద్యమాల దాక' అని థీసిస్ రాసిన గిరిజన సంక్షేమశాఖ అధికారికిగాని, తెలుగు చేసి జనానికివ్వాలని పించలేదు.('నడుస్తున్న చరిత్ర' ఆ అనువాదం 'దున్నేవాడికి భూమి, భూమిలోకి దున్నేవాడు' 2007 లో ప్రచురించింది).

(తరువాయి వచ్చే సంచికలో...)



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద 4

(ఆగస్టు నెల సంచిక తరువాయి)

**తరతరాల** మన సాహిత్య సంపద తొలినాళ్లలో మౌఖికంగా ఉండేది. అది అస్యూతంగా, అనూబానంగా, ఆనువంశికంగా వచ్చేది. అదీ కేవలం కొన్ని వర్గాలకే పరిమితమయింది. అనంతరం లిఖిత దశలో తాళపత్ర, బూర్జుపత్రాల మీద కొంతవరకూ నిక్షిప్తమయింది. అదీ తర్వాత కాలంలో శిధిలావస్థ దశలో అభిరుచిమేర మూల ప్రతులకు పత్రికలు వచ్చాయి. ఈ మధ్య కాలంలో వాటికి ప్రక్షిప్తాలు కూడా తోడయ్యాయన్నది జగమెరిగిన వాస్తవం. అదీ నానాటికి క్షీణించిపోతున్న దశలో పాశ్చాత్యుల రాక సాహిత్య పరంగా, భాషాపంరగా, కొంత జీవం వచ్చిందనే చెప్పాలి. తరాలు గడిచిన మన సాహిత్యం మరుగునపడే స్థితిలో వాటి పునరుద్ధరణ ఒక వైపు, భాషావ్యాకరణ, కోశ నిఘంటువుల నిర్మాణం మరోవైపు జరిగింది. ఇది క్రమపరిణామ వికాసమనే చెప్పాలి. ప్రారంభంలో అచ్చు వేయడానికి పడిన అవస్థలు అంతా ఇంతా కాదు. అన్నీ అధిగమించి మన సాహితి సంపద వెలుగు చూడటానికి శతాబ్దాల కాలం పట్టింది. తొలి నాళ్ళలో మిషనరీలుగా వచ్చిన వాళ్ళు బైబిలు సంబంధ అనువాదాలు పాశ్చాత్యులకోసం రచించిన వ్యాకరణాలు మొదలయినవి కన్పిస్తాయి.

భారతదేశానికి క్రీ.శ 53వ సంవత్సరం క్రీస్తు శిష్యుడయిన తోమా వచ్చాడు. అనంతరం రోమన్ కేతలిక్ సంస్థకు చెందిన వివిధ మిషనరీలు, మత బోధకులు, వచ్చినా నామమాత్రంగానే వారి ప్రచారం సాగింది. అందువల్ల లూథరన్ ప్రాటస్టెంట్ మిషనరీల రాకతో 18వ శతాబ్ది అన్ని రంగాల్లో సాహిత్య పరంగా వికసించింది. వారి నిస్వార్ధ భాషా సాహిత్య సేవ అనంతర కాలంలో ప్రగతిపథంలో పయనించింది. ఇది భాషా సాంస్కృతిక వికాసమనే చెప్పాలి. ముఖ్యంగా అచ్చుయంత్రాల రాక భారతీయ భాషల అనువాదాలు భారతీయ సాహిత్య లిఖిత ప్రతుల ముద్రణ లాంటివి చక చకా సాగాయి. ఈ క్రమంలోనే భారతదేశానికి వచ్చిన లూథరన్ ప్రాటస్టెంట్ మిషనరీల రాక ఉషోదయమయింది. డెన్మార్కు రాజు నాల్గవ ఫ్రెడరిక్ (1671–1730) కాలంలో లూథరన్ ప్రొటెస్టెంట్ శాఖకు చెందిన బర్త్‌లోమయి జిగెన్‌బాగ్ (Bartholomaus Ziegenbalg) హెన్రీపుట్‌షా (Heinrich Plutschau)లను తొలి జట్టుగా భారతదేశానికి పంపాడు. డెన్మార్కు రాజు నాల్గవ ఫ్రెడ్రిక్ కాలంలోనే తొలి నాటకరంగ ప్రదర్శన శాల (First Danish Theater) (1684–1754)లో లిడ్ విగ్ హోల్‌బర్గ్ Lud Vig Holberg (1684–1754) సహకారంతో కోపెన్ హాగన్‌లోనిర్మించాడు. ఇది చారిత్రక కట్టడం.

అలాగే ఖగోళ శాస్త్రవేత్త అయిన ఓలి రోమర్ (Ole Roman 1644–1710) సహకారంతో గ్రెగోరియన్ కాలెండర్ రూపొందించాడు. ఇది విశ్వవ్యాప్తమయిన విషయలోకవిదితమే. ఐతే యిది 1582 అక్టోబర్‌లో 13వ పోప్ గ్రెగోరి ఆధ్వర్యంలో రూపొందించినదానికి కొన్ని సవరణలని చెప్పడం కొసమెరుపు. విశ్వవ్యాప్తంగా నేడు అనుసరిస్తున్న కాలెండర్ యిదే అని చెప్పడానికి ప్రాసంగికంగా ఈ సమాచారం ఉటంకించడం జరిగింది.

ఇక్కడే మరో విషయం ప్రస్తావించాలి. డెన్మార్క్ రాజు నాల్గవ ఫ్రెడరిక్ కాలంలో లూథరన్ ప్రొటస్టెంట్ శాఖ పక్షాన విశ్వవ్యాప్తంగా లూథరన్ మిషనరీలను ఎంపిక చేసి పంపాడు. దానికో కారణం ఉంది. మార్టిన్ లూథర్ ప్రపంచానికి యిచ్చిన బైబులు విశ్వవ్యాప్తం చేయాలనే బీజం డెన్మార్క్‌లో పడింది. (August Hermann Francke1633–1727)ని హలె విశ్వవిద్యాలయానికి ప్రాచ్య భాషా విభాగాధిపతిగా నియమించాడు ఆగస్ట్ హెర్మన్ ఫ్రాన్స్ హిబ్రూ, గ్రీకు భాషల్లో పండితుడు. తొలినాళ్ళలో హెంబర్గ్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. ఆ కాలంలో రోమన్ కాతలిక్, ప్రాటస్టెంట్ లూథరన్ శాఖల మధ్య బద్ధవైరం ఉండేది. దాన్ని అధిగమిస్తూ బైబిల్ కేవలం ఆధ్యాత్మిక గ్రంథంలా కాకుండా మార్గదర్శక గ్రంథంగానూ వివరించాడు. పైగా చారిత్రిక పరిణామ వికాస విస్తరణ వివరాణాత్మక గ్రంథమని చెప్పి తదనుగుణంగానే తన బోధనలు కొనసాగించాడు. బైబిలు చారిత్రిక విజ్ఞానఖని అని నిరూపించాడు. అందువల్ల బద్ధవైరం ఉన్న రోమన్ కాతలిక్కులు కూడా ఆకర్షితులై హెర్మన్ ఫ్రాంక్ బోధలు వినడానికి వచ్చేవారు. ఈ కాలంలోనే అంటే 1698 ప్రాంతంలో 100 మంది అనాధబాలలకు ఉచితవిద్య, వసతి సదుపాయం కల్పించాడు. ప్రజాదరణ సమాజ తోడ్పాటుతో మరో 500 మంది విద్యార్థులకు ఉచిత పాఠశాల ఏర్పాటు చేశాడు. హిబ్రూ, గ్రీకు, లాటిన్ భాషల్లో విద్యాబోధన జరిగేది. ప్రాంతీయ భాషాబోధన అనే దేశీయ సంస్కృతి విద్యావికాసానికి తోడ్పడుతుందని నిరూపించాడు. మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని శ్రమించాడు. ఆగస్ట్ హెర్మన్ ఫ్రాంక్ విస్తృత పరిశోధనల వల్ల మరికొన్ని విషయాలు తెలుస్తాయి.

హెర్మన్ ఫ్రాంక్ అలోచనా విధానం వల్ల జర్మనీలో నూతన విద్యావిధానం మొదలయింది. ప్రాంతీయ భాషలోనే విద్యాబోధన జరగాలని సాధారణ విద్యను (Formal education) దైవవిజ్ఞాన విద్యను (Thelolgical education) నేర్చిన వారిని విశ్వవ్యాప్తంగా పంపాలనే ఆలోచన కలిగింది. ఈ నేపథ్యంలోనే స్వీడన్, ఫిన్లాండ్, మాస్కో హంగేరి, సైబీరియాలో ప్రాంతీయ పాఠశాలలు లూథరన్ ప్రాటస్టెంట్ మిషనరీలు స్థాపించారు. పాఠశాలలతో పాటు ఆయా ప్రాంతాల్లో దేశీయ భాషాభివృద్ధిలో భాగంగా నిఘంటువులు, వ్యాకరణాలు రచించారు. ఇదే స్ఫూర్తితో భారతదేశానికి బర్తలోమయి, జిగెన్‌బాగ్, పుట్‌షాలు, తొలి జట్టుగా 1707లో ట్రాంక్విబార్ వచ్చారు. వచ్చిన అనతికాలంలోనే తమిళం నేర్చుకున్నారు. తమిళ పాఠశాల నెలకొల్పారు. తమిళ విద్యార్థుల కోసం వాచకాలు రచించారు. ఇంతవరకు బాగానే ఉంది. ముద్రణా సౌకర్యం లేనందువల్ల కొన్ని ఇబ్బందులు పడిన మాట వాస్తవం. అందుకు గాను 1708లోనూ 1711 తర్వాత 1712లో వేర్వేరుగా హలేనుండి అచ్చు యంత్రాలు










దిగుమతి చేసుకొన్నారు. ప్రింటింగ్ ప్రెస్‌లో అనుభవం ఉన్న జాన్ గోట్లీక్ ఆడర్ (Johann Gottlieb Adler) ఆయన సోదరుడు కలసి తమిళపోత అక్షరాలున్న అచ్చుయంత్రం నెలకొల్పారు. ఈ లోగా అప్పటికే తయారు చేసిన తమిళ గ్రంథాలు 1712లో హాలే(జర్మనీ)లో అచ్చువేశారు. హాలేలో భారతీయ భాషల్లో మొదట అచ్చయింది తమిళ గ్రంథమే. ఆ తర్వాత హిందూస్థానీలో 1743లో, తెలుగులో 1746లో అచ్చువేశారు. తమిళ వ్యాకరణం 1716లో, హిందూస్థానీ వ్యాకరణం 1745లో అచ్చు వేశారు. ఇవన్నీ హాలే(జర్మనీ)లో అచ్చు అయిన భారతీయ భాషా గ్రంథాలు. తమిళ గ్రంథాలు మాత్రం బర్తలోమయి, జిగెన్‌బాగ్ నేతృత్వంలో అచ్చయాయి. 1716 నాటికి జిగెన్‌బాగ్ తమిళ వ్యాకరణ రచన పూర్తి చేశారు. తన రచనలకు తమిళ గురువు, పండితుడైన అలెప్ప సాయం ఉందని ప్రతీ గ్రంథంలోను పేర్కొన్నాడు. తమిళంతోపాటు తెలుగు కూడా నేర్చుకున్నాడు. తెలుగు పాఠశాలకు కూడా అంకురార్పణ చేసాడు. అయితే 1719 నాటికి తీవ్ర అనారోగ్యం వల్ల మరణించాడు. జిగెన్‌బాగ్ మరణించేనాటికి 37 వత్సరాలు. ఈయన సమాధి నేటికీ ట్రాంక్విబార్‌లో ఉంది. జిగెన్‌బాగ్ మరణానంతరం ఆయన అనువదించిన తమిళ బైబిలు 1728లో అచ్చయింది. జిగెన్‌బాగ్ మరణానికి ముందే తెలుగు నూతననిబంధన, ఆదికాండంలోని కొన్ని భాగాలు, కీర్తనలు, మరికొన్ని సువార్తలభాగాలు అనువదించాడు. హిందీలోకి కూడా బైబిలు అనువాదం చేశాడని అది డక్కన్ పేరా రాతప్రతి ఉందని అంటారు. ఇది కూడా 1745లో అచ్చయిందని అంటారు.

అనంతరం డెన్మార్క్ రాజు పంపిన రెండవ జట్టులో నికొలాస్ డాల్ (Nicholas Dhal), జాన్ హెన్రీ క్రిస్టియన్ మషి (John Henry Keistan Macher) బెంజిమిన్ షూల్జ్ (Benjamin Sehultze) భారతదేశానికి 1719 జూలై 24న మద్రాసుకు వచ్చారు. వెనువెంటనే షూల్జ్ మాత్రం ట్రాంక్విబార్ వెళ్లి తమిళం నేర్చుకుని జిగెన్‌బాగ్ అసంపూర్తిగా మిగిల్చిన తమిళ రచనలు, బైబిలు అనువాదాలు పూర్తిచేసి 1728 నాటికి హాలే నగరంలో అచ్చువేశాడు. ఈ నేపథ్యంలో మద్రాసు వచ్చి 1726 సెప్టెంబరు 14వ తేదీన తమిళుల కోసం ఒక ప్రాంతీయ పాఠశాలను నెలకొల్పాడు. అక్కడ తెలుగు ప్రజలు ఉన్నందువల్ల వారికోసం మరో తెలుగు పాఠశాలను స్థాపించాడు. అది నవంబర్ 5వతేదీ 1726లో ప్రారంభమయినట్లు ఆనాటి లేఖలవల్ల తెలుస్తుంది. అప్పటికీ అక్కడ తెలుగువారు గుంపులు గుంపులుగా నివాసాలు ఏర్పరుచుకున్నందువల్ల వారికి తెలుగులో ప్రార్థనలు నిర్వహించాడు. దీనివల్ల తెలుగు బాగా వచ్చిందని అతని లేఖల్లో ప్రస్తావించాడు. అదే కాలంలో తెలుగుతో పాటు తమిళం, పోర్చుగీసు భాషలో ప్రార్థనలు నిర్వహించి ఆయా భాషల్లో ప్రార్థనలకు కావలసిన కరపత్రాలు తయారుచేశాడు. 1730 నాటికి షూల్జ్ ఒక పుస్తకం తయారుచేశాడు. దీనికి వరుగియన్ గ్రామర్ (Warugian Grammar)అని నామకరణం చేశాడు. ఇది తెలుగు నేర్చుకునే పాశ్చాత్యులకోసం రచించినట్టు పీఠికలో వివరించాడు. వరుగి అన్నది వడుగి అనే పదానికి వికృతి. వడుగి అంటే తమిళ భాషావ్యవహారంలో తమిళనాడుకు ఉత్తరదిక్కున ఉన్న నాడు-జనులు అను అర్థంలో ఉన్న వాడుక. వడుగి లోని డకారం పాశ్చాత్యుల ఉచ్చారణలో లోపించి- ఉచ్చారణలో శైథిల్యం పొంది- రేఫగా మారింది.

షూల్జ్ బహుభాషాపండితుడు. అరబిక్, హిబ్రూ, గ్రీకు, లాటిన్, జర్మన్, ఇంగ్లీష్ భాషల్లో పాండిత్యం సంపాదించాడు. భారతీయ భాషల్లో తెలుగు, తమిళం, హిందూస్థాని (డెక్కన్ అనేవారు) కూడా పాండిత్యం ఉంది. అందువల్ల 100 భాషలకు సంబంధించి ఒక అక్షరమాలను తయారు చేశాడు. దీనికితోడు 200 భాషల్లో పరలోక ప్రార్థన (Lords Prayer) తయారు చేశాడు. అలాగే 1745 నాటికి హిందూస్తానీ వ్యాకరణం రచించి హాలే నగరంలో ముద్రించాడు. ఉరుదు భాషలో కూడా బైబిలు అనువాదపు ప్రతి తయారుచేశాడు. అది అచ్చయిందో లేదో కూడా ఆధారాలు లేవు. ఈ నేపథ్యంలో బెంజిమిన్ షూల్జ్ రచించిన తొలి తెలుగు వ్యాకరణం 'గ్రమటిక

తెలుగిక'ను గూర్చిన వివరణ కొంత విశ్లేషించాలి. ఇది తొలి తెలుగు ముద్రిత వ్యాకరణం. తెలుగు నేర్చుకునే పాశ్చాత్యుల కోసం రచించిన వ్యాకరణ గ్రంథం ఇది. ఇది 1728వ సం. మద్రాసులో అచ్చయింది. జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్ ప్రధాన నగరమైన హాలె ప్రస్తుతం సాలె(saale) అంటారు. 35వ వార్షికోత్సవ సందర్భంగా 1984లో పునర్ముద్రించారు. 199 పుటలున్న ఈ గ్రంథానికి పీఠిక, అభిప్రాయం కలిపి 202 పుటలతో పునర్ముద్రణ అయింది. మార్టిన్ లూథర్ విశ్వవిద్యాలయం, హాలె-విటెన్‌బర్గ్ వారి సహకారంతో పునర్ముద్రణ జరిగింది Legacy అనే పేర ముద్రించిన నాలుగు పుటల పీఠికలో ఎన్నో చారిత్రిక, సాంస్కృతిక, వారసత్వ, విజ్ఞాన విషయాలున్నాయి. షూల్జ్‌కి పూర్వం భారతదేశం వచ్చిన బర్తలోమయి జీగెన్‌బాగ్‌కి సంబంధించిన అపురూపమైన వివరాలు సంక్షిప్తంగా అందించాడు. 'గ్రమిటిక తెలుగిక' అనే ఈ వ్యాకరణ గ్రంథం ఒక వైపు లాటిన్ మరోవైపు తెలుగు భాషల్లో ముద్రితమయింది. ఇందులో మొత్తం ఎనిమిది విభాగాలు ఒక అనుబంధం ఉంది. ఎనిమిది విభాగాలు 1. లిపి(Script) 2. ఉచ్చారణ (Pronounciation) 3. నామవాచకాలు (Nouns) 4. విశేషణాలు (Adjectives) 5. సర్వనామాలు (Pronouns) 6. క్రియలు (Verbs) 7. ప్రత్యయములు (Particles) 8. వాక్యనిర్మాణాలు(Syntax) అని వర్గీకరణం చేశాడు. అనుబంధంలో విశ్వాసం యొక్క మంత్రము, పరమండల మంత్రము, ఆదికాండం genesis మొదటి అధ్యాయం ఉన్నాయి. ఆనాటి వ్యావహారిక భాష, పదాల పలుకుబడి, రచనావిధానం ప్రత్యేకంగా గమనించవచ్చు.

(తరువాయి వచ్చే సంచికలో...)

**కవిత**

## "బాపట్ల నానీలు"

నాటి మా టీచర్లు
అమ్మ మనసులు
ఆ జ్ఞానబీజాలే
ఈ అక్షర ఫలాలు

బతుకంతా వలసే
నడిచింది
ముత్యాలకోసమైనా
దొరికింది గవ్వలే

అమ్మ పుత్తరంలో
మనసుతడి
ఆ ఒడి కోసం
బతుకంతా వేసవి మడి

నేను విస్తరించింది
నగరంలోనే
నా వేళ్లు మాత్రం
మా పూరివైపే

ఎడ్లబండి రిక్షాలు
ఆనంద కాసారం
కార్లు వచ్చాక
ఊరు కాలుష్యాగారం

గీతాజయంతులు
మా నాన్న జీవనవ్రతం
ఫలశ్రుతులు
మా జీవితాలే !

మా నాన్న
నల్లకోటు పావురం
ఎగిరిన ఆకాశమంత
మానవత్వం

సముద్రంలో నీళ్ళన్నీ
బడబాగ్నిని ఆర్పలేవు
వేదనాగ్నిని
కన్నీటిలా

- సి. భవానీ దేవి
98668 47000



డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# "అదే నేల" పుడుతుంది, కవిత్వమంటే ప్రేముంటే




**"పా**ఠకుడికైనా, రచయితకైనా, సాహిత్యమన్నదొక జీవిత కాలవుసాధన'' అంటాడు రవీంద్రనాథ టాగూరు. జరిగిపోయిన చరిత్రను సాకలంగా అర్థం చేసుకుని, సమకాలిన జీవితాన్ని సక్రమంగా గమనిస్తూ, భవిష్యత్తులో రాబోయే పరిణామాలను సైతం ముందుగా తెలుసుకుని హెచ్చరించగలిగే సాహిత్యకారుల్నే ద్రష్టలని గుర్తిస్తున్నాం. మానవజాతి అదృష్టంవల్ల యిటువంటి ద్రష్టలు మనకు కొందరు పుడుతూనే వున్నారు. అందుకే మానవాభ్యుదయానికి సాహిత్య అధ్యయనం కంటే గొప్ప బలమైన మార్గం మరొకటి కనిపించదు. సమగ్రమూ, సాధికారమూ, ప్రణాళికాబద్ధమూ అయిన సాహిత్య అధ్యయనాలు చాలా తక్కువగానే వుంటాయి. ముకుంద రామారావు గారి "అదే నేల" (భారతీయ కవిత్వం - నేపథ్యం) అనే పెద్ద పుస్తకం ఆ జాబితాలో తప్పకుండా వుంటుంది.

మంచి పాఠకుడు క్రమంగా మంచి విమర్శకుడిగానూ, మంచి సృజనాత్మక రచయితగానూ మారిపోతూవుంటాడు. మంచి పాఠకుడూ, విమర్శకుడూ, రచయిత గూడా అయిన వ్యక్తి మాత్రమే "అదే నేల" వంటి పనిని నిర్వహిస్తాడు. యే రచన అయినా, పుస్తకమయినా, ఆ రచయిత వ్యక్తిత్వాన్ని ప్రతిఫలిస్తూనే వుంటుంది. ముకుంద రామారావు గారి సాహిత్య ప్రయాణాన్ని గమనించినప్పుడు ఆయనదైన విలక్షణమైన అన్వేషణా, అ సాధనా స్పష్టంగా కనబడుతుంది.

స్వాతంత్ర్యానికి ముందు 1944లో పశ్చిమ బెంగాల్ లో వుండే 'ఖరగ్‌పూర్' అనే వూర్లో ముకుందరామారావు గారు పుట్టారు. కలకత్తా నుంచీ 130 కిమీ కివతల వొరిస్సా రాష్ట్రపు సరిహద్దుల్లో వుండే ఖరగ్‌పూర్ లో యిప్పటికీ ముప్పయి అయిదు శాతం మంది తెలుగువాళ్లే ! చాలా దశాబ్దాల క్రితం కళింగాంధ్ర ప్రాంతాల నుంచీ చాలామంది తెలుగువాళ్లు రైల్వేలో వుద్యోగాలపైన ఖరగ్‌పూర్ వెళ్ళి స్థిరపడిపోయారు. అక్కడ పుట్టి పెరిగి, వుద్యోగం వచ్చిన కొన్ని సంవత్సరాల తర్వాత తిరిగి తెలుగురాష్ట్రాల కొచ్చిన కొద్దిమందిలో ముకుంద రామారావుగారొకరు. రాష్ట్రేతర ప్రాంతంలో పుట్టి పెరిగినందు వల్ల ఆయన సాహిత్య సృజన తన మూలాల్ని వెదుక్కునే క్రమానికొక ఆవిష్కరణగా ప్రారంభమయింది. 1995లో ఆయన ప్రచురించిన తొలి కవితా సంపుటానికి "వలసపోయిన మందహాసం" అనే పేరుండడం యాదృచ్ఛికమని అనిపించదు.

ముకుందరామారావు గారి రెండో కవితాసంపుటం పేరు ''మరో మజిలీకి ముందు '' 'అంతములేని యీ భువనమంత పురాతన పాంథశాల' అనిగదా అంటాడుకవి. యిలా తన మూలాలను వెతుక్కునే జీవితమంతా మజిలీల సముదాయని జీవితం దగ్గర పాఠం నేర్చుకున్న సాహిత్యకారుడి జీవనయానం యెలా సాగుతుందో తెలుసుకోవాలనుకునే వాళ్లకు ముకుందరామారావు గారి ప్రయాణం గొప్ప వుదాహరణగా రూపొందింది. తన ముందు తరం వాళ్ళెప్పుడో బొంబాయి దగ్గరి వూళ్లోకొచ్చి స్థిరపడిపోయాక, తన జీవితం తనను 'అవతలివాడు–లోపలివాడు' గా మార్చేశాక, చిన్నప్పటి నుంచీ తనకు మాతృభాషగా తయారైన యింగ్లీషులోనే కవిత్వం రాశాక, డెబ్బయ్యేళ్లునిండాక, ప్రముఖకవి నిస్సిమ్ యెజికియల్, తన వ్రేళ్లను వెదుక్కోవాలని ప్రాచీన మరాఠీ కవిత్వాన్ని అనువాదం చేయడం మొదలు పెట్టారు. యెజకియల్ కంటే చిన్న వయస్సులోనే ముకుందరామారావు గారిలో మొదలైన యీ విచికిత్స యిప్పుడు భారతీయ కవిత్వాన్నంతా అన్వేషించడం దగ్గరిదాకా వచ్చి ఆగింది.

2009 వరకూ అయిదు కవితా సంపుటాల్ని ప్రచురించాక ''అదే ఆకాశం'' (అనేక దేశాల అనువాద కవిత్వం) అనే పరిశోధనాత్మక, అనువాద రచనతో ముకుందరామారావు గారి యీ మౌలికమైన ప్రయాణం ప్రారంభమైంది. విస్తృతమైన పరిధి నుంచీ ప్రారంభమై, క్రమంగా తన పనిధిని పరిమితం చేసుకుంటూ నోబెల్ బహుమతి వచ్చిని కవుల కవిత్వం, ఆ తరువాత యిప్పుడు భారతదేశపు కవిత్వం వరకూ ఆశోధన కేంద్రీకరించబడుతూ వచ్చింది. సృజన కారులెవరూ యిలా ప్రణాళిక వేసుకుని సాగరు. అయితే వొక విస్పష్టమైన, వ్యక్తిగతమైన, విశిష్టమైన అన్వేషణతో ముందుకెళ్లే రచయితల రచనలలోనే యిటువంటి నిర్దుష్టమైన పరిణితి కనబడుతుంది.

ముకుందరామారావుగారు మౌలికంగా కవి. కవిత్వం ఆయన కిష్టమైన, ఆయన యెంచుకున్న ప్రక్రియ. ఖరగ్‌పూర్‌లో పుట్టడంవల్ల ఆయనకు తెలుగుతో బాటూ హిందీ, యింగ్లీషు, బెంగాలీలలో గూడా అభినివేశం వచ్చింది. యీ నాలుగు భాషల పడవల పైనే ఆయన యీ ప్రపంచ భాషల సముద్రాన్నంతా తరచిచూడ్డానికి బయల్దేరాడు. ఆయా భాషల్లోంచి యీ నాలుగు భాషల్లోకి అనువాదాలైన కవితల్నే ఆయన యెంచుకోగలిగాడు. ఆ కవితలకంతా గొప్ప నేపథ్యంగావున్న ఆయా భాషల సాహిత్యాలను గురించి తెలుసుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాడు.

సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ కవిత్వం, భిన్నమైనదనీ, విచిత్రమైనదనీ, విశిష్టమైనదనీ, యేది కవిత్వమో, యేది కవిత్వం కాదో చెప్పడం చాలాసుభమేకాని సులభంగాదని విమర్శకులంటారు. అందుకే బాల గంగాధర తిలక్ "కవిత్వం ఒక ఆల్కెమీ, దానిరహస్యం కవికే తెలుసు" అంటాడు. కవి అయిన ప్రతీవ్యక్తి కవిత్వమంటే తనదైన నిర్వచనాన్ని వెతుక్కున్నారు. అందువల్ల కవిత్వమంటే కవులెందరున్నారో అన్ని నిర్వచనాలు యెదురవుతాయి. అయితే యీ అనేకానేక నిర్వచనాల్లో తామస్ కార్లయిల్ అనే యింగ్లీషు రచయిత చెప్పిన–కవిత్వమంటే "సంగీతాత్మక ఆలోచన" (Musical Thought) అనే నిర్వచనం స్పష్టంగానూ, నిర్దుష్టంగానూ వుంది. యీ

సంగీతమన్నది కేవలం కవిత్వంలోని అక్షరాలు, పదాలూ, వాక్యాలూ కలిసి చేసే శబ్దరూపకమైన బాహ్యరూపంలో మాత్రమే గాకుండా, దానికున్న భావం, వస్తువు, ఆలోచన మొదలైన వాటి సమాహారమైన అంతరంగికరూపంలో గూడా వుండాలి. అప్పుడే అది కవిత్వమవుతుంది. కవిత్వాన్ని తూచే తూనికరాళ్లు తన దగ్గర లేవని చలం అన్నది కేవలం శ్రీశ్రీ కవిత్వాన్ని గురించి మాత్రమేగాదు. అసలు కవిత్వాన్ని తూచే తూనికరాళ్లు ప్రతి కవితకూ వేర్వేరుగా వుండిపోతాయి. గొప్ప కవిత్వానికి "సూచనాత్మకత" (Suggestiveness) స్థలకాలాలనుబట్టి మారగలిగే సామర్థ్యం (Adoptability) వుండాలని యెడ్గార్ యెలాన్పో అంటాడు. యిన్ని రకాల విశిష్టతల్ని కలిగివుండే కవిత్వాన్ని అనువదించడమన్నది చాలా చాలా కష్టమైనపని. అనువాదపు సిద్ధాంతాల చర్చచేసే విమర్శకులయితే "కవిత్వాన్ని అనువాదం చేసేటప్పుడు కోల్పోయేదే మిటంటే, కవిత్వమే!" అని తేల్చేస్తారు. అలాగని కవిత్వ అనువాదాల్నే తలపెట్టకుండా చేతులు ముడుచుకుని కూర్చునివుంటే, యిప్పటి ప్రపంచ సాహిత్యమసలు యిప్పుడున్నట్టుగా వుండేదేగాదు. అనువాదానికీ, అనుసృజనకూ మధ్యవుండే తేడాల్ని తెలుసుకున్న సాహిత్యకారులంతా అనువాదాల్ని చేపడుతూనే వున్నారు. రవీంద్రనాథ్ టాగూరు తన సమకాలికుడైనటువంటి యెస్. యిలియట్ కవితల్ని గూడా అనువాదం చేశాడు. శ్రీశ్రీ చేసిన అనువాదాలు చాలా వున్నాయి. అనువాదాల గురించిన సిద్ధాంతాలూ, చర్చా, వాద వివాదాలూ అన్నీ వోవైపు జరుగుతూనే వుంటే, కవిత్వ ప్రేమికులైన సాహిత్యకారులు మరోవైపు తమపని తాము చేసుకుపోతూనే వుంటారు. ముకుంద రామారావు గారీ కోవలోని వ్యక్తి.

వేదాంతపరిభాషలో చెప్పాలంటే అనువాదకుడు చేసే పని పెద్ద నిష్కామకర్మ. అతడి పనిమాత్రం ముందుంటుంది. దాని వెనక తానంతటతానే మాయమైపోతూ అనువాదకుడుంటాడు. కవిత్వం బావుంటే ఆ కీర్తి దాని అసలు కవికి దక్కుతుంది. బాగలేకపోతే ఆ అపకీర్తి మాత్రం అనువాదకుడిదే అవుతుంది. యింతకష్టమైనపని చేయడానికి కేవలం కవిత్వమంటే అంతులేని ప్రేమ వుండే వ్యక్తితప్ప మరెవరూ పూనుకోరు. "అదే నేల", "అదేగాలి", "నోబెల్ కవిత్వం"వంటి అనువాదాలు ముకుందరామారావుగారికి కవిత్వమంటే వుండే ప్రేమకు నిలువెత్తు ఆవిష్కరణలు.

"అదేనేల" లో ఆయన యిప్పుడు భారతదేశంలో వుండే 28 భాషల్లోని కవిత్వంతో బాటూ, వాడుకలోలేని 32 భాషల్లోనూ, వొక చారిత్రక సత్యంలా భారతదేశంలో యింకిపోయిన భారతీయాంగ్ల కవిత్వం లోనూ వచ్చిన ప్రాతినిధ్య కవులనూ, కవులనూ అనువాదరూపంలో పరిచయం చేయడంతో ఆగిపోలేదు. ప్రతిభాషలోని సాహిత్య చరిత్రనూ, ప్రత్యేకించి కవిత్వాల ఆవిర్భావ పురోగమనాల్నీ సంక్షిప్తంగానే అయినా, పక్షికంటితో చూసేరీతిలో (bird's eye view), పరిచయం చేయడానికి పూనుకున్నాడు. పరిచయాత్మకమైన భూమికనే అయన యివ్వదలచు కున్నప్పటికీ, యిది చాలా పెద్దపని దీనికి ఆచరణాత్మకమైన ప్రణాళికా, ఆప్రణాళికను వోపికగా, సాకల్యంగా ఆవిష్కరించే నైపుణ్యం రెండూ కావాలి. ఆ రెండూవున్నందువల్లనే "ఆదే నేల" వంటి సమగ్రమైన పుస్తకాలు యే భాషలోనయినా అరుదుగావుంటాయి.

అయితే యీ లిఖితకవిత్వంతో ముకుందరామారావుగారు ఆగిపోలేదు. దాదాపు 120 పేజీల ఆదీవాసీ కవిత్వాన్ని గూడా అందించారు. లిపిలేని భాషలూ, ప్రపంచీకరణ వెల్లువలో కొట్టుకు పోతున్న భాషలూ వున్న యిప్పటి రోజుల్లో, యిలా ఆదీవాసీల కవిత్వాన్నంతా వోచోట కుప్పబోయడం ఆషామాషీపని గాదు. మన దేశంలోని రకరకాలైన ఆదీవాసీల భాషలన్నింటినీ జాబితా గట్టి, వీలయినన్ని ఆదివాసీ కవితల అనువాదాల్ని పుస్తకంలోకి చేర్చారు. అంతటితోనూ ఆయన ఆగలేదు. భారతీయ భాషల్లో కవులకు వచ్చిన సాహిత్య బహుమతులనంతా, గణాంకవేత్తలా (statistician) పట్టికలో గట్టి చూపెట్టాడు. యిలా "అదేనేల" అనే పుస్తకాన్ని అనేక దళాల్ని విప్పుకున్న పెద్ద తామరపువ్వులా ఆయన రూపొందించారు.

యిటువంటి సంకలనం సర్వసమగ్రం గాదనీ, అవి "యింకా చదవాలన్న ఆకలి పుట్టించే సాధనాలేననీ, ఆకలిని పూర్తిగా తీర్చగలిగేవి మాత్రం కావనీ ముకుందరామారావు గారికి స్పష్టంగా తెలుసు. యే కళాకారుడైనా తనకున్న పరిధిలోనే పూర్తిగా పురివిప్పుకోడానికి ప్రయత్నించాలి. అందులో యేలోటూ వుండకుండా జాగ్రత్త పడాలి. అప్పుడే "అదేనేల" వంటి బృహత్‌గ్రంథం తయారవు తుంది. దీనికి సంపాదకత్వం వహించిన ఎ.కె.ప్రభాకర్ గారు "ఏ *విశ్వవిద్యాలయమో, అకాడమీనో, వొక పదిమంది రచయితల సామూహిక కృషిగా వెలువరించాల్సిన గ్రంథంయిది*" అనడం అత్యుక్తికానేగాదు. వివిధ మతాలూ, జాతులూ, భాషలూ, వుండే యీ విశాల భారతదేశానికుండే యేకాత్మకమైన ఆత్మను పుట్టుకోవాలనుకునే వారికీ పుస్తకం గొప్ప ఆలంబనగా వుంటుంది. "భాష, ప్రాంతం మూలంగా ఎందుకు అని ప్రత్యేకంగావున్నాయో, కొన్ని కవితల విశేషతలే తెలియజేసేవి అయినా ఉపఖండంలోని ఇతర భాషలకు ఆ కవితలు మరీదూరం అనిపించకపోవడమే భారతీయ భాషల్లోని విశేషగుణం" అనే ముకుందరామారావుగారి మాటల్ని యీ పుస్తకంలోని కవితలు నిరూపిస్తాయి.

ఇంత పెద్ద పుస్తకంలోంచి కవితల్ని వుదహరించడం సులభంగాదు. కానీ ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో జీవిస్తున్న వో పురాతన తెగ, 'సవరలు' పాడే వోపాట అనువాదాన్ని మాత్రం యిప్పుడు పేర్కొనాలనిపిస్తోంది.

**కొండలు అందంగా కనిపిస్తాయి**

కొండలు అందంగా ఉంటాయి చెట్లుంటే/ చెట్లు అందంగా ఉంటాయి మృదువైన ఆకులుంటే/ ఆకులూ అందంగా ఉంటాయి నీడ వుంటే/ నీడా అందంగా ఉంటుంది జంతువులు తిరిగ గలిగితే/ మనిషి అందంగా ఉంటాడు అతనికి భార్య ఉంటే/ భార్య అందంగా ఉంటుంది ఆమెకు బిడ్డ ఉంటే/ కొండజాతి అందంగా ఉంటుంది ఒక భాష ఉంటే/ భాష అందగా ఉంటుంది ఒక లిపి అన్నది ఉంటే /కొండజాతి బతుకుతుంది, దానికొక భాష ఉంటే/ఇది నిజం, గుండెలో దీనిని దాచుకో

కవిత్వమంటే, ప్రేమవుంటే, సమగ్రతకోసం అన్వేషించే తృష్ణ వుంటే, సుదీర్ఘమైన ప్రయాణానికి సన్నద్ధమయ్యే తెగువుంటే, అడుగుపైన అడుగేసుకుంటే గమ్యాన్ని చేరగలిగే సంయమనమూ, శ్రద్ధా వుంటే, "అదేనేల" వంటి పెద్ద పనిగూడా సాకారమవుతుంది. యింత పెద్దపుస్తకాన్ని ప్రచురించిన "సాహితీ ప్రచురణలు"కు ప్రత్యేకంగా అభినందనలు.

యాత్రాసాహిత్యం

# 'ఆమె లేఖలు'

మూల రచన : జూలియా చార్లోటి
అనువాదం : కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ,
డా. కాళిదాసు పురుషోత్తం
90006 42079

(గత సంచిక తరువాయి...)

## 12వ లేఖ
## ఇదీ అసలైన భారతదేశం

**రా**జమండ్రి పరిసర ప్రాంతాలను గురించి చెబుతూ, "ఇక్కడ నిత్యం ఏదో కొత్తదనం కనబడుతుంది. రాజధాని కంటే నాకు ఈ 'పల్లెప్రాంత'మే బాగా నచ్చింది. ఇక్కడే ఎంతో హాయిగా ఉంద"ని అంటుంది. "మద్రాసును పాశ్చాత్యీకరించడానికి ప్రతివొక్కరూ తమ శక్తి మేరకు ప్రయత్నిస్తున్నారనుకో, కానీ అవేం ఫలించలేదు. అక్కడ ఆసక్తికరమైన వాట్ని రూపుమాపడం తప్ప ఏం సాధించారని ? " అని ఆమె విమర్శిస్తుంది.

ఈ ప్రాంతాన్ని ఆమె పాతరాజాల రాజ్యంగా వర్ణిస్తూ "వాళ్లు చాలా కలుపుగోలుగా ఉంటారు. మా యిళ్లకి రావడానికి యిష్టపడతార"ని అంటుంది. వచ్చేటప్పుడు కానుకలేవీ లేకుండా ఉత్తచేతులతో రావడం అమర్యాదగా వాళ్లు భావిస్తారు. ఐతే విలువైన కానుకలు స్వీకరించడం చట్టవిరుద్ధం గనక, ఏ నిమ్మకాయలో, బత్తాయిలో పట్టుకొస్తారు. మొన్నటి రోజు మాకు బుట్టెడు బత్తాయిలు, వాటితో ముక్కూ మొహం తెలియని ఓ రాజాగారు మా యింటికి వస్తున్నారన్న సమాచారం అందాయి." మర్నాడు సరిగ్గా అనుకున్న సమయానికి రాజాగారు సపరివారంగా వేంచేశారు. ముందుగా ఈలల శబ్దం వినవచ్చింది. అది రాజాగారి పల్లకీ వస్తున్నట్లు తెలిపే వాద్యం. దాని తర్వాత, ఆయన పరివారం – మొదట ఈటెలు ధరించిన భటులు, వారి తర్వాత వెండి బెత్తాన్ని, చేతులో పట్టుకొని వున్న ఆయన ప్రధాన అధికారి, ఆ తర్వాత రాజాగారికి కాలక్షేపం కలిగిస్తూ పల్లకివెంట పరుగులెత్తే ఆస్థాన పరివారం వచ్చారు. అందరూ చేరిన తర్వాత భటులు తమ ఆయుధాలను దించి "హాల్ట్! ప్రెజెంట్! ఫైర్" అని అరవటంతో ఎక్కడివాళ్లక్కడ ఆగిపోతారు. ఫైర్ అని అరుస్తాడే కానీ ఫైరింగ్ ఏమీ జరగదు, ఆ ముసలాయన పల్లకీ దిగి, ఇరువైపులా బారులు తీరిన తన పరివారం, జడ్జిగారి బంట్రోతులు అడుగడుక్కి సలాములు చేస్తుండగా లోపలికి వేంచేస్తారు. ఆయన నల్లని శరీరం తెల్లని దుస్తుల్లో నుంచి కనబడుతుంటుంది, చెవుల్లో కమ్మలు, చేతులకు బంగారు కడియాలు, మెడలో వజ్రాల హారం వుంటాయి. "నేను ఆయన్ను 'Penny Whistle Raw' అని పిలుస్తాను అది ఆయన అసలు పేరు కాకపోయినా, అట్లానే వుంటుంది, అర్థం కూడా అదే కావచ్చు". ఆయన డ్రాయింగ్ రూములోకి వస్తూ ద్వారం వద్ద (దానికి తలుపులు లేవు) నిలబడి సలాము చేశాడు. జడ్జిగారు, ఆమె కూడా తమ 'శక్తిమేరకు' సలాములు చేసిన తర్వాత వారికి ఆయన చెరొక బత్తాయి పండు బహుమతిచ్చాడు. దాంతో మళ్లీ రెండు వైపులా సలాములు! ఈ తతంగమంతా పూర్తయ్యాక ఆయన తీరిగ్గా కూర్చొని 'దొరగార్ని', 'దొరసాని'ని తెగ కీర్తించడం మొదలు పెట్టాడు. అది అందరూ చేసే పనే అయినా ఆ ముసలి రాజాగారు పొగడ్తలతో పాటు యూరోపియన్ల యోగక్షేమాలను కూడా అడిగి తెలుసుకున్నాడు. ఆయనకు తన దేశీయుల మీద కంటే యూరోపియన్ల పైనే శ్రద్ధాసక్తులు మెండుగా వున్నట్లుంది. ముఖ్యంగా మన చక్రవర్తి మరణించాడన్న మాట నిజమేనా, ఆయన వారసులిగా ఒక స్త్రీ రాజ్యానికి వచ్చిందన్న మాట వాస్తవమేనా అని ఆయన విచారించాడు. ఒక స్త్రీ సింహాసనాన్ని అధిష్ఠించడం ఆయనకు అందని విషయం కావడంతో ఆమె పాలనను గురించి, ఆమె ఆజ్ఞలను ప్రముఖులు ఎలా శిరసావహిస్తున్నారని అడగడం కూడా మానుమన్నాడు. చక్రవర్తి మరణం వల్ల జడ్జిగారికి ప్రమోషన్ ఏదైనా వచ్చిందా అని ఆయన పరామర్శించాడు. చివరికు తన యింటికి వచ్చి వారం రోజులు తన ఆతిథ్యం స్వీకరించాలని కోరాడు. వాతావరణం అనుకూలిస్తే వెళ్లాలనే ఆమె అనుకొన్నది. అలా ఒక గంట సేపు గడిపిన తర్వాత, మళ్లీ ఎప్పటిలాగా సలాములు, బూరగ ఊదడం, మేళతాళాలు వాయించడం, భటులు ఆయుధాలు ధరించి కవాతు చేయడం, 'Halt! Present! Fire' అంటూ అరవడం వగైరా తతంగాలతో జమీందారు బయల్దేరాడు. బయల్దేరే ముందు తనకూ ఇంగ్లీషు సంప్రదాయాలు తెలుసునన్నట్లు కరచాలనం చేసి మళ్లీ వారం తర్వాత వచ్చి దర్శించుకొంటానని చెప్పి, ఆమె వద్ద శెలవు తీసుకున్నాడు. – "My Lady, I now to your Excellency say farewell, I shall hope you to pay one visit, and on one week (meaning hence) I shall come again to see the face of your honour civilian.'' అంటూ ఆహ్వానించాడంటుంది.

రాజాలేకాదు, వారికంటే తక్కువ శ్రేణికి చెందిన చాలా మంది నేటివులు ఏదైనా ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో జడ్జిగారింటికి వచ్చి దర్శనం చేసుకొని పోతుంటారు. కొంత మంది గేటు వద్దనే కాచుకొని వుండి సలాములు చేస్తారు. వాళ్లు నోటితో ఏమీ అడగరు, కానీ తాము కోరుకున్న ఉద్యోగాన్ని వేషధారణ ద్వారా సూచిస్తారు. కోర్టు గుమాస్తా కావాలనుకునేవాడు చేతిలో కలం పట్టుకొని నిలబడతాడు. బంట్రోతు పని కోరేవాడు మొలలో కత్తి దోపుకొని వస్తాడు. వీరికంటే కాస్త పై తరగతి వాళ్లు యింటికొచ్చి కనబడిపోతుంటారు. ఒకతను క్రమం తప్పకుండా వారానికి రెండు సార్లు వచ్చి ఎ – తో మాట్లాడిపోతుంటాడు. ప్రతిసారి అతను జడ్జిగార్ని "మీరేనా తల్లీతండ్రీ (Your excellency is my father and mother) అని, "తమ ముఖదర్శనం కోసంవచ్చా"నని (Sir I came to behold your honourable face) అంటాడు . "ఏమైనా చెప్పుకొనేది వుందా" అని జడ్జిగారడిగితే ఏమీ లేదంటాడు. (Nothing great Chief.) అప్పుడిక వెళ్లమంటే సలాములు చేస్తూ వెళ్లిపోతాడు. "అలా చూడ్డానికి వచ్చేవాళ్లను మనమే వెళ్లమని చెప్పాలి. లేకుంటే తాము వెళ్లిపోవడం అమర్యాదగా భావిస్తారు. ఇటువంటి వాళ్లను రోజులో ఫలానా సమయంలో మాత్రమే రమ్మని నియమం పెట్టాల్సి వచ్చింది. లేకపోతే రోజూ వేధిస్తార"ని ఆమె అంటుంది. అతిథుల రాకపోకల వల్ల ఉత్తరం రాయడానికి, మరేపని చేయడానికీ ఆమెకు ఆటకం కలుగుతుంది. ముందుగా తెలియజేయకుండా, వచ్చినా వాళ్లను ఆహ్వానించడం, మళ్లీ వాళ్లయిళ్లకు..... మళ్లీ వాళ్ళను ఆహ్వానించడం, తిరిగి వాళ్ల ఇళ్లకు వెళ్లిరావడం గొప్ప సంప్రదాయమనే అభిప్రాయం నేటివుల్లో వుంది.

అది తనకు చాలా ఇబ్బందిగా ఉన్నట్లు ఆమె అంటుంది. తనకు బొత్తిగా పరిచయం లేని వాళ్లు తన యింటికి రావడం, వాళ్ల యిళ్లకు తాను వెళ్లడం తనకు సుతరామూ యిష్టంలేదు. అయినా, అది యిక్కడ సంప్రదాయం. తన యింటికి వచ్చే వాళ్లలో మిసెస్ ఎస్ అంటే ఆమెకు చాలా యిష్టం. ఆమె త్వరలో ఇంగ్లండు వెళ్లిపోతుందని, రెండు రోజులు మాత్రమే తనతో గడిపిందని రాసింది. కొత్త రిజిస్ట్రార్ హామిల్టన్, ఆయన భార్య యిప్పుడు జడ్జిగారి యింట అతిథులుగా వున్నారు. మంచి బంగళా దొరికేదాకా వాళ్లు జడ్జిగారింట్లోనే వుంటారు.

రాజమండ్రిలో క్లర్జిమాన్ లేరు గనక, ఇంగ్లీషు చర్చితో జడ్జిగారే ప్రార్థన జరుపుతున్నారు. ఇది సంప్రదాయం. ప్రార్థనకు ఇంగ్లీషువారంతా హాజరవుతారు, తక్కిన కులాలకు చెందిన ప్రొటెస్టెంట్లు కూడా వస్తారు. రాజమండ్రిలో చిన్న రోమన్ కేథలిక్ గుడి కూడా వుంది. దానికి పూజారి లేకపోయినా, సార్జెంట్ కీలర్ మామ రోజర్ మిశ్రజాతి (half cast) దాన్ని సంరక్షిస్తూంటాడు. అతను ఆగుడిని ఎల్లప్పుడు పరిశుభ్రంగా వుంచి, కొవ్వొత్తులు వెలిగించి, పువ్వులతో అలంకరిస్తాడు. అతను డాక్టర్‌కి అసిస్టెంటు (డ్రెసర్)గా పని చేస్తూంటాడు. జడ్జిగారు గుడిలో ప్రార్థనలు జరుపుతారని తెలియగానే, తాను కూడా రావచ్చునా అని రోజర్ అడగ బంపించాడు. రావచ్చు నన్నారు కానీ, అతను రాలేదు. “ఎందుకు రాలేదో అని విచారిస్తే, పాపం రావాలని అతను చాలా ఆశపడ్డాడు కానీ, దురప్రాంతం నుంచి ప్రీస్ట్ వస్తే, ఏమంటారోనని, భయపడి రాలేదని, సార్జంట్ చెప్పార”ని ఆమె రాస్తుంది.

అక్టోబరు 3వ తేదీ మొదలు పెట్టి, 15వ తారీకు కొంత రాసి, 27వ తేది పూర్తి చేసిన ఈ ఉత్తరంలో ఆమె రాజమండ్రిలో తన జీవన విధానం కొంత వివరిస్తుంది.

‘‘ఇక్కడి జీవనసరళి, బంట్రోతులు, ఇళ్ల అద్దెలు వగైరా విషయాలు రాయమని నీ వుత్తరంలో కోరావు’’ అంటూ, ఆ వివరాలన్నీ పూసగుచ్చినట్లు చెబుతుంది. పెద్దయిల్లు, దానిచుట్టూ రెండెకరాలతోట, ఇంటి అద్దె సంవత్సరానికి 60 పౌనులు. వంట సరుకులు చౌకే, కానీ వేడివల్ల ఏదీ నిలవ వుండక చాలా దుబారా అవుతుందంటుంది. కసాయి వాడికి గిట్టుబాటు కోసం మాంసం అవసరమైన దానికంటే, ఎక్కువే తీసుకోవాల్సి వస్తుంది. బంగాళాదుంపలు రాజమండ్రిలో దొరకవు, మద్రాసు నుంచి తెప్పించుకోవాలి. మిగతా కాయగూరలు జడ్జిగారి తోటలో పండిస్తారు. వాళ్లకి కోళ్లఫారం కూడా వుంది.

నౌకర్లకు జీతబత్యాలు తక్కువే అయినా, వాళ్ల సంఖ్య ఎక్కువ కావడం వల్ల ఖర్చు ఎక్కువగా వుంటుంది. ఎ – పొదుపుగా వుండాలని కొద్దిమంది నౌకర్లను పెట్టుకొన్నాడు. వాళ్ళ జాబితా యిదీ –

బట్లరు ఒకరు, డ్రెస్ బోయ్ (వేలెట్) ఒకరు, పాత్రలు కడిగి దీపాలు వెలిగించేందుకొక మాటీ, ఇద్దరు ఆయాలు, ఒక ‘అమ్మ’ (వెట్ నర్స్ – బిడ్డకు పాలు కుడి పేదాది) ఒక వంట మనిషి, ఒకటున్ని కచ్చి (ఇంటి పని మనిషి), ఇద్దరు తోటమాలీలు, ఆరుగురు బేరర్లు, నీళ్లు తెచ్చేందుకు ఒకడు, ఇద్దరు – గొర్రెల కాపర్లు, గడ్డికోసే వాళ్ళు ఇద్దరు, కుక్కను చూచుకొనే మనిషి (డాగ్ బోయ్) ఒకడు, కోళ్లను సంరక్షించేందుకు ఒకడు, ఒక చాకలి, ఒక దర్జీ, ఒక వేటగాడు, అమ్మకొక వంటమనిషి మొత్తం 27 మంది. చాలా తక్కువ కింద లెక్క మంది ఎక్కువ పని తక్కువ. ఆ పని కూడా నచ్చుగా చేస్తారు. ఎవరైనా భోజనానికి వస్తే, వంటవాడు తనకొక మాటీలేనీ, సహాయకుడుకాని కావాలని ఏడుస్తాడు. అప్పుడు ఎవరినైనా కూలికి ఏర్పాటు చేయాల్సి వస్తుంది. అందరికీ తిండి ఇక్కడే. ‘ఉన్నత కులాల’వారు మాత్రం ఆ భోజనం ముట్టుకోరు. కానీ, అస్పృశ్యుల(Paraiah)యిన మాటీలు, చిన్ని చిన్ని నౌకర్లు మాత్రం ఏది దొరికినా సంతోషంగా తినేస్తారు. ‘ఆయా’ అగ్రకులస్థురాలు, అందుకోసం ప్రత్యేకంగా ఒక వంట మనిషిని పెట్టాలి. ఇంత చేసినా, ఎప్పుడైనా పొరపాటున ఇతర కులాలవాళ్ళు దగ్గరకు వచ్చారంటే చాలు, ఆవిడ ఆ రోజంతా కడుపు మాడ్చుకొంటుంది. ఆవిడ వంటకుగాను ఆవరణంలో ప్రత్యేకంగా కొబ్బరాకులతో చిన్న యిల్లువేసి, బిడ్డకొక నర్సును ఏర్పాటు చేశారు. సాధారణంగా మా పనివాళ్లు తమ తమ బిడ్డల విషయం పట్టించుకోరు కానీ, వాళ్ళకేమైనా జరిగితే మాత్రం, యజమానుల మీద నిందమోపుతారు. అందువల్ల ‘ఆయా’ బిడ్డ విషయంలో ‘ఆమె’ కూడా అప్రమత్తంగా వుంటుంది.

అలాంటి ‘ఆయా’ ఒకసారి సారాయి, నల్లమందు సేవిస్తుండగా పట్టుబడ్డదంటే ఆశ్చర్యంగా వుంటుంది. ఆవిడ అప్పుడప్పుడు బయటకు వెళ్ళి పొలికేకలు పెట్టి నానా గొడవా చేస్తుంది. ఆ సమయంలో ఆమె దగ్గరకు వెళ్లేందుకే నౌకర్లు భయపడతారు. పిశాచిలాగా అరుస్తుందని వాళ్లు అంటారు. ఆ పిశాచి కేకలతో అందరూ బెదిరిపోయి, ఎక్కడివాళ్లక్కడ దాక్కున్న తర్వాత, ఆమె బంధువులు మెల్లగా బయటకొచ్చి ఆమెకు సారాయి, నల్లమందు యిచ్చి శాంతింపజేశారు.

ఇంటి సామాన్లు కొనడం గురించి చెబుతూ, తమ బట్లరు రోజూ మార్కెట్లో వస్తువులుకొని, బిల్లులు తెస్తాడని, ఆ బిల్లుల్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేసే కోర్టు గుమాస్తా వస్తువుల పేర్లు చిత్రాతిచిత్రంగా రాస్తాడని ఆమె అంటుంది. ఇద్దరూ కలిసి కొన్ని కల్పిస్తారు అంటూ కొన్ని ఉదాహరించింది. "one beef of rump for biled" - "one mutton of line beef for alamoor estoo" meaning à-la-mode stew; - "mutton for curry pups (puffs);" "durkey for stups" (stuffing for turkey); "egg's for saps, snobs, tips, and pups" (chops, snipes, tipsycake, ana puffs); - "mediation (medicine) for ducks";- and at the end "ghirand totell" (grand total), and "howl balance".

(తరువాయి వచ్చే సంచికలో...)

## సవరణ:

ఆగస్టు సంచిక 4వ పుటలో – పెద్దలు నెమ్మాని వేంకట రమణయ్యగారికి ‘శ్రద్ధాంజలి’లో ఆయన జూలై 1వ తేదీన కన్నుమూశారని ముద్రణలో వచ్చింది. ఇది తప్పు. ఆయన జులై 24న మరణించారు. ఈ తప్పు చోటు చేసుకొన్నందుకు మన్నించ గోరుతున్నాము.

**– సంపాదకుడు, ‘అమ్మనుడి’**

పరిచయం

అచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం




రచయిత:
డా॥ వెన్నెలకంటి ప్రకాశం
వెల: రూ. 150/-లు
ప్రతుల కోసం:
9849805675
ఈ-మెయిల్:
sujatha@nirrvitha.in

వెన్నెలకంటి ప్రకాశంగారు రచించిన "వెన్నెలకంటి వ్యాకరణం" అనే ఆధునిక తెలుగు వ్యాకరణాన్ని 2018 జులై నెలలో నిర్విత ప్రకాశకులు ప్రకటించారు. ఇది 176 పుటలతో 13 అధ్యాయాలతో రచయిత చేతులమీదుగా రాసిన తొలిపలుకూ మలిపలుకులతో ప్రకటించిన ఈ వ్యాకరణం ఇప్పటికి తెలుగులో వచ్చిన వ్యాకరణాల్లా కాక మరో కోణంలో తెలుగు నుడిని పరిశీలించి కూర్చినదిగా కనిపిస్తోంది. ఈ పదమూడు అధ్యాయాలలో ఎనిమిది, అంటే 3.-10. అధ్యాయాలు, 3. వాక్యం - వాక్య బంధం-వాక్య సముదాయం, 4. నాదోత్పత్తి; 5. ఉచ్చారణ: వర్ణ వర్గీకరణ; 6. సంధి-అచ్చుల మమత; 7. కారక బంధాలు-విభక్తి వాడుకలు; 8. క్రియా పదబంధాలు; 9. నామ్నీకరణాల గురించి; 10. భావ పరిశీలన; వ్యాకరణానికి సంబంధించినవి కాగా మిగిలిన ఐదు, 1. భాష-భావం-సమాచార వ్యక్తీకరణ, 2. భాష -సమాజం- వ్యాకరణం; 11. కావ్య భాష; 12. లేఖన సమస్యలు; 13. భాషా బోధన మొదలైనవి భాషను గురించిన పరిచయమూ, సామాజిక నేపథ్యమూ, దాని అనువర్తనం గురించిన చర్చలతో పూర్తవుతుంది. చివరిగా రచయిత మలిపలుకు ఆపైన ఉపయుక్త రచనావళితో ముగుస్తుంది.

ఒక భాషకు వ్యాకరణాన్ని కూర్చేటప్పుడు ఎవరి భాషకు అనే ప్రశ్న తలెత్తుతుంది. రచయిత తను వాడే భాషకా, తన ప్రాంతంలోని భాషకా, లేక అధికసంఖ్యాకులు వాడుతున్న భాషకా లేక ఇంకేదైనానా అనే సందేహం రాక మానదు. ముందు దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలి. భాష ఇట్లా ఉండాలి అనే వ్యాకరణ రచనకంటే భాష ఇట్లా ఉంది అంటూ చేసిన వ్యాకరణ రచనే ఉత్తమం. దానివలన భాష ఎట్లా ఉంది, సమాజంలో ఆ భాషాస్థితి ఏమిటో తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈ వ్యాకరణ రచయిత, మన ప్రాచీన సాహిత్యం నుండి "అట జని కాంచె.....", "వచ్చినవాడు ఫల్గుణుండు....", "ఎవ్వనిచే జనించు......" అనే మూడు పద్యాలను తీసుకొని ఏది ఎవరికి (సగటు తెలుగువాడికి) ఎంత అర్థమౌతోందో అంటూ బేరీజు వేసుకొంటారు. మొదటిది సంస్కృత భూయిష్టం కాగా రెండవది అచ్చతెనుగు కట్టడితో ఉన్నదీ, ఇక చివరిది మధ్యస్థంగా ఉన్నదీ. అయితే ఈ మూడింటిలోకీ చివరిదే ఎక్కువమందికి అర్థమయ్యే భాషలో ఉన్నది కనుక అట్లాంటి భాషనే వాడాలి, అదే వ్యావహారిక భాషోద్యమానికి ప్రేరణ అంటూ, ఆ ఉద్యమానికి తోడైన కొన్ని మౌలికాంశాలను ప్రస్తావించారు.

వాటిలో కొన్ని ఇవి: భాష మారుతుంటుంది; మాటకూ రాతకూ సామరస్యం ఉండాలి; వ్యాకరణం ప్రయోగమూలం; వాడుక భాష కానిదాన్ని పుస్తకాలలో వాడటం ప్రయోజనకారి కాదు; దురభిమానం కూడదు. ఈ పైన రచయిత పిల్లల పాఠ్య పుస్తకాలలో కొంత వరకూ మాండలికతను ప్రవేశపెట్టితే నష్టమేమిటని ప్రశ్నిస్తున్నారు కూడా. గిరిగీసుకొని మనం వాడే తెలుగు ఇట్లాగే ఉండాలి అనే దురభిమానం తగదని రచయిత స్పష్టం చేస్తున్నారు.

మొదటి అధ్యాయంలో, భాషలో భావానికీ దాని వ్యక్తీకరణకూ సంబంధాన్ని ప్రతిపాదించటానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలోని సారాంశం ఇదిగో చదవండి. భాషకు మూలమూ ఫలమూ రెండూ భావమే. ఇంకా, మూలం, ఫలం ఈ రెంటి మధ్యా ఎలాంటి తేడా లేనప్పుడే ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ అర్థవంతం. తేడా ఉంటే అపార్థం. అంటే అర్థవంతమైన మాటలు మాట్లాడేందుకూ, రచనలు రాసేందుకూ వ్యాకరణ వాడుక చక్కగా ఉండాలి అంటారు. అలాగే భావ వ్యక్తీకరణ-ప్రక్రియ వక్తకూ శ్రోతకూ మధ్య జరిగే అనేకానేక ప్రక్రియలద్వారా సాధ్యమౌతోందని కొంత విపులంగానే చర్చిస్తారు.

ఇక రెండవ అధ్యాయంలో, వ్యాకరణాన్ని నిర్వచించే ప్రయత్నం చేశారు. వ్యాకరణం, ".....పదాల, పదబంధాల, వాక్యాల, వాక్య బంధాల, వాక్య సముదాయాలలో కనిపించే నియమావళి ....." అలాగే, భాష వాడుకలో "సామాజిక ఔచిత్యాన్ని" సూచించే నియమాలనుకూడా వ్యాకరణంలో భాగమంటారు. ఉదాహరణకు అది, ఆమె, ఆవిడ, వారు లాంటి సర్వనామాల వాడుకలోని నియమాలు సామాజిక ఔచిత్యానికి సంబంధించినవి. ఇవి మౌలిక(ంగా) రూప వ్యాకరణంలో భాగం కానివి అంటారు. ఈ అధ్యాయం చివరలో, తెలుగు భాష స్వరూప స్వభావాలగురించిన కొన్ని లక్షణాలను పేర్కొంటారు: ఉదాహరణకు, క్రియ లేని వాక్యాలూ, పదాలలో 'ఊనిక' ప్రాముఖ్యత, క్రియాన్వయం ఉన్నచోట కర్తను వాడకుండటం మొదలైనవి. తర్వాత ఈ చర్చ, తెలుగులో భాషావైవిధ్యం అంటూ మాండలికత, తీరు, శైలి, రీతి అనే తేడాలతో మొత్తం నాలుగు రకాలని చెబుతూ సోదాహరణంగా వివరిస్తారు.

మూడవ అధ్యాయంలో వాక్యం - వాక్య బంధం - వాక్య సముదాయం గురించి చర్చించారు. వాక్యాన్ని నిర్వచిస్తూ వాక్యం పలుకు రూపంలో దిగుడు స్వరంతో కూడి ఉంటుంది. రచనలో అయితే చుక్కతోకూడి ఉంటుంది. వాక్యానికి ముగింపు ఉండాలి అంటారు. ఇక్కడ భావం గురించి చెప్పకపోయినా ముందు చెప్పినట్లు భావ సమగ్రత కూడా చెప్పారనుకోవాలి. వాక్య సముదాయాల నిర్మాణంలో సంయోజకత్వాన్ని సూచించే పదాలు ఉంటాయి. నాల్గవ అధ్యాయంలో నాదోత్పత్తిని గురించీ ఆ తరువాత వచ్చే ఐదూ ఆరూ అధ్యాయాలలో వర్ణాల వర్గీకరణ, సంధి అచ్చుల సమీకరణాలకు అవసరమైన వివరణ ఉంది.

ఐదో అధ్యాయంలో తెలుగు ధ్వనుల ఉత్పత్తినీ, స్థాన, కరణ,

ఉచ్చారణా విధానంగురించీ విపులంగా చర్చించారు. ప్రకాశంగారు ఇంతకుముందు ఇతరులు గమనించని ఒక అంశాన్ని ప్రస్తావిస్తారు. అదేమిటంటే, తెలుగులో సంధులు సాధారణంగా స్థానాశ్రిత వర్గీకరణపై ఆధారపడి జరుగుతాయని ఇప్పటివరకూ నమ్ముతున్నాం. ఆయితే, త్-ల్ మధ్య, త్-న్ మధ్య సంధి జరగక పోవడం, భిన్న వర్గాలకు చెందిన ట్-ల్, డ్-ల్, ట్-న్, డ్-న్ మధ్య జరగడం, అలాగే ట్-చ్, ట్-జ్, డ్-చ్, డ్-జ్‌ల మధ్య జరగడం, ఇంకా స్-త్ ల మధ్య సంధి జరగడాన్ని నిశితంగా పరిశీలించి వర్ణాల వర్గీకరణ స్థానాలపై ఆధారపడినాగానీ దానికీ వర్ణప్రవర్తనకూ ఎలాంటి సంబంధం లేదంటారు. అందుకని ప్రకాశంగారు కరణాశ్రిత వర్గీకరణపై ఆధారపడి సంధి సూత్రాలను ప్రతిపాదిస్తారు. ఉదాహరణకు, ప, బ, మ, (వ) ఓష్ఠ్యాలుగానూ, త, ద, స, చ, జ (య) లను జిహ్వోపాగ్రాలుగానూ, ట, డ, న, ణ, ల, ళ, ర లను జిహ్వాగ్రాలుగానూ, క, గ లను జిహ్వామూలీయాలుగానూ వర్గీకరించి సంధి కార్యాలను సూత్రీకరించటం తేలిక అని సోదాహరణంగా నిరూపిస్తారు. వారు ఇచ్చిన వివరణ ఇప్పటికి ఇదే మొదటిసారి. వారు చెప్పిన సూత్రం: “జిహ్వాగ్రాలు సంధికి పూర్వంలో ఉన్నప్పుడు పరంలో ఉన్న జిహ్వోపాగ్రాలతో కరణం విషయంలో సమీకృతమౌతాయి”. ఉదా. చూ.:

పాల్[+జిహ్వాగ్ర] అ+త్[+జిహ్వోపాగ్ర] ఓ= పాల్ల్[+జిహ్వోపాగ్ర] అ+త్[+జిహ్వోపాగ్ర] ఓ= ప్లాల్తో

అలాంటిదే, జిహ్వాగ్రాలు పరంలో ఉన్న పరివేష్టిత జిహ్వాగ్రాల కారణంగా పరివేష్టితాలు అవుతాయి. ఉదా. పాలు+డబ్బా = పాళ్డబ్బా.

పై సూత్రం ప్రవర్తిల్లి పరంలో ఉన్న స్పర్శేతర హల్లు ముందుగా పరివేష్టితంగా మారుతుంది. ఆ పైన పూర్వ స్పర్శం పర హల్లు నుండి అనునాసికతనూ పార్శ్వికతనూ పొందుతుంది.

అంటే **బడి+ని > బడ్+ణి -> బణ్+ణి** అవుతుంది.

తెలుగు సంధి నియమాలకు వర్ణాల స్థానాశ్రిత వర్గీకరణ కంటే కరణాశ్రిత వర్గీకరణ ముఖ్యమూ ఉపయోగకరమూ అని మొట్టమొదటిసారి ప్రతిపాదించి సోదాహరణంగా నిరూపిస్తారు.

అలాంటిదే ఏరు, నూరు, మోకాలు లాంటివి ఏటి, నూటి, మోకాటి కావడం కరణాశ్రిత వర్గం కావడమే నంటారు. అలాంటివే నూయి-టనూతి, చేయి-టచేతి కావడంకూడా అంటారు. కారణం, య, త'లు జిహ్వోపాగ్రానికి చెందటం అంటారు. కానీ ఈ వివరణ ఇట్లా సంధి జరిగినవాటి గురించి చెబుతుంది సరేగానీ సంధి జరగనివాటిగురించి ఏం చెబుతుంది. నేటి తెలుగులో పదాంతాలలో ను, లు, రు, యి ఉండి సంధిలో ఎలాంటి మార్పు పొందనివే కోకొల్లలు. అంటే చారిత్రికంగా ధ్వనులలో వచ్చిన మార్పులవలనే నేడు సంధి కార్యాలలో విరళంగా కనబడుతున్నవీ సామాన్య సూత్రాలకు లొంగనివీను.

అచ్చులమధ్య జరిగే మార్పులను స్వరమైత్రి అనీ, స్వర సమీకరణం అనీ అనడం ఆనవాయితీ. ఈ రచయిత వీటిని అచ్చుల మమత అంటున్నారు (ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న పారిభాషిక పదాలను వాడక కొత్తపదాల వాడుక ఎందుకో). రెండూ అంతకంటే ఎక్కువ వర్ణాలమధ్య జరిగే సంధి కార్యాలలో “తోడి వర్ణాలను తాకే ధ్వన్యంశాలను” అలా కానివాటినుంచి వేరుచేసి వర్గీకరిస్తారు. వాటినే చరాంశాలూ స్థిరాంశాలుగా పేర్కొంటారు. అంటే ఒక వర్ణానికి సంబంధించిన ధ్వన్యంశాలు మరో వర్ణానికి గనక పాకితే వాటిని చరాంశాలు గానూ అట్లా పాకలేని ధ్వన్యంశాలను స్థిరాంశాలుగానూ చూడాలి అంటారు. ఇప్పటివరకూ తెలుగులో జరుగుతున్న స్వరసమీకరణంపై చే. రామారావుగారూ, క.వెం. సుబ్బారావు గారూ, కే. నాగమ్మారెడ్డి, జె.వి. శాస్త్రిగారూ, గా. ఉమామహేశ్వరరావు మొదలైనవారు ఎందరో విపులంగా చర్చించినా చరాంశాల ప్రతిపాదన ఇదే ప్రథమం.

కారక బంధాలు-విభక్తి వాడుకలు అనే ఏడవ అధ్యాయంలో ఇప్పటివరకూ ఎవరూ వాడని పారిభాషిక పదజాలం వాడుతూ తెలుగులో ఐదు రకాల వాక్యాలు ఉన్నాయన్నారు. వాటికి వరుసగా, గుర్తింపు వాక్యాలు (అతను కోపిష్ఠి), చెందుడు వాక్యాలు (నాకు రెండు కార్లు ఉన్నై), మనోప్రవృత్తి వాక్యాలు (అతనికి ఇడ్లీలంటే ఇష్టం), అస్తిత్వ వాక్యాలు (డాక్టరుగారు ఉన్నారా?), కార్య వాక్యాలు (అతను పరిగెత్తాడు, తలుపు తెరుచుకుంది) అని పేర్లు పెట్టారు. ఇవి పూర్తిగా వక్త అనుభవపూర్వకమైన వ్యక్తీకరణపై ఆధారపడి చేసిన విభజన. భద్రిరాజు కృష్ణమూర్తి, చేకూరి రామారావు, మొదలైన వ్యాకర్తలు నిర్మితిని ప్రధానంగా తీసుకొని వాక్య విభజన చేశారని చెప్పాలి. అట్లాగే, రచయిత తెలుగు వాక్యాలలో ఉక్తం, ఆఖ్యాతాల తేడాను గుర్తించడం ముఖ్యమైనదని చెబుతూ, వివిధ వాక్యాల్లోని తేడాలను ఉద్దేశ్య విధేయాల సంయోజనంగానే గుర్తిస్తారు. అయితే ఇదంతా వాక్యాలలో వివిధ రకాలను గుర్తించడం వరకే. అసలు, వాక్యాల అర్థావగాహన వాక్యాలలో వాడిన నామబంధాల విభక్తి రూపాలవలన ఏర్పడుతుందని చెబుతూ ఎనభైదాకా ఉన్న విభక్తి ప్రత్యయాలనూ ఉపపదాలనూ మొత్తం 37 రకాల అర్థపరకమైన నామసంబంధాలు గానూ మళ్లీ వాటిని 14 రకాల కారక సంబంధాలుగానూ విశ్లేషిస్తారు.

ప్రాణంతీయు లేక చంపు అనే క్రియలు సమానార్థకాలు అని మన సాధారణ నమ్మకం. అయితే అవి కావనీ వాటి వాడుక రుజువుపరుస్తోంది అని ఉదాహరణలతో చూపిస్తారు.

(18) ఆ విషం అతని ప్రాణం తీసింది.

(20) ఆ విషం అతనిని చంపింది.

20 వ వాక్యం బాగుండకపోవటానికి కారణం చంపు అనే సకర్మక క్రియా వ్యాపారానికి కర్తృత్వం వహించలేకపోవటంగా కనబడుతోంది. మరి అదే విషం 18 వ వాక్యంలో ఎలా సాధ్యమైంది. ప్రాణం తీయడం, చంపడం రెండూ స్థూలంగా ఒకే అర్థాన్ని స్ఫురిస్తున్నా వాటి అర్థకాలమధ్య తేడా కనబడుతోంది. ప్రాణంతీయడానికి కర్తృ పదాలు ప్రాణులు కాకపోవచ్చుగానీ చంపడానికి కర్తృ పదాలు ప్రాణులైవుండాలని నియమం తెలుగులో ఉందనిపిస్తోంది.

క్రియా పదబంధాల గురించి 8 వ అధ్యాయం లో చర్చించారు. దీన్లో, కార్యస్థితీ (aspect) కాలసూచనా (tense) రెండూ ప్రత్యయాలతోనే తెలుస్తాయని చెబుతూ, “తెలుగులో ఉండు అనే క్రియ మాత్రమే కాలాన్ని సూచిస్తుంది” అనీ, ... “మిగతావన్నీ కార్య స్థితిని సూచిస్తాయి” అంటారు. ఇట్లా వీరిదే మొదటి ప్రయత్నం అనుకుంటాను. 97 వ పుటలో ఇచ్చిన పటానికి వివరణ ఇంకా ఉంటే బావుండేది.

ఇక 9వ అధ్యాయంలో నామ్నీకరణాలగురించి చేసిన చర్చ చేకూరి రామారావు (చేరా) గారి ప్రతిపాదనలపై సమీక్షా వ్యాసంలాంటిది. చేరాగారి ప్రతిపాదనలలో ఉన్న కొన్ని సమస్యలను పట్టుకొని చర్చించటం జరిగింది. భావ పరిశీలన అనే పేరుతో 10 వ అధ్యాయంకింద తెలుగు వాక్యాల అర్థ స్ఫోటన ఎలా జరుగుతుందో వివరించబూనటం ఒక విధంగా ఈ వ్యాకరణంలో ఉన్న కొత్తదనమే.

పదం, వ్యాకరణం, స్వరం ఇంకా సందర్భం అనే నాల్గింటిని తీసుకొని అర్థ స్ఫూర్తిని వివరిస్తారు.

11 వ అధ్యాయంలో కావ్యాలలో వాడే భాషను గురించి చర్చిస్తారు. ఒకరకంగా ఇది వ్యాకరణంలో భాగం కాకపోయినా ముందు చర్చించిన వ్యాకరణ ప్రతిపాదనలకు ఇక్కడ ప్రయోగాత్మక పరిశీలన జరిగినట్లుగా చెప్పుకోవాలి. ప్రాచీన రస సిద్ధాంత కర్తలైన భామకుడు, విశ్వనాథుడు, జగన్నాథుడు, వామనుడు, ఆనందవర్ధనుడు మొదలైనవారి సిద్ధాంతాలన్నీ చదివేవారికీ వినేవారికీ కలిగే ప్రత్యేకానుభూతికి మూలం వ్యంజన, ధ్వని, రీతి, వక్రోక్తి మొదలైనవే అని అంటారు. అంటే సాధారణ వ్యాకరణానికి అనుగుణంగా ఉండని రచనా సాంప్రదాయం అనుకోవాలి. అయితే ఇవేమీ వ్యాకరణ విరుద్ధాలు కావుగానీ అసాధారణ వ్యాకరణ ప్రయోగాలుగా చూడాలి. చేరాగారు అప్పుడప్పుడు అంటుండేవారు అందరూ చెప్పినట్లు చెబితే కవి ఎందుకవుతాడు అని. ఇందులో అసలు విషయం ఏమిటంటే వ్యాకరణం నడ్డి వంచుతారే తప్ప వ్యాకరణ భంగం కానివ్వరు. ఇట్లాంటి వంగిన వ్యాకరణం కావ్యానికి రసపోషణకు తోడ్పడుతుంది. దీనినే వ్యాకరణ సమత (సమ్మతి) అంటూ దానితోపాటు వర్ణ సమత, పదసమత, స్వరసమత మొదలైనవన్నీ కలిసే సంపూర్ణ సమత చేకూరి వాక్యభావానికి దారితీస్తుందంటారు.

లేఖన సమస్యలనే మరో అధ్యాయంలో తెలుగు లేఖనంలో సమస్యలుగా గుర్తించిన కొన్ని వ్యాకరణ అంశాలను గురించి చర్చిస్తారు. వీటిలో కొన్ని అర్థసందిగ్ధతకు అస్పష్టతకూ దారితీసినా మిగిలినవన్నీ కలన శైలిలో భాగమే. ఆధునిక యుగంలో ఎంతో కొంత సొంత మాండలికం రాతలో మాటలో కనబడకపోదు. వాటిని తగ్గించుకోవాలసిన అవసరం సందర్భాన్నిబట్టి ఉండొచ్చు. ఈ అధ్యాయంలో చివరిగా గతి తప్పిన విరామ చిహ్నాల వాడుకను ఉదాహరణలతో ప్రదర్శిస్తారు. ఈ వ్యాకరణంలో చివరి అధ్యాయంలో తెలుగు భాషా బోధన గురించిన చర్చలో భాషాబోధనలో నేర్చుకొనే వ్యక్తికి అవసరమైన భాషాంశం గురించీ, క్షేత్ర పరిధి గురించీ వాటిలో ఉండే ప్రత్యేకతలూ వాటివలన వచ్చే సమస్యలను అధిగమించడం గురించి స్థూలంగా చర్చిస్తారు. చివరికి కొసరుగా విశిష్టభాషగా తెలుగు కావడానికి తెలుగుకు ఉన్న విశిష్టతలను కొన్నింటిని చర్చిస్తారు.

వెన్నెలకంటి వ్యాకరణంపేరుతో ఆధునిక తెలుగు వ్యాకరణ వర్ణనలో చాలా వరకూ కొత్త వరవడిలో రాసినవే. వ్యాకరణంలో ఏమాత్రం ఇష్టం ఉన్నవారైనా దీన్ని తప్పక చదివే ప్రయత్నం చేయాలి. భాషాశాస్త్రంలో ప్రవేశం ఉన్నవారికి ఈ శైలి సహజంగా అనిపించినా సాంప్రదాయక వ్యాకరణంతో పరిచయం ఉన్నవారికి ఎంతోకొంత కొత్తగానే ఉంటుంది. ఆధునిక భాషాశాస్త్ర వరవడిలో సమగ్ర తెలుగువ్యాకరణం ఇంకా రాలేదనే చెప్పాలి. అయితే ఇలాంటివి భవిష్యత్తులో సమగ్ర తెలుగు వ్యాకరణ రచనకు ఆధారాలు అవుతాయి. రచయిత యార్కు విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రంలో పిహెచ్.డీ. పొంది వివిధ విశ్వవిద్యాలయాలలోనూ ప్రత్యేకంగా ఇంగ్లీషు తదితర విదేశీభాషల విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా భాషాశాస్త్ర బోధకుడిగానూ గడిచిన ఐదు దశాబ్దాలుగా చేసిన పరిశోధనలలో గడించిన అనుభవంతో కూర్చినది కావడం ఈ వ్యాకరణం ప్రత్యేకత.

కవిత

# తెలుగు నుడి

గుండెల్లో ఒదిగిపోయే కమ్మదనం
తెలివిని పెంచుటే తెలుగుకున్న గొప్పగుణం
అమ్మపాలలా పౌష్టికం జుంటితేనెలోని తీపిదనం
లే ఎండల్లోని చురుకుదనం పున్నమి వెన్నెలలోని చల్లదనం ...
తపనపెంచే లోచనం తాజా పూల పరిమళం ....
మనశ్వాసలో నిలిపి మానవతై
మెరిసేది మన తెలుగు...!
దశదిశలా మల్లెల పరిమళమై ఎదలో చిలిపితనాన్ని కురిపించేది
జాను తెలుగు!

నన్నయకవి ప్రసన్నత పాల్కురికి ప్రావీణ్యత...
శివకవుల జానుతెనుగు శివమెత్తిన దేశీయత...
తిక్కన రసనైపుణ్యం ఎర్రన నాచన వర్ణన ..
శ్రీనాథునిపాండిత్యం పోతనకవి సహజత్వం..
తేటతేట హృదయాలకు వెలుగునింపు
దివ్యగుణమే తెలుగు

శతక కవుల చమత్కృతులు పదకీర్తన జావళీలు
కృష్ణరాయ స్వరయుగం కావ్యరసం కమనీయం
అచ్చతెనుగు జిగిబిగీలు అతులిత మాధురీ మహిమలు...
ముద్దుపలుకు గుంఫనాలు శ్లేష ద్వ్యర్థి చేమ కృతులు...
వలపుల వయ్యారి కులుకు నవరస నాట్యపు నడకల నవ్యతెలుగు

ముత్యాలసరులతోగురజాడ
అమలిన శృంగార శోభగా రాయప్రోలు
కందుకూరి సంస్కారం గిడుగుమూర్తి వ్యవహారం....
కృష్ణశాస్త్రి విశ్వనాథ శ్రీశ్రీల భావుకతా...
జాషువా దాశరథీ సినారె కాళోజిల మానవతా
సూరి బ్రౌను ప్రతాపరెడ్డి వట్టికోట ఆధునికత దివ్యతెలుగు

వచనకవిత నవల కథల కాల్పనికత వాస్తవికత....
అరస విరస దిగంబర నయాగరా చేతనత్వ...
హేతువాదమనుభూతి స్త్రీవాదపు దళిత గీతి..
మణిపూసలు నానీలు పలుకుబళ్ళు హైకూలు...
నిఖార్సైన జానపదం నిత్యనూత్న సుకుమారమే తేటతెలుగు!!
ఎదసవ్వడి గుసగుస గుణగణాల మాధుర్యం మాతృభాష.

డా.పాండాల మహేశ్వర్
99121 80054

జిల్లాస్థాయి వరకు కోర్టుల్లో తీర్పులు తెలుగులో తేవాలి (జి.ఒ.నెం. 485/29.3 1974)

ఫుస్తక పరిచయం

# పరమపూజనీయ డా॥ హెడగేవార్

## జీవితము–సందేశము




అనువాదం, వ్యాఖ్యానం
వెల : రు. 90/-
ప్రచురణ :
నవయుగ భారతి
ప్రచురణలు
ప్రతులకు: సాహిత్యనికేతన్,
హైదరాబాదు :
040 27563236
విజయవాడ :
94406 43348

**ధ**ర్మాన్ని, సమాజాన్ని, మన సంస్కృతిని రక్షించుకొనటానికి, హిందువులను సక్షమమైన సంఘటనగా తీర్చిదిద్దటమే ఆశయంగా 'రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్' ను స్థాపించిన డా॥కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ ('డాక్టజీ' అని, 'పరమ పూజనీయ' అని సంఘ పరివారం) (1889 - 1940) జీవితం-సందేశాలను పేర్చికూర్చిన వ్యాసాల సంకలనం ఇది. ఈ సంకలనాన్ని నాలుగు ప్రధాన అధ్యాయాలుగ విభజించారు. 1925వసం॥ విజయదశమి నాడు స్థాపించబడి, ఈనాడు భారతదేశమంతటా నిస్వార్ధ సమాజసేవకు సర్వదా సంసిద్ధంగా (RSS) కార్యక్రమాలు సాగిస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక సంఘం గురించి మాత్రమే తెలిసినవాళ్లకు ఆ సంస్థను స్థాపించి హిందూదేశపు అభ్యుదయానికి కల్పవృక్షంగా ఫలాలను అందించిన 'డాక్టర్ జీ' జీవిత సంగ్రహం; వారు వివిధ సందర్భాలలో సంఘ కార్యకర్తలనుద్దేశించి చేసిన ప్రసంగాల పాఠం వారి సమాధి ఉన్న నాగపూరులోని రేశమ్ బాగ్ సంఘస్థాన్‌లో 'స్మృతి మందిరం' నిర్మాణం - రూపకల్పన - ప్రారంభోత్సవ విశేషాలు ప్రత్యేక అనుబంధంగా సంఘస్థాపనకు ముందు 'రాజద్రోహం' నేరం ఆరోపింపబడి స్వాతంత్ర్య సాధనకు జైలుయాత్ర చేసిన ఘట్టం మొ॥ ముఖ్యమైన ఆసక్తి కరమైన విషయాలతో 'డాక్టర్జీ' గురించి తెలుసుకునే అవకాశం పాఠకులకు కలుగుతుంది.

నాగపూరులో ఒక నిరుపేద సనాతన కుటుంబంలో బలీరామ్ పంత్, రేవతి దంపతులకు తేదీ01-04-1889న జన్మించిన డాక్టర్‌జీ, 12సం॥ల వయస్సులో తల్లిదండ్రులు ప్లేగు వ్యాధితో మరణించగా పెద్దన్న మహాదేవశాస్త్రి పెంపకంలో బాల్యం, విద్యాభ్యాసం గడిచింది. విద్యార్ధి జీవితంలోనే ఆయన చేసిన ప్రతిపనిలోనూ దేశభక్తి, స్వాతంత్ర్యేచ్ఛ ప్రస్ఫుటంగా కనిపించేవి. 'వందేమాతరం' సమస్యపై, దేశాభిమానాన్ని విద్యార్ధులలో మేల్కొలు పుతున్నందుకుగాను రెండు పాఠశాలల నుండి వెడలగొట్టబడి, చివరకు పూనావెళ్లి జాతీయ పాఠశాలలో చదివి మెట్రిక్యులేషన్లో ఉత్తీర్ణులవుతారు. తరువాత కొంతకాలంపాటు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసి, ఇంట్లో చదువుచెప్పి (ట్యూషన్లు) కొంత ధనం పోగుచేసుకొని, 1910లో కలకత్తాలోని నేషనల్ మెడికల్ కాలేజిలోచేరి, ప్రథమశ్రేణిలో ఎల్.ఎమ్. & ఎస్. పరీక్ష పాసయి డాక్టరు పట్టాను పొందారు. కలకత్తాలో ఉన్న ఆరు సం॥ల కాలంలో స్వదేశీ ఉద్యమంలో పాల్గొని దేశభక్తికి ఒరవడి దిద్దుకున్నారు. అప్పుడే 'గరమ్ దళ్' (అతివాద) రాజకీయ పక్షంలో చేరారు. బెంగాలీ ప్రజలు ఆరంభించిన ప్రతి ఉద్యమంలోను కార్యక్రమంలోను అత్యంతోత్సాహంగా పాల్గొంటూ ఉండేవారు. రాష్ట్రోద్ధరణ, సమాజ సేవలే ప్రధానంగా భావించి ధ్యేయవాదజీవితం గడపాలనే సంకల్పంతో డాక్టరు వృత్తి చేపట్టకుండా వివాహం చేసుకొనకుండా, అంతకంటే పరమ శ్రేష్ఠమైన కర్తవ్యం తాను చేపట్టాలని సంసారబంధం, తాపత్రయాలకు దూరంగా ఆదర్శాలను వదలుకోవటం యిష్టపడని 'డాక్టరుజీ' ఆజన్మ బ్రహ్మచారిగా జీవితాన్ని నిర్దేశించుకున్నారు.

1915వ సం॥నుండీ 1924 వసం॥వరకు దేశంలో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమాలలో పాల్గొనటం మాతృదేశ దాస్యవిముక్తికి, సంపూర్ణ దేశస్వాతంత్ర్యం కోసం అలమటించి, ఆంగ్లేయుల ప్రభుత్వాన్ని చూసి సంక్షోభించిపోయిన డాక్టర్‌జీ 1920లో నాగపూరులో జరిగిన కాంగ్రెస్ సమావేశానంతరం, పాల్గొన్న ప్రతి సభలోను మహోద్రేకంతో ఉపన్యాసాలు యిచ్చేవారు. 1920 అక్టోబరులో కాటోల్‌లోను, భరత్ వాడలోను జరిగిన సభలలో డాక్టర్‌జీ యిచ్చిన ఉపన్యాసాలు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలుగ రెచ్చగొట్టేలా ఉన్నాయని, బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ద్వేషాన్ని వ్యాపింపచేసి తిరుగుబాటుకు పిలుపునిచ్చారని మే1921లో వారి పై రాజద్రోహంగా అభియోగాలు చేసి కేసు దాఖలు చేయబడింది.

న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేసినవాడు కాకపోయినా, డాక్టర్‌జీ కేసు విచారణ పగ్గాలను తన చేతిలోనికి తీసుకుని తానే స్వయంగా సాక్షిని ప్రశ్నించటానికి అనుమతి పొందారు. చివరకు, ఒక భారతీయునిపై జరిగే కేసులో విచారణకు వచ్చే అంశాలను విని నిర్ణయాలను ప్రకటించడంలో బ్రిటీషు న్యాయమూర్తి పనికిరాడని ఫిర్యాదు కూడా చేసి ఇంతకుముందు ఎన్నడూ జరగని విధంగా సంచలనం సృష్టించారు. అయితే బ్రిటీషు ప్రభుత్వం ఈ అర్జీని పక్కకు పెట్టగా, కేసు విచారణ యథాప్రకారం అదేజడ్జితో (స్మైలీ) విచారణ కొనసాగింది. న్యాయస్థానం ఆగస్టు 21, 1921నాడు తన నిర్ణయాన్ని వినిపిస్తూ డాక్టర్‌జీ ఉపన్యాసాలు నిస్సందేహంగా రాజద్రోహంగా ఉన్నాయని, అందుచే ఒక సం॥వరకు ఈ తరహా ఉపన్యాసాలు చెప్పనని హామీ పత్రాన్ని యివ్వాలి, జమానతుగా వెయ్యేసి రూపాయలకు ఇరువురినుండి-హామీ పత్రాలను, మరో వెయ్యి రూపాయలకు వ్యక్తిగత హామీపత్రాన్ని వ్రాసి ఇవ్వాలని ఆదేశించింది. జమానతు, హామీ పత్రాలు ఇవ్వడం తనకు అంగీకారం కాదు అని డాక్టర్‌జీ ఖరాఖండిగా చెప్పడంతో, న్యాయమూర్తి వారికి ఒక ఏడాదిపాటు కఠిన కారాగారవాస శిక్ష విధించారు. వలస పాలనకాలంలో సామ్రాజ్యవాదాన్ని సిద్ధాంతపరంగా విరోధించిన చరిత్రకు ఇది ఒక దృష్టాంతం. డాక్టర్‌జీ త్యాగం, న్యాయ స్థానంలో చేసిన దేశభక్తిపూరిత వాఙ్మలమూ, యువ జాతీయ వాదులకు ఎంతో

శక్తిని, ఉత్సాహాన్ని, ప్రేరణను యిచ్చి ఎంతో జనాదరణకు పాత్రుడయ్యారు.

స్వరాజ్యము, జాతీయత, హిందూత్వము, నిజమైన స్వాతంత్ర్యమూ అంటే ఏమిటో ప్రచారం చేయడానికి నాగపూరులోనే 'స్వాతంత్ర్య', అనే దినపత్రికను ప్రారంభించి కొన్నాళ్ళు పత్రిక ద్వారా ప్రచారం సాగించారు. అయితే, ప్రభుత్వం ఈ పత్రికపై ఆంక్షలు విధించి, ఆటంకాలు కలిగించడంతో పత్రికా ప్రచురణ ఆగిపోయింది.

భారత జాతీయ కాంగ్రెసు కార్యక్రమాలలో పాల్గొన్న డాక్టర్‌కి, జాతి నిర్మాణంలో కాంగ్రెసు అనుసరించిన విధానాలు, రాజకీయాలు నిరాశను కలిగించాయి. 1923లో హిందూ, ముస్లింల మధ్యచోటు చేసుకున్న విద్వేషాలు, అల్లర్లు ఆయనను ఎంతో కలచివేసాయి. లోకమాన్య బాలగంగాధర తిలక్, వినాయక దామోదర సావర్కారు, బాబూరావు సావర్కారు మరియు ప్రధానంగా బి.ఎస్.మూంజే మొ॥ వారి ప్రభావం వారిపై పడింది. వీరసావర్కారు ప్రతిపాదించిన 'హిందూత్వ' సిద్ధాంతం ప్రభావంకూడా ఆయనపై విపరీతమైన ప్రభావం చూపింది. దేశంలో జరుగుతున్న ఉద్యమాలు, సంస్థల కార్యక్రమాలు, రాజకీయ పార్టీలు అనుసరించే విధానాలు అన్నిటినీ అధ్యయనం చేసారు. మాతృభూమియైన భారతవర్షం వైశాల్యంలో, జనసంఖ్యలో, సృష్టి సౌందర్యంలో, ఖనిజసంపత్తిలో, పాడిపంటలలో, యివిగాక వేదాంతం, ధర్మం, సంస్కృతి, చరిత్ర, విద్య, పరాక్రమం, కళాకౌశల్యాదుల్లో ఎంతో ముందుండిన హిందూ రాష్ట్రం ఎందుకు ఈ విధంగా వెనుకబడింది అనే ఆలోచన ఆయనను వేధించసాగింది. ఆవేదన నుంచి ఒక నూతన మార్గాన్ని అన్వేషించాలనే సంకల్పం ఆయనలో చోటు చేసుకుంది. భారత జాతీయత, హిందూ సంస్కృతి మరియు వారసత్వం మూలాధారాలుగ ఉండవలసినదేనని గాఢంగా నమ్మారు. 'హిందూత్వ'మే యధార్ధ భారత జాతీయత' అనే సిద్ధాంతం డాక్టర్‌జీ ఆలోచనలలో దృఢంగా పాతుకుపోయింది. 'హిందూ' రాష్ట్రాన్ని సముద్ధరించాలని, ఆ ధ్యేయం నెరవేరటానికి, నివురుగప్పిన నిప్పులా చేయటానికి ' రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' ను ఒకరాష్ట్రీయ సంఘటనోద్యమంగా ప్రారంభించారు.

మహాపురుషులకు క్రియాసిద్ధి, 'సత్వ' మనే మహత్తరగుణంతో లభిస్తుంది; ఉపకరణాలవలన కాదు- అని పండితులు చెప్పిన లోకోక్తి డాక్టర్‌జి విషయంలో ప్రత్యక్ష ఉదాహరణ. నాగపూరులో బీజమెత్తిన సంఘ వృక్షం, కాలక్రమేణ అన్ని జిల్లాలకు, నెమ్మదిగా దేశం నలుమూలలకు శాఖోపశాఖలుగ విస్తరిల్లింది. సంఘ సభ్యులు అందరూ క్రమం తప్పక ప్రతినిత్యమూ నిర్ణీత సమయానికి సంఘ స్థానానికి వచ్చి, సరియైనవేళకు (భగవ) ధ్వజారోహణ (కాషాయ జెండా) చేసి మాతృభూమి ప్రార్ధన చేయాలనే కఠిన నియమం పాటించే సంస్కృతిని పాటించటం సంఘం ప్రత్యేకత. సంఘం ఒక వ్యాయామశాలయని కొందరు, స్వచ్ఛంద సేవక దళం అని సేవాసమితి అని, కొందరు విప్లవ సంఘమని రకరకాల అపోహలను ఎదుర్కోవలసి వచ్చింది. అన్ని అవరోధాలను, నిషేధాలను, ఎన్నో భయంకరమైన పరిస్థితులను ఎదుర్కొని, స్వీయ సిద్ధాంతాల నుంచి అంగుళం మేరకూడా చలించక, సంఘ కార్యక్రమాలను ముందుకు నడపటంలో డాక్టర్ జీ కృతకృత్యులయారు.

సంఘ్ స్థాపించిన తర్వాత వివిధ కార్యక్రమాలలో, సందర్భాలలో సంఘ కార్యకర్తలతో సమావేశం అయినపుడు, ముఖ్యంగా 1935వ సం॥లో (అప్పటికి సంఘం స్థాపించి పదిసం॥లు అయింది) చేసిన ప్రసంగాలు ఎంతో ఉత్తేజకరంగాను, స్ఫూర్తిదాయకంగాను, హిందూ సమాజానికి సంజీవని వలె ఉండటంతోపాటు హిందూత్వ భావోద్వేగాలను రేకెత్తించేవిగా ఉండేవి. హిందూస్థాన్ హిందువులది; శివాజీ నుండి ప్రేరణ పొందుదాం; ఎందుకంటే అతడు హిందూసమాజానికి ఆదర్శంగా నిలిచే ఏకైక మహాపురుషుడు, హిందూ ధర్మాన్ని ప్రాణం పోయినా, ఆఖరినెత్తుటి బొట్టు వరకు వదలిపెట్టకూడదు. మనలనుమనం సంరక్షించుకోవాలన్నా, ఇతురులలోని ఆక్రమణ ప్రవృత్తిని తొలగించాలన్నా, మనం శక్తిమంతులం కావలసి ఉంటుంది. స్వరాజ్యం బిచ్చమెత్తితే వచ్చేది కాదు, సంపాదించుకునేది; జీవితమంతా సంఘకార్యం చేయదలుచున్న వారు కూడా చదువుకోవడం, తద్వారా సంఘం పని చేయడానికి యోగ్యతను అధికారాన్ని సంపాదించుకోవడం అవసరమే, యిలా సాగేవి డాక్టర్‌జి ప్రసంగాలు. ఈవిధంగా సంఘకార్యమే జీవిత లక్ష్యంగా, దైనిక జీవితం అంతా ప్రతి నిమిషం సంఘానికే వినియోగించి, నిరాడంబరంగాను, ప్రచారాలకు దూరంగాను, అపారమైన ధీశక్తి, అసమానము గంభీరము అయిన నీతిజ్ఞత, అచంచలమైన ధైర్యం మూర్తీభవించిన డాక్టర్జీ, తన జీవితమే ఒక మహాయజ్ఞంగా ఆహుతిచేసి, హిందూ రాష్ట్రానికి ఒక అపూర్వమైన వెలుగుని, నూతన దృష్టిని సృష్టించి- హిందూరాష్ట్రం (భరతఖండం/ఆర్యావర్తం) చరణాలపై కానుకగా రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ను అర్పించిన డాక్టజీకి 1932 నుండీ ఆరోగ్యం క్షీణించి దీర్ఘకాలిక చికిత్సలు పొంది, చివరకు1940సం॥ జూన్ 21నాడు - స్వర్గస్థులైనారు.

1940లో డా॥ హెడ్గేవార్ మరణించిన తర్వాత వారి జీవితాన్ని సంక్షిప్తంగా పరిచయం చేసిన పుస్తకం హిందీలో వెలువడింది. తెలుగులోకి అనువదింపబడిన ఈ పుస్తకం 1971లో మొదటిసారి ముద్రింపబడింది. ఆ తరువాత, 1935వ సం॥లో సంఘం స్థాపించి దశాబ్ది ఉత్సవాలు జరిపినపుడు డాక్టర్ జీ ప్రసంగం, 2003లో హిందీలో ప్రచురితమైన "డా. కేశవబలిరాం హెడ్గేవార్" ('నవభారత నిర్మాతలు' గ్రంధావళిలో భాగంగా) గ్రంధంనుండి 'రాజద్రోహానికి నేరవిచారణ' ను ప్రత్యేక అనుబంధంగా తెలుగులోకి 2004లో వడ్డి విజయసారధి అనువాదం చేసారు. ఈ విధంగా 'డాక్టర్' జీవితం- సందేశం, దానితోపాటు చేర్చిన కొత్త అధ్యాయాలతో 2019లో నవయుగ భారతి ప్రచురణలు, హైదరాబాదు వారు తమ ప్రధమ ముద్రణగా వెలువరించారు. దేశభక్తి భావనలను ప్రజ్వలింపచేయుటలో ఈ గ్రంధానికి ప్రాముఖ్యం ఉంటుందని తక్కువ ధరకే అందజేస్తున్నారు.

- ఎం.వి.శాస్త్రి
94413 42999

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# తెలుగు మొబైల్ యాపులూ వికీ వ్యాసరచనల పోటీ

**నాలుగు లక్షల రూపాయల బహుమతులు**

## వికీపీడియాలో వ్యాసాలు:

తెలుగులో– తెలుగు నుడి (భాష) గురించి, తెలుగు చరిత్ర గురించి, తెలుగు సంస్కృతి గురించిన నాణ్యమైన సమాచారం అందరికీ అందుబాటులో లేదు. వలగూడు(అంతర్జాలం) వేదికగా అందుబాటులో ఉన్న తెలుగు వికీపీడియాను ఒక ప్రాతిపదికగా తీసుకుంటే పై అంశాల గురించి నాణ్యమైన ఒక వెయ్యి వ్యాసాలు కూడా ఉండవు. మన తెలుగు వారి జనాభా తెలుగు రాష్ట్రాల్లో, తెలుగు రాష్ట్రాల బయట కలిపి 18 కోట్లు ఉంటే, కనీసం 18 మంది కూడా ఈ విషయమై చూపు సారించి తెలుగు వికీపీడియా లాంటి వనరుల్లో చురుగ్గా పనిచేయటం లేదు. ఏడాదికి కొన్ని పరిశోధనా పత్రాలు వెలువడుతున్నా, అవి ఏదో ఒక గ్రంథాలయ సొరుగులోకో, వెయ్యికి దాటని ప్రచురణగానో మిగిలిపోతున్నాయి. ఈ వెలితిని నింపుతూ, కొంతలో కొంత తెలుగు నుడి, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంశాల్లో సమాచారం వలగూడులో చేర్చే దిశగా తెలుగు భాషోద్యమ సమాఖ్య వ్యాసరచన పోటీని నడుపుతున్నది. నేడు వలగూడు అనేది సమాచారాన్ని పుట్టించటానికీ వాడుకకూ భద్రపరచటానికీ ఉన్న అతి పెద్ద వనరుగా మనముందుంది. వలగూడులో చేర్చని వ్యాసం ఎక్కువ మంది చదువరులకు చేరదు కూడా. అందరికీ అందుబాటులో ఉండే విధంగా అంశాలను చెప్పాలంటే వలగూడే అందరికీ అందుబాటులోనికి తెచ్చే సాధనం.

## వ్యాసరచన పోటీకి అంశాలు:

**1. తెలుగు నుడి:** తెలుగు నుడి పుట్టుక, వికాసం, మాండలికాలు, యాసలూ, లిపి, లేఖనం, రచనాసంప్రదాయం, వ్యాకరణం, భాషాశాస్త్ర అనువర్తనాలు, పనిముట్లు గురించి రాయవచ్చు.

**2. తెలుగు వారి చరిత్ర, తెలుగు నేల చరిత్ర:** తెలుగు వారి గురించీ తెలుగు నేల గురించిన చరిత్రకు ఆధారమైన ప్రతి అంశమూ. తెలుగువారి ప్రాచీన నాగరికతలూ, శాసనాలూ, రాగిరేకులూ, తాళపత్రాలు ఇతరత్రా చరిత్ర ఆనుపానులు.

**3. తెలుగు సంస్కృతి:** తెలుగు సమాజం, జన జీవన ప్రవంతి, సామాజిక చైతన్యం, సంస్కరణలు, మన కట్టూబొట్టూ, గుడులూ గోపురాలూ, ప్రార్థనామందిరాలూ, చెరువులూ బావులూ, పశువులూ సేద్యం, పాడీ పంటలూ, మందులూ మాకులూ, వంటా వార్పూ, తిండీ తిప్పలూ, నమ్మకాలూ మన్నింపులూ, పెండ్లిళ్ళూ పేరంటాలూ, పండుగలూ సంబరాలూ, జానపద, గిరిజన విజ్ఞానం, కథలూ కథనాలూ, ఆటలూ పాటలూ, నాటికలూ నాటకాలూ, సినిమాలూ బుల్లితెర విన్యాసాలూ ఇంకా ఇలాంటివి ఏవైనా కావొచ్చు.

**4. ఇంకా** నేటి, రేపటి తరం తెలుగింటి పిల్లలను తెలుగు నుడి వైపుకు ఆకట్టుకొనే వ్యాసం ఏదైనా రాసి పంపవచ్చు.

పై అంశాల మీద ఇంతకు ముందు ఎక్కడా ప్రచురించబడని, కొత్త, సరికొత్త వ్యాసాలే పంపండి. **అందిన మొత్తం వ్యాసాలలో 100 మేటి వ్యాసాలను ఎంపిక చేసి ఒక్కొక్క వ్యాసానికి అక్షరాలా వెయ్యి రూపాయల నగదు బహుమతి అందిస్తాం.**

## మొబైల్ యాపులు:

గడచిన పదేళ్లుగా మనలో ప్రతి ఒక్కరి చేతికీ స్మార్ట్‌ఫోన్‌లు వచ్చేశాయి. అయితే అందులో తెలుగెంత? మన తెలుగు జనాభాలో పూర్తిగా ఆంగ్లంలో నూటికి పది మంది వ్యవహరించగలిగితే, మరో 20 మంది తొలిమెట్టు ఆంగ్లంలో వ్యవహరించగలరేమో! అంటే దాదాపు నూటికి 75 మంది వచ్చీ రాని ఆంగ్లంతో మొబైల్ ఫోనులను వాడుతున్నారు. అంతరవర్తిని (ఇంటర్‌ఫేస్) స్థాయి వరకూ, పేర్లను దాచుకునే వరకూ తెలుగు ఉన్నా చాలా అనువర్తనాలు (యాపులు/Mobile apps) నేటికీ కేవలం ఆంగ్లంలోనే ఉన్నాయి. కానీ తెలుగులో అనువర్తనాలు తయారు చేసుకునేందుకు సాంకేతికంగా నేడు ఎలాంటి అడ్డంకీ లేదు. అంటే తెలుగు వారి పట్టనితనం వలననే తెలుగులో మొబైల్ యాపులు రావటం లేదు.

అందుకని తెలుగు భాషోద్యమ సమాఖ్య తెలుగు మొబైల్ యాపు నిపుణులకు తెలుగులో మొబైల్ యాపులు రూపొందించమని పిలుపునిస్తూ, మొబైల్ యాపు పోటీని నడుపుతున్నాం.

**ఈ మొబైల్ యాపు పోటీలో ఎలాంటి యాపులు రూపొందించవచ్చు?**

- ✿ తెలుగు నుడి నేర్చుకోడానికి ఉపయోగపడే యాపులు
- ✿ ఈ తరం పిల్లలు తెలుగు సాహిత్యాన్ని గురించి మక్కువతో తెలుసుకునేలా చేసే సాహిత్య ప్రధానమైన యాపులు
- ✿ తెలుగు శుభలేఖలు, ఆహ్వానపత్రాలు, సభలకు, వేదికలకు తెరలు, తయారు చేసుకునే యాపులు
- ✿ తెలుగు ఆటలూ, తెలుగు మాటలతో ఆటలు మున్నగునవి
- ✿ నేటి, రేపటి తరం తెలుగింటి పిల్లలను తెలుగు నుడి వైపుకు ఆకట్టుకొనే యాపు ఏదైనా కొత్తగా తయారు చేసి పంపవచ్చు.
- ✿ సృజనాత్మకంగా తయారు చేసి, తెలుగే కనిపించే యాపులు పంపండి

**ఎంపికైన యాపులకు 3 లక్షల రూపాయలు నగదు బహుమతులను అందజేస్తాము.**

మరిన్ని వివరాలను, వ్యాసరచన పోటీ కట్టుబాట్లను

https://telugubhashodyamasamakhya.blogspot.com వద్ద చూడగలరు.

**తెలుగు భాషోద్యమ సమాఖ్య** *e-mail:* tebhasapoti@gmail.com

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
September 2020 Vol :6, Issue 4
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20


# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532 స్థాపితం : 2001

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, **తెనాలి** - 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08644 - 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) **అంగలకుదురు** ఫోన్ : 08644 - 233299
2) **కొల్లూరు** ఫోన్ : 08644 - 243788
3) **బాపట్ల** ఫోన్ : 08643 - 224051
4) **కొల్లిపర** ఫోన్ : 08644 - 245399
5) **రేపల్లె** ఫోన్ : 08648 - 222388
6) **మంగళగిరి** ఫోన్ : 08645 - 231255

## ఖాతాదారులకు మా సేవలు

13 నెలల డిపాజిట్స్‌పై అత్యధిక వడ్డీ **8%**

సీనియర్ సిటిజన్స్‌కు 13 నెలలపై కాలపు డిపాజిట్స్‌పై ఒక శాతం అదనపు వడ్డీ **9%**

ఇళ్ళు, ఇళ్ళ స్థలాల హామీపైన, వ్యక్తిగత జామీను పైన **15%** వడ్డీతో అప్పులివ్వబడును.

ప్రతిరోజూ తక్కువ వడ్డీకే తక్షణం మంజూరయ్యే 'గోల్డులోన్స్'

నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు
చిన్న మొత్తాల పొదుపు పథకం - డైలీ డిపాజిట్

లాకర్స్ సదుపాయం కలదు

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, చరవాణి : 93478 96473



పాలక మండలి

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ చిరుమామిళ్ళ రవీంద్రబాబు, డైరెక్టర్
శ్రీ కఠారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ దావులూరి చక్రధర్ చౌదరి, డైరెక్టర్
శ్రీ ఎ. పోతురాజు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ॥శే॥ దావులూరి సోమశేఖరరావు

అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

**ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.**
**డిపాజిట్స్ చేయండి - అధిక లాభం, విలువైన సేవలు పొందండి.**


If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244